ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-7-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 173 పేజీలు: 12 వెల: 6.50

ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియ షురూ!

జస్టిస్ వర్మ కేసు విచారణ నుంచి తప్పుకొన్న సిజెఐ

9లో

# పెట్టుబడులకు 'గేట్‌వే'గా ఎపి

## నిర్మాణ, నాలెడ్జి ఎకానమీ ప్రాజెక్టులకు అమరావతిలో అవకాశం

### యేడాదిలోగా 128 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధిస్తాం

### విజయవాడ, విశాఖలో లులు మార్ట్‌లు

### జనవరి 1కి క్వాంటం కంప్యూటింగ్ రాష్ట్రం నుంచి పనిచేస్తుంది: సిఎం చంద్రబాబు



బుధవారం విజయవాడలో ఇన్వెస్టోపియా గ్లోబల్ ఎపి సమ్మిట్‌ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు, యుఎఇ ఆర్థిక, పర్యాటక మంత్రి హెచ్ఇ అబ్దుల్లా బిన్ టౌక్ అల్‌మరి తదితరులు

**విజయవాడ,జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుంటేనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. ఆర్థిక సంస్కరణలు, 1995లో టెక్నాలజీ రివల్యూషన్‌తో పరిస్థితి మారిందని తెలిపారు. ఏడారి నుంచి స్వర్గాన్ని సృష్టించిన దేశం దుబాయ్ అని కొనియాడారు. సరికొత్త ఆలోచనలతోనే కొత్త ఆవిష్కరణలు సాధ్యమని నొక్కిచెప్పారు. వికసిత్ భారత్‌తో 2047 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోందని వ్యాఖ్యానించారు. ఎపిలో 2026 జనవరి నాటికి క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. యూఎఇ అభివృద్ధిలో భారత్ భాగస్వామ్యం హర్షణీయమన్నారు. ఇండియాలో సరైన సమయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఉన్నారు అని సిఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. 2024నుంచి 2025లో వంద బిలియన్ యూఎస్ డాలర్ల వ్యాపారం యూఎఇకి ఇండియాకు మధ్య జరిగింది. గత పదేళ్లగా 11వ స్థానం నుంచి నాల్గో స్థానానికి ఇండియా చేరుకుంది. 2047కి ఇండియా ప్రపంచంలోనే నెంబర్ వన్ అవుతుంది. ఆదిశగా మేము ప్రయత్నం చేస్తున్నాం. జనవరి 1వ తేదీ నాటికి మొదటి క్వాంటం కంప్యూటింగ్ ఎపి నుంచి పనిచేస్తుంది. 575 సర్వీసులు ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇస్తున్నాం ఆగష్టు 15వ తేదీ నాటికి ఈ సంఖ్య 100శాతానికి చేరుతుంది. మీరు ఇండియాలో పెట్టుబడులు పెడితే అన్ని అనుమతులు ఆన్‌లైన్‌ద్వారా ఇస్తాం. మీరు >>2



నితీశ్ కుమార్ · ఆరిఫ్ మహ్మద్ ఖాన్ · హరివంశ్ నారాయణ్ సింగ్ · మనోజ్ సిన్హా · శశిథరూర్ · వికె సక్సేనా

# రేసులో ఆరుగురు!

## ఉపరాష్ట్రపతి పదవికి 'భారీ' పోటీ

## గవర్నర్లు, సిఎంలు, మైనార్టీలు

## ప్రక్రియ ప్రారంభించిన ఇసి

**న్యూఢిల్లీ,జూలై 23:** కేంద్ర ఎన్నికల సంఘం ఉప రాష్ట్రపతి ఎన్నికకు కసరత్తులు ప్రారంభించడంతో ఇపుడు అభ్యర్థిరేసులో నేతల పేర్లు పెరుగుతున్నాయి. వైఎస్ ప్రెసిడెంట్ రేసులో ప్రధానంగా ఆరుగురి పేర్లు వినిపిస్తున్నాయి. అందులో సిఎం, గవర్నర్లు, ఎంపీలు ఉన్నారు. ఈ ఏడాది అక్టోబరు, నవంబర్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికలపై ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక ప్రభావం ఉంటుందని పరిశీలకులుఅంచనా వేస్తున్నారు.
ఈ క్రమంలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని మొదటగా పరిశీలించేది బిహార్ నుంచే అన్న >>2



# 'సిందూర్'పై వచ్చేవారం పార్లమెంటులో చర్చ

## బిఎసి సమావేశంలో నిర్ణయించిన చైర్మన్, స్పీకర్

**న్యూఢిల్లీ,జూలై 23:** పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై వచ్చే వారం ప్రారంభంలో పార్లమెంట్‌లో చర్చ నిర్వహించేందుకు తేదీలునిర్ణయించారు. ముఖ్యంగా లోక్‌సభలో 16 గంటలు, మరుసటిరోజు రాజ్యసభలో తొమ్మిది గంటలపాటు చర్చ నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటి (బిఎసి) సమావేశంలో లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు ప్రభుత్వం అంగీకరించింది. 28న లోక్ సభలో, 29నరాజ్యసభలో ఈ పహల్గాం >>2

# రాష్ట్రంలో డేటా విప్లవం

## ఎఐ, క్వాంటం, కంప్యూటింగ్ కోర్సులతో పాఠ్యాంశాల్లో మార్పులు

## డిజిటల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి యుఎఇ సహకారం

### ఇన్వెస్టోపియా ఎపి సదస్సులో మంత్రి లోకేష్



యుఎఇ ఆర్థిక మంత్రి అబ్దుల్ బిన్ తక్ ఆల్ మరికి జ్ఞాపికను అందిస్తున్న రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్

**విజయవాడ,జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** డేటా విప్లవం ద్వారా అంతర్జాతీయంగా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందువరుసలో నిలుస్తోందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యాన జరిగిన ఇన్వెస్టోపియా గ్లోబల్ - ఆంధ్రప్రదేశ్ సదస్సులో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఐ డాటా సెంటర్లపై జరిగిన చర్చలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... సౌత్ ఏషియాలోనే తొలి 152 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ ఎపి రాజధాని అమరావతిలో జనవరిలో ఆవిష్కృతం కాబోతోంది. ఇది యావత్ ఎకో సిస్టమ్‌ను మార్చబోతుంది. విశాఖపట్నం డేటా సిటీగా అభివృద్ధి చెందుతోంది. అంతర్జాతీయంగా పలు ప్రఖ్యాత సంస్థలో విశాఖలో తమ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చాయి. ఇప్పటివరకు సాంప్రదాయ విద్యావిధానం కొనసాగుతున్న నేపథ్యంలో ఎఐ వంటి అధునాతన సాంకేతికతకు ట్రాన్స్‌ఫార్మేషన్ కష్టతరమైన పనే. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యలో ఎఐ స్కిల్ డెవలప్ ప్రోగ్రామ్‌లను ప్రవేశపెడుతున్నాం.
ఎఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి పాఠ్యాంశాలతో కరిక్యులమ్‌లో సమూల మార్పులు తెస్తున్నాం. రోజువారీ పరిపాలనలో ఎఐ వినియోగం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నది మా ప్రభుత్వ లక్ష్యం. పాదయాత్ర సమయంలో ప్రజలు సాధారణ ల్యాండ్ రికార్డుల కోస ఇబ్బందులు పడటం నేరుగా గమనించాను. అందుకోసం ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎఐ వినియోగం ద్వారా ప్రజలకు సులభతరమైన పౌరసేవలు అందించడంపై దృష్టిసారించాం. మనమిత్ర పేరుతో వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రవేశపెట్టి 600 రకాల పౌరసేవలను ప్రజలకు వేగవంతంగా అందిస్తున్నాం. ఇందుకోసం వివిధ ప్రభుత్వశాఖలను అనుసంధానిస్తూ అతిపెద్ద బ్యాక్ ఎండ్ డేటా లేక్‌ను తయారుచేశాం. ఎఐ సాంకేతితనుఅందిపుచ్చుకోవడంలో మేం యుఎఇని >>2



# నా జీవితాన్ని మలుపుతిప్పిన విశాఖ -డి.సిఎం పవన్

**విశాఖపట్నం, జూలై 23 ప్రభాతవార్త:** తనకు విశాఖ గుండెల్లో ఉందని 1992లో స్టార్ మేకర్ సత్యానంద్ వద్ద నటనలో శిక్షణ కోసం విశాఖ వచ్చాను అని ప్రముఖ హీరో, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. బుధవారం బీచ్ రోడ్‌లో గల ఏయూ కన్వెన్షన్ హాల్లో హరిహర వీరమల్లు చిత్ర యూనిట్ ఏర్పాటుచేసిన ప్రిఈవెంట్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ తనకు విశాఖ వస్తే ఒక తృప్తి ఆనందం మానసిక శక్తి వస్తుందని ఆయన చెప్పారు. ఆయనకు తనతో పాటు తన అన్న చిరంజీవికి విశాఖతో విడదీయలేని అనుబంధం ఉందని చెప్పారు. ఉత్తరాంధ్ర యాసలో పాట పాడి అభిమానులను అలరించారు. >>2

# అమరావతిలోనే స్వాతంత్ర్య వేడుకలు

- సచివాలయం పక్కన మైదానంలో జరిపేందుకు ఏర్పాట్లు
- అధికారులతో సమీక్ష జరిపిన సిఎస్ విజయానంద్

**విజయవాడ జూలై23.ప్రభాతవార్తప్రతినిధి:** ఆగస్టు 15వ తేదీన నిర్వహించనున్న 79వ భారత స్వాతంత్ర్య వేడుకలను ఈసారి రాష్ట్ర రాజధాని అమరావతిలోనే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు.ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్ర సచివాలయం వెనుక వైపున ఇటీవల పి4, ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకులు నిర్వహించిన ప్రాంతంలో స్వాంత్రంత్ర్య దినోత్సవ వేడుకలను జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని కావున అందుకు అనుగుణంగా తగిన పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.రాజధాని నడిబొడ్డు ప్రాంగణంలో తొలిసారిగా రాష్ట్ర వేడుకైన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మరీ ముఖ్యంగా బహిరంగ ప్రాంతంలోను వర్షాకాలంలోను నిర్వహించనున్నందున ఈకార్యక్రమం విజయవంతానికి మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సిఎస్ విజాయనంద్ అధికారులకు స్పష్టం చేశారు.
రానున్న స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు సంబంధించి ఆయా శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లను ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేని రీతిలో పటిష్టంగా చేపట్టాలని సిఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలమైనందున వేడుకల నిర్వహణకు తగిన రీతిలో ప్రాంగణమంతా లెవెలింగ్ చేయడంతో పాటు ప్రధాన వేదిక తోపాటు,ఇతర సీటింగ్ ఏర్పాట్లు వద్ద జర్మన్ టెంట్లు వేయించాని,వాహనాల పార్కింగ్ కు తగిన ఏర్పాట్లు చేయాలని సిఆర్డిఎ కమిషనర్ కన్నబాబును ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అదనపు డిజిపి మదుసూదన్ రెడ్డిని ఆదేశించారు.
అదే విధంగా ఆహ్వాన పత్రికలు పంపిణీ,ప్రోటోకాల్ సంబందిత అంశాలపై ప్రత్యేక చర్యలుతీసుకోవాలని గుంటూరుజిల్లా కలక్టర్ నాగలక్ష్మిని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో రాజ్ భవన్, సిఎం క్యాంపు కార్యాలయం,రాష్ట్ర సచివాలయం,అసెంబ్లీ,హైకోర్టు >>2



బుధవారం స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష జరుపుతున్న సిఎస్ విజయానంద్

# 20 లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా కార్యాచరణ

## ఇప్పటిదాకా 113 ప్రాజెక్టులకు 5.94 లక్షల కోట్ల పెట్టుబడులు రాక: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే కీలకంశంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని సిఎం చంద్రబాబునాయుడు తెలిపారు.రాష్ట్రంలో ఇప్పటి వరకు 113 ప్రాజెక్టులు, రూ.5,94,454 కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకూ జరిగిన ఎస్ఐపీబీ సమావేశాల్లో 113 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఇందులో పారిశ్రామిక రంగానికి చెందిన 46 ప్రాజెక్టులు, ఇంధన రంగానికి చెందిన 41 ప్రాజెక్టులు, పర్యాటక రంగలో 11, ఐటీలో 11, ఫుడ్ ప్రాసెసింగ్ 4 పరిశ్రమలకు చెందిన పెట్టుబడులు ఎస్ఐపీబీ ఆమోదం పొందాయి.
ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా రూ.5,94,454 కోట్ల విలువైన పెట్టుబడులు వస్తున్నాయి. అలాగే 5,56,568 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయి.20లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రి వర్గ ఉప సంఘం చైర్మన్‌గా ఉన్న నారా లోకేష్... మంత్రివర్గ సహచరులతో కలిసి >>2

# ఎఐతో బిసి హాస్టళ్ల పర్యవేక్షణ

## - మంత్రి సవిత



**విజయవాడ,జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్టీఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా బిసి హాస్టళ్ల పర్యవేక్షణ చేపట్టనున్నామని, త్వరలోనే దీనికి సంబంధించిన యాప్ రూపొందించ నున్నామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎఐతో బిసి హాస్టళ్ల జవాబుదారీతనం మరింత పెరగనున్నట్లు వెల్లడించారు. వచ్చే నెల 30లోగా హాస్టళ్లకు మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆదరణ 3.0ద్వారా కులవృత్తుదారులకు ఆధునిక పరికరాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విజయవాడ నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం ఆయా జిల్లాల బిసి సంక్షేమ శాఖాధికారులు, డిబిసిడబ్ల్యూఇఒలు, ఎబిసిడబ్ల్యూఇఒలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి >>2

# పేర్ని నానిపై తొందరపాటు చర్యలొద్దు

## - హైకోర్టు ఆదేశం

**విజయవాడ,జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణాజిల్లా పామర్రులో ఈ నెల 11న వైకాపా కార్యకర్తల సమావేశంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన కేసులో మాజీ మంత్రి, వైఎస్సార్సీ నేత పేర్ని వెంకట్రామయ్య(నాని)పై గురువారం వరకు తొందరపాటు చర్యలొద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వాదనలు వినిపించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాజరు కానున్నారని సహాయ పిపి నీలోత్పల్ చేసిన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని పిటీషన్‌పై విచారణను గురువారానికి వాయిదా వేసింది. హైకోర్టు సింగిల్ జడ్జి ఈ ఉత్తర్వులిచ్చారు. 'చెప్పి కాదు >>2



# పొంగుతున్న నదులు

## రాష్ట్రమంతా భారీ వర్షాలు

### శ్రీకాకుళంజిల్లా కంచలిలో 69 మి.మీ. అత్యధిక వర్షపాతం

**విజయవాడ,జూలై 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వానలు పలు ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్నాయి. బంగాళ ఖాతంలో ద్రోణి ప్రభావంతో బుధవారం అల్లూరి, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల సంస్థ తెలిపింది. చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు వంటి వాటి దగ్గర నిలబడరాదని హెచ్చరించింది. పశ్చిమమధ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతం మీదుగా ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు ఉత్తరాంధ్రలో పలుచోట్ల మోస్తారు నుంచి భారీ వర్షాలు, కోస్తాంధ్రలో అక్కడక్కడ మోస్తారు వర్షాలుకురిసే అవకాశం ఉందన్నారు.
ప్రజలు అప్రమత్తంగాఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలనిసూచించారు. పిడుగులతోకూడిన వర్షాలు నేపథ్యంలో చెట్లు, టవర్స్, పోల్స్ క్రింద, బహిరంగ ప్రదేశాల్లో నిలబడరాదన్నారు. రేపు, ఎల్లుండి శ్రీకాకుళం, >>2

24-7pg2exHMNWJQE.qxd:24-7pg2exHMNWJQE.qxd 01/01/01 9:56 AM Page 1





బుధవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్మును గౌరవ పూర్వకంగా కలిసిన ఐడిఇఎ ప్రొబేషనర్లు

# స్వాతంత్ర్య వేడుకలు

>> భవనాలు సహా ఇతర చారిత్రక భవనాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించాలని సిఆర్డిఎ,ఆర్అండ్ బి, ఎపి ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా వివిధ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖల కార్యక్రమాలు,పథకాలపై ప్రత్యేక శకటాల ప్రదర్శన(టాబ్లూస్)ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సమచారశాఖ అధికారులను సిఎస్ విజయానంద్ ఆదేశించారు.అంతేగాక అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై ముఖ్య అతిధి సందేశం,వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా వేడులపై లైవ్ కవరేజి తదితర అంశాలపై చర్యలు తీసుకోవాలన చెప్పారు.అంతకు ముందు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా స్వాంతత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి వివిధ శాఖలవారీగా చేయాల్సిన ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఆగస్టు 15వ తేదీన జరిగే స్వాతంత్ర్య వేడుకల మినిట్ టు మినిట్ కార్యక్రమం గురించి వివరిస్తూ ఆరోజు ఉదయం 8.30 గం.లకు స్వాతంత్ర్య దినోత్సవ పేరేడ్ ప్రారంభం అవుతుందని 8.58గం.లకు రాష్ట్ర ముఖ్యమంత్రి వేదిక వద్దకు చేరుకుంటారని ఉ.10.30 గం.ల వరకూ ఈవేడుకులు నిర్వహించే విధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్టు తెలిపారు.



బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, ఎంపి అఖిలేష్ నిరసన ప్రదర్శనలో పాల్గొన్న దృశ్యం

# పెట్టుబడులకు 'గేట్‌వే'గా ఎపి

>> ఏ ప్రభుత్వ ఆఫీసులకు వెళ్లాల్సిన అవసరం లేదు. మా హ్యాండ్ హోల్డింగ్ ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ఆర్థిక సంస్కరణలు,1995లో టెక్నాలజీ రివల్యూషన్‌తో పరిస్థితిమారిందని తెలిపారు. ఏడారి నుంచి స్వర్గాన్ని సృష్టించిన దేశం దుబాయ్ అని కొనియాడారు. సరికొత్త ఆలోచనలతోనే కొత్త ఆవిష్కరణలు సాధ్యమని నొక్కిచెప్పారు. వికసిత్ భారత్‌తో 2047 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగు తోందనివ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించడమే లక్ష్యంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన పారిశ్రామికవేత్తలతో చర్చించేందుకు ఇన్వెస్టోపియా గ్లోబల్ ఎపిపేరిట ఇన్వెస్ట్ ఇండియా, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ సదస్సు నిర్వహించాయి..

విజయవాడలోని ఓ ప్రముఖ హోటల్‌లో జరిగిన ఈ సదస్సుకు వివిధ సంస్థల ప్రతినిధులు దాదాపు 200 మంది హాజరయ్యారు.. సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. జ్యోతి ప్రజ్వలనతో ఆయన ఈ సదస్సును చంద్రబాబు ప్రారంభించారు. సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ యుఎఇ మంత్రిని దావోస్ కలిసి ఎపికి ఆహ్వానించాను. భారత్‌లో ఎపిని సందర్శించిన తర్వాతే ఇతర ప్రాంతాలకు వెళ్లాలని కోరాను. మన ఆహ్వానాన్ని మన్నించి ఇక్కడికి వచ్చి ఇన్వెస్టోపియా సదస్సు నిర్వహించారు దుబాయ్ అంటే నాకు చాలా అసూయ. దాన్ని ఓ స్వర్గంగా మార్చారు 50డిగ్రీల ఉష్ణోగ్రత ఇతర ప్రతికూలతల మధ్య దుబాయ్ ఇంటర్నెట్ సిటీ మొదలు పెడితే హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మించాం యూఎఇ, దుబాయ్‌లు విస్తృతంగా మారాయి.

2021 లో కరోనా ప్రభావం ఉంటే యుఎఇ ఇన్వెస్టోపియాతో ప్రపంచానికి యుఎఇ భారత్ ల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. 1.1 కోట్ల జనాభా ఉన్న యూఎఇలో 38 శాతం మంది భారత్ నుంచి వెళ్లారు యుఎఇ భారతీయులకు అవకాశాలు కల్పిస్తోంది. అలాగే ఆ దేశానికి భారతీయలు విస్తృతమైన సేవలు అందిస్తున్నారు ఆర్థిక సంస్కరణలు, టెక్నాలజీ విప్లవం అందిపుచ్చుకున్నాం. డెమోగ్రాఫిక్ డివిడెండ్ అనే సానుకూలత భారత్ కు ఉంది సరైన సమయంలో సరైన చోట నరేంద్ర మోదీ నాయకుడిగా ఉన్నారు 2024 -25 100 బిలియన్ డాలర్ల ట్రేడ్ యుఎఇ భారత్ మధ్య జరిగితే అందులో 1.5 బిలియన్ డాలర్ల వాణిజ్యం ఎపి యుఎఇ మధ్య జరిగింది హైదరాబాద్ మోస్ట్ లివబుల్ సిటీగా మారింది.

ఆ నగరాన్ని నిర్మించటంలో భాగస్వామిగా ఉన్నందుకు సంతోషం 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉంది. 2029 నాటికి మూడో ఎకానమీగా 2047 నాటికి 1 స్థానానికి ఎదుగుతాం ప్రపంచంలోని ప్రతీ నలుగురు టెక్నాలజీ నిపుణుల్లో ఒకరు ఇండియన్, ఇండియన్స్‌లో ఇద్దరు తెలుగువాళ్లే ఉంటారు బలమైన పబ్లిక్ పాలసీ ద్వారా అత్యధిక సంపద ఆర్జించే వ్యక్తుల్లో తెలుగువారిదే 33 శాతం ఉన్నారు క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీని 2026 జనవరి నాటికి ప్రారంభిస్తాం అమెరికాలో సిలికాన్ వ్యాలీ ఉంటే అమరావతిలో క్వాంటం వ్యాలీ ఉంటుంది.

ఏపీ గవర్నెన్సు అంతా 550 సర్వీసులు వాట్సప్ ద్వారా పౌరసేవలు అందుతున్నాయి మీరు ఇన్వెస్టు చేయాలని భావించిన మరుక్షణం నుంచే మీకు అనుమతులు వచ్చే బాధ్యతలు మేం తీసుకుంటాం టెక్నాలజీని పెద్ద ఎత్తున వినియోగిస్తున్న రాష్ట్రంగా ఎపి ఉంది ఆధార్ , జియో ట్యాగింగ్ ద్వారా అన్ని సేవలనూ అందిస్తున్నాం. 2.4 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా పనిచేస్తున్నాం ఎపిలో విస్తృతమైన పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి.

నో పావర్టీ మిషన్‌తో పనిచేస్తున్నాం పీ3 ద్వారా మౌలిక సదుపాయాలు కల్పిస్తుంటే , పీ4 ద్వారా పేదలకు హ్యాండ్ హోల్డ్ ఇస్తున్నాం ఈ విషయంలో యూఏఈ మంచి నిర్ణయాలు తీసుకుంది 15 సెక్టోరల్ పాలసీలు పెట్టుబడులకు అనుకూలంగా మార్చాం లులూ మంచి బ్రాండ్, ప్రతీ రాష్ట్రం అలాంటి ఓ షాపింగ్ మాల్ ఉండాలని కోరుకుంటుంది. ఇప్పుడు లులూ ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్ ఎపిలో షాపింగ్ మాల్ ఏర్పాటు చేస్తోంది ఐదేళ్లు వేర్వేరు కారణాల వల్ల సమయం విశాఖ, విజయవాడలలో త్వరలో షాపింగ్ మాల్స్ వస్తాయి. అమరావతిలోనూ ఏర్పాటు చేయాలని కోరుతున్నా పెట్టుబడులు వస్తేనే సంపద సృష్టికి అవకాశం ఏర్పడుతుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గా విధానం మార్చుకున్నాం అనుమతుల గురించి సీఎంఓ నేరుగా పర్యవేక్షిస్తుంది ఏపీ పెట్టుబడులకు మంచి స్థానం అని స్పష్టంగా చెప్పగలం భారత తూర్పు ప్రాంతంగా కీలకమైన అవకాశాలు ఏపీకి ఉన్నాయి పోర్టులు, ఎయిర్ పోర్టులు, మౌలిక సదుపాయాలు ఉన్నాయి. వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రాంతం

ఇన్వెస్టోపియా సిఇఒ డాక్టర్ జీన్ ఫేర్స్, సీఐఐ వైస్ ప్రెసిడెంట్, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహా వ్యవస్థాపకురాలు, ఎండీ డాక్టర్ సుచిత్ర కె. ఎల్ల, లులు ఇంటర్నేషనల్ సీఎండీ యూసుఫ్ అలీ, టాటా కెమికల్స్ లిమిటెడ్ ఎండీ, సిఇఒ ముకుందన్, యుఎఇ ఆర్థిక, పర్యాటక మంత్రి హెచ్.ఈ అబ్దుల్లా బిన్ టౌక్ అల్‌మరి వంటి ప్రముఖులు సదస్సుకు హాజరయ్యారు.. ఈ సదస్సులో ఎపిలో పెట్టుబడి అవకాశాలు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చ జరిగాయి,సదస్సులో పాల్గొనేందుకు వివిధ సంస్థల సీఎండీలు, సీఈవోలు, యూఏఈ మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## పొంగుతున్న నదులు

>> విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు,కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.బుధవారం సాయంత్రం 5 గంటల నాటికి శ్రీకాకుళం జిల్లా కంచిలిలో 69మిమీ, నర్సన్నపేటలో 62.5మిమీ, కోటబొమ్మాళిలో 53.2మిమీ, మందసలో 48.7మిమీ, రాజాపురంలో 46.2మిమీ, వజ్రపుకొత్తూరులో 40.7మిమీ వర్షపాతం నమోదైందన్నారు.

## తొందరపాటు చర్యలొద్దు

>> చెప్పకుండా నరికివేయాలి...తప్పు చేసిన వాడు ఎవరైనా ఉంటే మన ప్రభుత్వం వచ్చాక వేసేయండి' అంటూ పేర్ని నాని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ కేసు నమోదైంది. దీన్ని కొట్టేయాలంటూ ఆయన హైకోర్టులో క్వాష్ పిటీషన్ వేశారు.ఇదే వ్యవహారంలో తనపై నమోదు చేసిన కేసు కొట్టేయాలని పామర్రు మాజీ ఎంఎల్ఏ కె.అనిల్‌కుమార్ వేసిన వ్యాజ్యం పైనా హైకోర్టు విచారణ జరిపింది.

### తెలంగాణ ప్రాంతానికి కేటాయించిన 36 % మెడికల్ సీట్లు ఇకపై ఎపి విద్యార్థులకే - ఉత్తర్వులు జారీ

**విజయవాడ,జులై 23,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రవిభజనచట్టంప్రకారం తెలంగాణ ప్రాంతానికి కేటాయించిన 36 శాతం మెడికల్ సీట్లు ఇకపై ఎపి విద్యార్థులకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విభజన చట్టంలో పేర్కొన్న గడువు ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విడుదలచేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. 2025-26 విద్యా సంవత్సరంలో జరిగే వైద్య విద్య ప్రవేశాలకు ఈ నిర్ణయం వర్తింస్తుందని వెల్లడించింది.గతంలో తెలంగాణలోని ఉస్మానియా,కాకతీయ విశ్వవిద్యాలయాల పరిధి లోని విద్యార్థులతో 36 శాతం సీట్లు భర్తీ చేసేవారు.రాష్ట్ర విభజన చట్టంలో నిర్దేశించిన పదేళ్ళ గడువు ముగిసినందున గతేడాది (2024-25) వరకు ప్రవేశాలు పొందిన తెలంగాణ విద్యార్థులకు 2025-26 ప్రవేశాల్లో అవకాశం ఇవ్వలేదు.

# వచ్చేవారం పార్లమెంటులో చర్చ

>> దాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరగవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాజ్యసభలో 9 గంటలపాటుసాగే ఈ చర్చను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ప్రారంభిస్తారు. ఇదిలా ఉంటే బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎలక్షన్ కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో నిరసనలు వ్యక్తం చేశాయి. అలాగే ఆపరేషన్ సిందూర్, ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం దాడిపై చర్చకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వకపోవడంపై మండిపడ్డాయి. దీనితో కొన్ని అంశాలు తప్ప ఉభయ సభలలో చాలా కార్యక్రమాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఆపరేషన్ సిందూర్‌పై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించాలని మొదటి నుంచి ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. మోడీ బుధవారం నాలుగు రోజుల విదేశీ పర్యటనకు వెళ్లారు. అయితే ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని భారత్ చెబుతూనే ఉంది. ఇలాంటి తరుణంలో భారత పార్లమెంట్‌లో ఆ అంశాలపై చర్చ జరిగితే అది ప్రపంచం దృష్టిని కూడా ఆకరిస్తుందని ఓ బిజెపి నాయకుడు అన్నారు. ఉగ్రవాదంపై భారత ప్రభుత్వ దృఢ ప్రతిస్పందనను తెలియజేయడానికి, అలాగే అనేకఅంశాలపై తనవైఖరిని తెలియజేయడానికి ప్రధానిమోడీ ఈ సందర్భాన్ని ఉపయోగించుకోవచ్చని సదరు బిజెపి నేత అభిప్రాయపడ్డారు. అయితే మోడీ కచ్చితంగా మాట్లాడతారా, లేదా అనే అంశంపై ఆయన కూడా ఎలాంటిస్పష్టత ఇవ్వలేదు. రాజ్యసభ బిఎసి సమావేశానికి హాజరైన కాంగ్రెస్ డిప్యూటీ లీడర్ ప్రమోద్ తివారీ, చర్చ సమయంలో ప్రధానిమోడీ కచ్చితంగా హాజరు కావాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు.

# నా జీవితాన్ని మలుపుతిప్పిన విశాఖ

>> నోవాటెల్‌లో వున్నపుడు తనను అరెస్ట్ చేయాలని చూశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం హయంలో టికెట్ రేట్లు పెంచక పోయిన భీమ్లా నాయక్ సినిమా హిట్ అయిందన్నారు. హీరోయిన్ నిధి అగర్వాల్‌ను చూసి సిగ్గు పడి ప్రమోషన్‌లలో పాల్గొంటున్నాను అన్నారు. తనకు ఇవ్వడమే తప్ప తీసుకోవడం తెలీదు. అన్యాయం జరిగితే ఎదురు తిరగాలి అన్న ధ్యేయం ఉండేది అన్నారు. సత్యానంద్ తనకు జీవిత పాఠాలు నేర్పారు. భీమిలి, ద్వారకా నగర్ ప్రాంతాలలో నట శిక్షణ సాగింది అన్నారు. వచ్చే ఏడాది 30 ఇయర్ ఇండస్ట్రీ అని చెప్పుకుంటాను అన్నారు. ఖుషి వంటి బ్లాక్ బస్టర్ సినిమా ఇచ్చిన నిర్మాత ఏఎం రత్నం చెప్పిన కథ విని ఒప్పుకున్న ఈ సినిమా కొన్ని కారణాల చేత ఆలస్యం అయింది అని పేర్కొన్నారు. ప్రజలు, సినిమా ఇచ్చిన ధైర్యంతోనే నియంతృత్వ వైసీపీ ప్రభుత్వాన్ని దించేశాం అన్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత కీరవాణి లేకుంటే ఈ సినిమా లేదు అని చెప్పారు. తన సినిమాలు వినోదంతో పాటు విజ్ఞానం కూడా ఇస్తాయి అన్నారు. కోహినూర్ వజ్రం నేపథ్యంలో కల్పిత పాత్ర హరి హర వీరమల్లుతో సినిమా నడుస్తుంది అన్నారు. సనాతన ధర్మం ఇతర మతాలకు వ్యతిరేకం కాదు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో దర్శకుడు జ్యోతి కృష్ణ, హీరోయిన్ నిధి అగర్వాల్, నటుడు రఘు బాబు, స్టార్ మేకర్ సత్యానంద్, ఎమ్మెల్ఏలు పల్లా శ్రీనివాస్ రావు, సుందరపు విజయకుమార్, పంచ కర్ల రమేష్ బాబు, వంశీ కృష్ణ శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు,బండారు సత్యనారాయణ, మేయర్ పీలా శ్రీనివాస్ రావు,కార్పొరేటర్లు కందుల నాగ రాజు, వసంత లక్షీ ్మ, ఉషా రాణి, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు లక్ష్యంగా కార్యాచరణ

>> పెట్టుబడుల కోసం చేస్తున్న ప్రయత్నాలు కార్యరూపం దాల్చుతున్నాయి. ఈ క్రమంలో ప్రతిష్టాత్మత సంస్థలను రాష్ట్రానికి రప్పించడంలో మరో అడుగు ముందుకు పడింది. రాష్ట్రానికి కొత్తగా మరో 4 కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ప్రతిష్టాత్మక సంస్థలైన సిఫి, సత్వా, బివిఎం, ఎఎన్ఎస్ఆర్ సంస్థలు రూ.20,216 కోట్ల పెట్టుబడులకు ముందుకు వచ్చాయి.ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో బుధవారం జరిగిన 9వ ఎస్ఐపిబి సమావేశం ఆమోదం తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా 50,600 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ సందర్భంగా 20 లక్షల ఉద్యోగాల కల్పన సబ్ కమిటీకి చైర్మన్‌గా ఉన్న నారా లోకేష్ ఈ సమావేశంలో ఆయా పెట్టుబడులు గురించి వివరించారు. ప్రతిష్టాత్మక సంస్థల రాకతో విశాఖ ఖ్యాతి మరింతగా పెరుగుతుందని ఆయన అన్నారు. ఈ పెట్టుబడులపై ఆయా సంస్థలతో జరిపిన చర్చలు, వాటి స్థితిగతులు, బలాబలాలు వెల్లడించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ... భవిష్యత్ పెట్టుబడులకు, అవసరాలకు తగ్గట్లుగా విశాఖ మాస్టర్ ప్లాన్ ఉండాలని అన్నారు. విశాఖలో భూమి లభ్యత తక్కువగా ఉందని... ఇప్పటికే అర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ సహా అనేక సంస్థలకు భూములు ఇస్తున్నామని చెప్పారు. ఈక్రమంలో విశాఖకు వచ్చే సంస్థలకు అనువైన భూమిని చూపాల్సిన అవసరం ఉందన్నారు. మౌలిక వసతుల సమస్యలు రాకుండా ప్రణాళికలు అమలు చేయాలని సిఎం ఆదేశించారు.

పూణె, బెంగుళూరు వంటి పట్టణాల్లో ట్రాఫిక్, మౌలిక సదుపాయాల సమస్యలను ఈ సందర్భంగా అధికారులు ప్రస్తావించగా... అటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. విమానాశ్రయంరైలు కనెక్టవిటీ, హైవే రోడ్లు, మెట్రో వంటి వాటిపై ముందస్తు ప్రణాళికలతో అధికారులు పనిచేయాలన్నారు. పూణె, బెంగుళూరు వంటి చోట్ల నేడు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మన దగ్గర తలెత్తకుండా చూడాలన్నారు. కంపెనీలను ఏర్పాటు చేయడంతో పాటు సామాన్య ప్రజలు ఆయా ప్రాంతాల్లో నివసించడానికి అవసరమైన ఎకో సిస్టం కూడా ఉండాలనే విషయాన్ని గుర్తుపెట్టుకుని ప్రణాళికలు అమలు చేయాలని సిఎం అన్నారు.

# రాష్ట్రంలో డేటా విప్లవం

>> ఆదర్శంగా తీసుకుంటున్నాం. ప్రపంచంలో తొలిసారిగా ఎఐ మంత్రిత్వశాఖను ఏర్పాటుచేసిన దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్. యుఎఇ ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ఎఐ సాంకేతికతను వినియోగిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కారణంగా ఉద్యోగావకాశాలు కోల్పోతామన్న కొందరి వాదనతో నేను ఏకీభవించను. ప్రతి పారిశ్రామిక విప్లవం కొత్త ఉద్యోగాలు సృష్టిస్తుందని నేను నమ్ముతాను. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఆవిర్భవించబోతోంది. జి టు జి కొలాబరేషన్‌లో భాగంగా యుఎఇ ఆంధ్రప్రదేశ్ పరస్పర సహకారం ద్వారా డిజిటల్ ఆర్థిక వ్యవస్థను శక్తివంతం చేయాలని మేం భావిస్తున్నాం. ఎఐ, డేటా సెంటర్లు, డిజిటల్ ఆవిష్కరణలు, స్మార్ట్ గవర్నెన్స్ ద్వారా ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించే మార్గాలను అన్వేషిస్తామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఫైర్ సైడ్ చాట్‌లో తనకు ఇష్టమైన ఎఐ అప్లికేషన్ చాట్ జిపిటి లోకేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమానికి జి42 ఇండియా సిఇఓ మనుజైన్ హాజరుకాగా, ప్రైమస్ పార్టనర్స్ వైస్ ప్రెసిడెంట్ రక్ష శ్రద్ధ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రెన్యువబుల్ ఎనర్జీ, ఇన్ ఫ్రా, డిజిటల్ గవర్నెన్స్, ఎఐ ఫస్ట్ యూనివర్సిటీ, జీనోమ్ సీక్వెన్సింగ్, క్వాంటమ్ వ్యాలీ, లాజిస్టిక్స్ రంగాల్లో పెట్టుబడులకు సంబంధించి యుఎఇ ఆర్థిక మంత్రి అబ్దుల్ బిన్ తక్ ఆల్ మరితో మంత్రి లోకేష్ చర్చించారు. ఆయా రంగాల్లో పెట్టుబడులకు యుఎఇ తరపున సహకారం అందించాల్సిందిగా కోరారు. దీనికి అబ్దుల్ బిన్ స్పందిస్తూ యుఎఇ పర్యటనకు రావాల్సిందిగా మంత్రి లోకేష్ ను ఆహ్వానించారు.

# రేసులో ఆరుగురు!

>> ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. బీహార్ నుంచి ప్రధానంగా రెండు పేర్లు వినిపిస్తున్నాయి. అవే బీహార్ సిఎం నీతీశ్ కుమార్, జెడియూ ఎంపీ, ప్రస్తుత రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్. వీరిలో ఒకరికి వైస్ ప్రెసిడెంట్ పదవి దక్కొచ్చనే ప్రచారం జరుగుతోంది.బిజెపి ఉప రాష్ట్రపతి అభ్యర్థి రేసులో నీతీశ్ కుమార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆశ్చర్యకరంగా బీహార్‌కు చెందిన బిజెపి ముఖ్య నేతలు నీతీశ్ కుమార్‌ను ఉప రాష్ట్రపతి చేయాలని బహిరంగంగానే అంటున్నారు. నితీశ్ ఉపరాష్ట్రపతి అయితే దాన్ని బీహార్ అదృష్టంగా భావిస్తామని రాష్ట్రానికి చెందిన బిజెపి ఎమ్మెల్యే హరిభూషణ్ ఠాకూర్ బచౌల్ అన్నారు. అయితే ఈ ఆఫర్ నితీష్ అంగీకరించే అవకాశాలు చాలా తక్కువే. జెడియు నేతలు సైతం నితీశ్ రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటారని తేల్చిచెబుతున్నారు. ఈసారి బిహార్ అసెంబ్లీ ఎన్నికల తర్వాత తమ పార్టీ నేతను సిఎం చేయాలనే లక్ష్యంతో బిజెపి ఉందని ఆ పార్టీకి చెందిన కీలక నాయకులు బహిరంగంగానే అంటున్నారు. నీతీష్ రాష్ట్ర రాజకీయాల్లో ఉండగా బిజెపి అభ్యర్థి సిఎం కావడం అసాధ్యం. అందుకే నితీశ్‌ను ఒప్పించేందుకు బిజెపి వ్యూహాత్మంగా పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇందుకోసం నీతీశ్‌ను ఉపరాష్ట్రపతి చేసి, అతని కుమారుడు నిశాంత్ కుమార్‌ను డిప్యూటీ సిఎం చేసే అవకాశాలూ లేకపోలేదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీహార్‌లోని బిసి, ఇబిసి వర్గాల ఓటర్లు ఎన్‌డిఎ కూటమి వైపు నిలవడానికి ప్రధాన కారకుడు నితీశ్‌కుమార్ అని, ఎన్నికల ముంగిట ఆయన్ను బలవంతంగా దూరం చేసుకోవడానికి ఎన్డీయే కూటమి అస్సలు సాహసించదని ఇంకొందరు పరిశీలకులు తెలిపారు. నీతీశ్ ఒక్కసారిగా బీహార్ రాజకీయాలకు దూరమైతే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ, ఇబిసి వర్గాలన్నీ లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్‌ల వైపు మొగ్గు చూపే అవకాశాలు ఉంటాయన్నారు. అలా జరగాలని బిజెపి కోరుకోదు. అందుకే నితీశ్ కుమారుడి రాజకీయ భవిష్యత్‌కు సంపూర్ణ హామీ, ఆయన్ను సెంటిమెంట్‌తో ఒప్పించేందుకు బిజెపి పెద్దలు ప్రయత్నించే అవకాశాలు మెండుగా ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు. నితీశ్ కుమార్ పార్టీ అయిన జెడియు నుంచి ఎంపీ, ప్రస్తుతం రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్న హరివంశ్ నారాయణ్ సింగ్ కూడా ఉపరాష్ట్రపతి రేసులో ఉన్నారు. జేడియూ రాజ్యసభ ఎంపీ కావడం ఈయనకు పెద్ద అడ్వాంటేజీ. ప్రధానమంత్రి నరేంద్రమోడీకి హరివంశ్ నారాయణ్ సింగ్ అత్యంత సన్నిహితంగా ఉంటారు. నితీశ్ తిరిగి ఎన్డీయేలోకి వచ్చిన తర్వాత కూడా నితీశ్‌తో కానీ, జేడీయూ పార్టీతో ఆయనకు మంచిసంబంధాలు లేవనేఅభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో హరివంశ్ నారాయణ్ సింగ్‌ను ఎంపిక చేయడం ద్వారా జెడియు అభ్యర్థిని ఎంపిక చేసినట్లు అవుతుంది, అలాగే, అతను బీహార్ కాబట్టి అది కూడా ఒక ప్లస్ పాయింట్ అవుతుంది. అన్నింటికి మించి ప్రధాని మోడీకి అత్యంత సన్నిహితుడు కావడం బిజెపికి మరింత కలిసొచ్చే అంశం. కేంద్ర ప్రభుత్వానికి విధేయులుగా ఉన్న పలువురు గవర్నర్ల పేర్లను కూడా ఉపరాష్ట్రపతి పోస్టుకు పరిశీ లిస్తున్నట్లు సమాచారం. ఈ కేటగిరి నుంచి ప్రముఖంగా వినిపిస్తున్న పేరు ఆరిఫ్ మహ్మద్ ఖాన్. ఈయన ప్రస్తుతం బీహార్ గవర్నర్‌గా ఉన్నారు. అంతకుముందు కేరళలో ఐదేళ్ల పాటు గవర్నర్‌గా సేవలు అందించారు. హిందూ పురాణాలు, గ్రంథాలపై అవగాహన కలిగిన స్కాలర్‌గా ఆరిఫ్‌కు బిజెపిలో మంచి గుర్తింపు ఉంది. ముస్లిం వర్గానికి చెందిన ఈయనను ఉప రాష్ట్రపతి చేస్తే, ముస్లింఓటర్లు పెద్దసంఖ్యలో ఉన్న బీహార్‌లో కలిసొస్తుందనే అంచనాతో ఎన్‌డిఎ కూటమి పెద్దలు ఉన్నారట. అలాగే, ఆర్‌జెడి అధినేత లాలూతో ఆరిఫ్‌కు సాన్నిహిత్యం ఉంది. అందుకే 2024లో బీహార్ గవర్నర్ కాగానే, తొలుత పట్నాలోని లాలూ ప్రసాద్ యాదవ్ నివాసానికి ఆయన వెళ్లారు. ఒకవేళ ఆరిఫ్ పేరును ఉపరాష్ట్రపతి పదవికి ఎన్‌డిఎ కూటమి ప్రతిపాదిస్తే, ఆర్‌జెడి కూడా మద్దతిచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఆరిఫ్ బిజెపిలో ఉన్నందున, బిజెపి మద్దతు ఎలాగూ ఉంటుంది. ఇటీవలే దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించింది. దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాతో ఆప్‌కు ఏర్పడిన వివాదం కూడా బిజెపి గెలుపునకు, ఆప్ ఓటమికి ఒక కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. ఆప్ సర్కారు తీసుకున్న అనేక నిర్ణయాలను తన విచక్షణాధికారలతో లెఫ్టినెంట్ గవర్నర్ తోసిపుచ్చిన సందర్భాలు ఉన్నాయి. నిధుల వినియోగం విషయంలో ఆప్ సర్కార్‌ను చాలా కట్టడి చేశారన్న వార్తలు అప్పట్లో వచ్చాయి. ఆప్ విషయంలో దూకుడు వెళ్లిన వీకే సక్సేనా కేంద్ర సర్కారు, ముఖ్యంగా ప్రధాని మోదీ దృష్టిలో పడ్డారు. అందుకే ఉపరాష్ట్రపతి పదవికి సక్సేనా పేరును పరిశీలిస్తారనే అంచనాలు వెలువడుతున్నాయి. ఆగస్టు 6తో ముగియ ఆర్టికల్ 370 రద్దు అయిన ఏడాది తర్వాత జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా మనోజ్ సిన్హా బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి కశ్మీరు పాలనలో తనదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతున్నారు. ఆయన పదవీకాలం ఈ ఏడాది ఆగస్టు 6తో ముగియనుంది. అందుకే మనోజ్ సిన్హా పేరును ఉపరాష్ట్రపతి పదవికి పరిశీలిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఈయన గతంలో బిజెపి జాతీయ కౌన్సిల్‌లో సభ్యుడిగా వ్యవహరించారు. ప్రధాని మోడీ తొలి కేంద్ర కేబినెట్‌లో కేంద్ర సహాయమంత్రిగానూ సేవలను అందించారు.

ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక విషయంలో బిజెపి అనూహ్య నిర్ణయాన్ని తీసుకునే అవకాశాలూ లేకపోలేదు. కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచిన సీనియర్ నేత శశిథరూర్ పేరును ఈ పదవికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ పరిశీలించే ఛాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. గతఏడాది కాలంగా కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉంటున్న శశిథరూర్, త్వరలోనే బిజెపిలో చేరుతారనే ఊహాగానాలు కూడా వెలువడుతున్నాయి. ఈ మధ్య కాలంలో బిజెపి నాయకులు థరూర్‌కు మద్దతుగా మాట్లాడుతుండగా, కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. కొన్ని నెలల క్రితం కేరళలో జరిగిన ఒక బహిరంగ సభా వేదికపై, కేవలం థరూర్‌తో ప్రధాని మోడీ కరచాలనం చేశారు. ఆప్యాయంగా పలకరించారు.

ఈవివరాలతో ట్వీట్ సైతం చేశారు. ప్రపంచ దేశాల్లో పర్యటించి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించేందుకు ఇటీవలే కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష ఎంపీలతో కమిటీలను ఏర్పాటు చేసింది. వీటిలో ఒక కమిటీకి నేతృత్వం వహించే అవకాశాన్ని శశిథరూర్‌కు ప్రధాని మోడీ కల్పించారు. లోక్‌సభలో స్పీకర్ అధికార పార్టీకి చెందినవారు ఉంటే, డిప్యూటీ స్పీకర్ ప్రతిపక్షాల నుంచి ఉండటం ఆనవాయితీ. అయితే మోడీ సర్కారు లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్‌ను నియమించకుండా ఇప్పటికే అపవాదును మూటగట్టుకుంది. ఆ అపవాదును తొలగించేందుకు ప్రధాన ప్రతిపక్షానికి చెందిన థరూర్‌ను వైఎస్ ప్రెసిడెంట్ చేసినా చేయొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## వారం - వర్జ్యం

24-07-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయనం
గ్రీష్మ ఋతువు
అమావాస్య రా.12.43
పునర్వసు సా.4.47
వర్జ్యం : రా.12.33-2.06
దు.ఉ.10.05-10.57, 2)మ.3.16-సా.4.08
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామి సలహాతో ముందుకు సాగుతారు. సంతానం సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**వృషభం :** అనుకొని అవకాశాలు లభిస్తాయి. వీటిని సద్వినియోగం చేసుకోండి. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**మిథునం:** భాగస్వామ్య వ్యాపారాలలో ఏర్పడిన తగాదాలు పరిష్కరించు కొంటారు. ఆరోగ్యసమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**కర్కాటకం :** బంధువుల నుండి శుభ వార్తలు అందుకొంటారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**సింహం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. కొత్త రుణాల వేట సాగిస్తారు.

**కన్య :** ముఖ్యమైన కార్యక్రమాలలో జాప్యం జరిగినా సన్నిహితుల సాయంతో పూర్తి చేస్తారు.

**తుల :** షేర్లు, భూములు క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. సంతానమునకు నూతన విద్యావకాశాలు.

**వృశ్చికం:** ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**ధనుస్సు:** పారిశ్రామిక, రాజకీయ వర్గాల వారు అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు. గృహనిర్మాణ యత్నాలు సాగిస్తారు.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో క్రమేపి అభి వృద్ధి సాధిస్తారు. అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి.

**కుంభం:** ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు పెరుగుతాయి. ఆస్తి విషయాలలో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు.

**మీనం :** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. దూరప్రాంతాల నుండి వచ్చిన వార్తవల్ల కొంత ఊరట చెందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

# హాస్టళ్ల పర్యవేక్షణ

>> సవిత పాల్గొని ప్రసంగించారు. ముందుగా బిసి హాస్టళ్లు, ఎంజెపి స్కూళ్ల నిర్వహణ తీరుతెన్నులను రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ వివరించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, బిసి హాస్టళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే నెల అయిదో తేదీలోగా అడ్మిషన్లు పూర్తి చేయాలని స్పష్టంచేశారు. ముఖ ఆధారిత గుర్తింపు(ఫేషియల్ రికగ్నైషన్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్ ఎఫ్ఆర్ఎస్) ద్వారా విద్యార్థుల హాజరులో ఆటంకాలు ఏర్పడితే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్య పరిష్కారించుకోవాలన్నారు. వచ్చే నెల అయిదో తేదీలోగా నిర్దేశించిన లక్ష్యం మేర అడ్మిషన్లు పూర్తి చేయాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. బిసి హాస్టళ్ల అభివృద్ధికి సిఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. దీనిలో భాగంగానే గతం ప్రభుత్వం పెట్టిన డైట్ బిల్లుల బకాయిలు చెల్లించడమే కాకుండా, ఎప్పటికప్పుడు డైట్ బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. హాస్టళ్లలో రాత్రి సమయాల్లో హెచ్ డబ్ల్యూవోలు ఉండాలని స్పష్టంచేశారు. హాస్టళ్ల పనితీరు మరింత మెరుగుపడాలంటే నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. మంత్రిగా తాను అన్ని జిల్లాల్లో ఉన్న బిసి హాస్టళ్లను, ఎంజేపీస్కూళ్లను ఎప్పకటికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. డిబిసిడబ్ల్యూఇఒలు, ఎబిసిడబ్ల్యూఇఒలు తరుచూ హాస్టళ్లను సందర్శించాలని, వీలైతే రాత్రి బస కూడా చేయాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి టూర్ డైరీ రూపొందించాలని, ఆ డైరీని ప్రతి నెలా అయిదో తేదీలోగా రాష్ట్ర కార్యాలయానికి పంపించాలని తెలిపారు. హెచ్ డబ్ల్యూఎస్ లు రాత్రి సమయాల్లో హాస్టళ్లలో తప్పనిసరిగా బస చేయాల్సిందేనని మంత్రి సవిత స్పష్టంచేశారు. విద్యార్థులను బాధ్యతతో సొంత బిడ్డల మాదిరిగా చూసుకోవాలన్నారు.

# పవన్‌పై క్రిమినల్ రివిజన్ కేసుకు నంబరు ఇవ్వండి

## -రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం

**విజయవాడ,జులై 23,ప్రభాతవార్త ప్రతినిధి:** వారాహి యాత్ర సందర్భంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాలెంటీరలపై చేసిన వ్యాఖ్యల విషయంలో దాఖలైన క్రిమినల్ రివిజన్ కేసుకు నెంబరు కేటాయించాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది.నిఘా వర్గాల సమాచారం మేరకు...వాలంటీర్లు సేకరిస్తున్న సమాచారం కొంత మంది అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళ్ళి మహిళలను అపహరిస్తున్నారన్నారని అప్పట్లో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై నాటి వైకాపా ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరిలో గుంటూరు న్యాయస్థానంలో క్రిమినల్ కేసును దాఖలు చేసింది. కేసు వేయడానికి అప్పట్లో ఆమోదం తెలిపిన ఐదుగురు వాలంటీర్లు...పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలతో తమ ప్రతిష్టకు భంగం కల్గలేదంటూ తాజాగా అఫిడవిట్ వేశారు. వైకాపా నేతలు తమ నుంచి సంతకాలు తీసుకొని కోర్టులో పిటీషన్ వేశారంటూ న్యాయాధికారి ఎదుట వాంగ్మూలం కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణపై ప్రాసిక్యూషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుంటూరు కోర్టులో పిటీషన్ వేశారు. విచారణ జరిపిన గుంటూరు నాలుగో అదనపు జిల్లా జడ్జి...అందుకు అనుమతిస్తూ గతేడాది నవంబరు 18 ఉత్తర్వులిచ్చారు. దీన్ని సవాలు చేస్తూ కె.సరళ,మరో ముగ్గురు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ కేసును దాఖలు చేశారు. ఈ పిటీషన్‌కు నెంబరు కేటాయించేందుకు హైకోర్టు రిజిస్ట్రీ నిరాకరించడంతో వ్యవహారం న్యాయమూర్తి వద్దకు చేరింది. విచారణలో పిటీషన్ల తరపున న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

# బోగస్ ధ్రువీకరణ పత్రాలు రద్దు

**- వైకల్య శాతం మారిన వారికి 25 నుంచి సచివాలయాల్లో 'సదరం'**

**విజయవాడ,జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** అర్హత లేకున్నా దివ్యాంగుల క్యాటగిరిలో పింఛను పొందుతున్న 1.08 లక్షల మంది బోనస్ సదరం ధృవీకరణ పత్రాలు రద్దు కానున్నాయి. తదుపరి వీరి పింఛన్లను తొలగించనున్నారు. వైద్య బృందాలను నియమించి ప్రభుత్వం చేపడుతున్న తనిఖీలో వైకల్యశాతం ప్రస్తుతం ఉన్న దాని కంటే మారిన వారికి కొత్తగా మళ్ళీ సదరం ధృవీకరణ పత్రాలు జారీ చేయనున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి గ్రామ,వార్డు సచివాలయాల్లో తాజాగా వైద్యులు నిర్ధారించిన వైకల్యశాతంతో కూడిన సదరం ధృవీకరణ పత్రాలు అందుబాటులో ఉండనున్నాయి. ఉచితంగానే వీటిని లబ్ధిదారులకు అందించనున్నారు. పింఛను అందించేందుకు ప్రభుత్వం నిర్ధేశించిన 40 శాతం కంటే తక్కువ వైకల్య శాతం ఉన్నట్లు తనిఖీలో నిర్ధారించిన వారికి అసెస్మెంట రిపోర్టును అందిస్తారు.



ఫిక్కీ మహిళా పారిశ్రామిక వేత్తలతో లక్ష్మీశ

# పి4లో మహిళా పారిశ్రామికవేత్తలు భాగస్వాములుకండి

:ఎన్టీఆర్జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

- ఫిక్కీమహిళల మార్గదర్శనంతో బంగారు కుటుంబాలకు ఆసరా

**విజయవాడ,జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనాన్ని కొనసాగిస్తున్న నిరుపేదలకు ఆసరాను అందించి, జీవితంలో స్థిరపడేలా ఫిక్కీ మహిళాపారిశ్రామికవేత్తలు మార్గదర్శకులుగా నిలవాలని.. ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలించాలనే ఉద్దేశంతో అమలుచేస్తున్న పీ4 విధానంలో భాగస్వాములుగా ముందుకురావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్వో) విజయవాడ ప్రతినిధులతో బుధవారం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్లోని ఆయన ఛాంబర్లో పీ4 విధానం అమలుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదరికాన్ని సమూలంగా నిర్మూలించి, 2047 నాటికి స్వర్ణాంధ్రను సాధించాలనే లక్ష్యంతో పీ4 విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పేదలు పూర్తిస్థాయిలో పేదరికం నుంచి బయటపడలేకపోతున్నారనే విషయాన్ని గుర్తించి, పీ4 విధానంలో మార్గదర్శులు ద్వారా నిరుపేదలైన బంగారు కుటుంబాలను ఎంపిక చేసుకొని వారిని దత్తత తీసుకోవడం ద్వారా ఆయా కుటుంబాలు వారు ఆర్థికంగా, కుటుంబ పరంగా ఆశించిన స్థాయిలో ఆర్థిక, ఆరోగ్య పరిపుష్టిని సాధించేవరకు చేయూతనివ్వడం ముఖ్య ఉద్దేశమన్నారు. పీ4 విధానం ద్వారా బంగారు కుటుంబాన్ని ఎంపిక చేసుకొని ఆ కుటుంబంవారు ఎదుర్కొంటున్న సమస్యలను గమనించి విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాల్లో ఆసరా ఇచ్చేందుకు ఆర్థిక పరిపుష్టి సాధించిన వారు మార్గదర్శులుగా ముందుకురావాలని సూచించారు. జిల్లాలో 86 వేల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని, ఇప్పటికే దాదాపు 3,700 మంది మార్గదర్శులు ముందుకురావడం అభినందనీయమన్నారు. ఎఫ్ఎల్వో మహిళా పారిశ్రామికవేత్తలు.. సామాజిక దృక్పథంతో నిరుపేదలను ఆదుకోవడం ద్వారా రాష్ట్రాభివృద్ధిలో తమవంతు సహకారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వం ఆశించిన ఫలితాల సాధనకు పీ4 విధానంలో భాగస్వాములై బంగారు కుటుంబాలకు ఆసరా అందించాలని కలెక్టర్ లక్ష్మీశ మహిళా పారిశ్రామికవేత్తల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎఫ్ఎల్వో ప్రతినిధులు స్పందిస్తూ తమ సంస్థ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు.

# తిరుమల సమాచారం

## ఆగస్ట్ 4,5 తేదీల్లో ఆన్లైన్లో మొబైల్ఫోన్లు ఈ వేలం



**తిరుమల,జూలై 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయంతోబాటు ఇతర అనుబంధ ఆలయాల్లో భక్తులు కానుకలుగా సమర్పించిన ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్న 73 లాట్ల మొబైల్ఫోన్లు ఈ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు టిటిడి ప్రకటించింది. ఆన్లైన్ద్వారా వేలం వేయనున్నారు. అన్ని రకాల మొబైల్ఫోన్లు ఉన్నాయి .ఆసక్తి ఉన్న బిడ్డర్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఈ కొనుగోలు పోర్టల్లో రిజిష్టర్అయి వేలంలో పాల్గొనడానికి అర్హులు. ఇతర వివరాలకు 0877-2264429 నంబర్కు కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలి.

## 25,26తేదీల్లో టిటిడి జూనియర్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

**తిరుమల,జూలై 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలో నడుస్తున్న జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ ప్రధమసంవత్సరంలో చేరడానికి ఈనెల 25,26 తేదీల్లో స్పాట్అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు టిటిడి తెలిపింది. టిటిడి ఆధ్వర్యంలోని ఎస్వీ జూనియర్కళాశాల, పద్మావతి జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది స్పాట్ అడ్మిషన్లుకు టిటిడిలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులు పిల్లలు, బాలమందిర్పిల్లలు, ఇదివరకే ఆన్లైన్లో దరఖాస్తుచేసుకుని సీటు వచ్చి వివిధ కారణాలతో మూడు విడతల్లో కౌన్సిలింగ్కు హాజరుకానివారు ,తిరుపతి స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. 550 పైబడి మార్కులు వచ్చిన విద్యార్థులు 25వతేదీ, 450 మార్కుటు కంటే తక్కువ వచ్చిన వారు 26వతేదీ హాజరుకావాలి. మార్కుల ప్రాతిపదికన సీట్లు కేటాయింపు ఉంటుంది. హాస్టల్ వసతి స్పాట్ అడ్మిషన్ల విద్యార్థులకు కేటాయించరు. ఆసక్తి అర్హులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావచ్చని టిటిడి తెలిపింది.

## సంక్షేమం, అభివృద్ధితో ప్రజలు సంతోషం

- అసెంబ్లీ డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణమరాజు



**తిరుమల,జూలై 23ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్లో ఏడాది కూటమి ప్రభుత్వం పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్ళులాగా జరుగుతున్నాయని, రాష్ట్రప్రజలు ఆర్థికంగా ముందుకు వెళ్ళేందుకు పథకాలు అమలుతో సంతోషంగా ఉన్నారని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు తెలిపారు. దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు రాష్ట్రప్రజలపై మెండుగా ఉండాలని వేడుకున్నారు. రఘురామకృష్ణమరాజు కుటుంబంతో కలసి బుధవారం వేకువజామున తోమాల సేవలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి తోమాలసేవలో శ్రీవారి ఆశీస్సులందుకున్నారు. తిరుమలేశుని దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితుల నుండి వేదాశీర్వచనం అందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవదేవుని తోమాల సేవలో పాల్గొనడం ఆనందం కలిగించిందన్నారు.

# పేదలకు బర్డ్లో శస్త్రచికిత్సలు

- దాతల నుండి విరాళాల సేకరణకు టిటిడి అనుమతి

- బర్డ్ ఆస్పత్రికి పూర్వవైభవం తీసుకురావాలి - టిటిడి ఛైర్మన్ బిఆర్నాయుడు



**తిరుమల,జూలై 23ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచవ్యాప్తంగా శస్త్రచికిత్స ల్లో ఖ్యాతిగడించిన తిరుపతిలో తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న బర్డ్ ఆస్పత్రిలో పేదలకు ఉచితంగా శస్త్రచికిత్సలు అందించే దిశగా చూడాలని టిటిడి ఛైర్మన్ బిఆర్నాయుడు సూచించారు. ఇందుకు దాతల నుండి విరాళాలు సేకరించాలని అధికారులకు నిర్దేశం చేశారు. బర్డ్లో పలు రకాల వైద్యసేవలకు గ్రామీణ ప్రాంత రైతులకు, నిరుపేదలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఛైర్మన్ బర్డ్ డైరెక్టర్ డాక్టర్ గూడూరు జగదీశ్కు సూచించారు. తిరుపతి బర్డ్ ఆస్పత్రి నిర్వహణ, నిధుల సమీకరణ, అత్యుత్తమ వైద్యసేవలు, శస్త్రచికిత్సలపై సోమవారం తిరుపతి పద్మావతి విశ్రాంతి భవనంలో టిటిడి ఇఒ జె.శ్యామలరావు, బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు, టి.జానకిదేవి,వర్చువల్గా డాక్టర్ అదిత్దేశాయ్ ,జెఇఒ వీరబ్రహ్మం, బర్డ్ డైరెక్టర్ డాక్టర్ గూడూరు జగదీశ్, ఎఫ్ఎసిఎఒ బాలాజీ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఛైర్మన్ బిఆర్నాయుడు సమీక్షచేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ టిటిడి ఆధ్వర్యంలోని బర్డ్ ఆస్పత్రిలో అవసరమైన మేరకు శస్త్రచికిత్సలను త్వరగా నిర్వహించాలని, ఈ సమయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా బర్డ్కు ప్రఖ్యాతలున్నాయని, గత కొంతకాలంగా బర్డ్ ఆస్పత్రి నిర్వహణ నిర్వీర్యం అయ్యిందని ఆవేదన వెలిబుచ్చారు. తిరిగి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. బర్డ్లో వైద్యసేవలకు పేదలకు తగిన ప్రాధాన్యత నివ్వాలని ఛైర్మన్ కోరారు. అవపరమైన మౌళిక సదుపాయాలు,వైద్యులు, సిబ్బంది,మందులు పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మోకాలిమార్పిడి తదితర శస్త్రచికిత్సలకు ఉపయోగించే అవసరమైన విదేశీ పరికరాలను మరింత నాణ్యతగా ఉండేవాటిని ఎంపిక చేసి, మనదేశ ధరలకు అనుగుణంగా సేకరించాలని సూచించారు. టిటిడి ఇఒ శ్యామలరావు మాట్లాడుతూ తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో చిన్నపిల్లల గుండె శస్త్రచికిత్సలకు దాతలు విరాళం ఇచ్చే ఆపన్నహృదయం పథకం ఉందని, దీనిలాగే బర్డ్లో కూడా పేదవర్గాల వారికి శస్త్రచికిత్సలు చేసేందుకు దాతలు నుండి విరాళాలు సేకరించాలని జెఇఒ,ఎఫ్ఎసిఎఒకు సూచించారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి విప్లవాత్మక ఆదికర్మయోగి కార్యక్రమం : మంత్రిగుమ్మిడి సంధ్యారాణి



**విజయవాడ,జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ విప్లవాత్మక ఆదికర్మయోగి కార్యక్రమాన్నిఅన్ని జిల్లాల్లో సమర్థవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో ఉన్నామని స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. విజయవాడ బుధవారం "ఆదికర్మయోగి" కార్యక్రమంపై మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం రూ.8.80 లక్షలు మంజూరు చేసిందన్నారు.. ఒక్కో మాస్టర్ ట్రైనర్కు ..5,500 చొప్పున సహాయం అందించాం. మొత్తం 40 మంది శిక్షణ పొందుతున్నారన్నారు.'గిరిజనుల సశక్తీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆదికర్మయోగి కార్యక్రమాన్ని మన రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేస్తాము. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలోని ప్రజల అభిప్రాయాలను స్వీకరించి, వారి సమస్యలపై ప్రభుత్వంతో నేరుగా చర్చించే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ప్రధానంగా గిరిజన గ్రామాల అభివృద్ధి దిశగా ప్రజల్లో చైతన్యం పొందేందుకు రూపొందించబడింది. ప్రజల సమస్యలు, అవసరాలు ప్రభుత్వానికి అందేలా చేసేందుకు, పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ఇది ముందడుగు. మన లక్ష్యం 2047 నాటికి సమగ్ర అభివృద్ధి. అందుకు తగిన విధంగా గ్రామ, మండల, జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలలో మార్గదర్శక బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. మొదటిగా రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసిన మందికి బెంగళూరులో శిక్షణ ఇచ్చాం. తరువాత వారు జిల్లాల ఎంపికైన అధికారులకు శిక్షణ ఇస్తున్నారు. అలాగే మండల స్థాయిలో అనుభవం ఉన్న అధికారులను ఎంపిక చేసి వారి ద్వారా గ్రామస్థాయిలో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం.

# తిరుపతి శివార్లలో మత్తు ఇంజక్షన్ల కలకలం

**మాత్రలు కరిగించి ఇంజెక్షన్ల రూపంలో - డ్రోన్కెమెరాకు చిక్కిన బాలురు**

**తిరుపతి,జూలై 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి ప్రజలేగాక పోలీసుయంత్రాంగం కూడా విస్తుబోయేలా ఇద్దరు బాలురు ఏకంగా మాత్రలు కరిగించి ఆ ద్రవాన్ని ఇంజెక్షన్ల రూపంలో వేసుకుంటూ మత్తుకు బానిసైనట్లు పోలీసులు కనుగొన్నారు. తిరుపతి శివార్లలో అసాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాలు, గంజాయి, వేశ్యాగృహాలపై నిఘాకోసం అమలుచేసిన అధునాతన డ్రోన్కెమెరాల్లో తిరుచానూరు శివార్లలోని ఓ ఖాళీస్థలంలో ఇద్దరు బాలురు మత్తుఇంజెక్షన్లు వేసుకుంటూ బుధవారం మధ్యాహ్నం పోలీసు కెమెరాకు జిక్కారు. దీంతో వెంటనే ఆ ప్రాంతానికి తిరుపతి జిల్లా ఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసులు, రూరల్ సిఐ చిన్నగోవిందు చేరుకుని డ్రోన్కెమెరా చూపిన చోట ఇద్దరు యువకులు ఇంజక్షన్లతో పట్టుబడ్డారు. ఏకంగా మత్తు ఇంజక్షన్లను కలిగివుండటంతో పోలీసులు ఆందోళనకు గురయ్యారు. తిరుపతి జిల్లాలో గంజాయి, బంగాకు వంటి మత్తుపదార్థాలు,మాదకద్రవ్యాల పై జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్రాజు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ నిఘాతో తిరుపతిలో దాదాపు గంజాయి అక్రమరవాణా, విక్రయాలకు అడ్డుకట్టపడింది. ఈ సమయంలో ఇద్దరు బాలురు మత్తుకోసం ఏకంగా మాత్రలు కరిగించి ఆ ద్రవాన్ని ఇంజక్షన్ల రూపంలో ఎక్కించుకోవడం సంచలనంగా మారింది. ఇదో కొత్తరకం మత్తునిచ్చేదిగా పోలీసులు గుర్తించారు. మత్తు ఇంజక్షన్ వేసుకున్న బాలురు సైకోలుగా వెకిలిచేష్టలు నవ్వడం, పరుగులుతీయడం చేశారు. మత్తుకు అలవాటుపడిన బాలురు వారి మెదడు పాదరసంగా పనిచేస్తుందని వైద్యులు చెబుతూన్నారు. సంఘటనాస్థలికి చేరుకున్న తిరుపతి రూరల్ ఎంఆర్పల్లి సిఐ చిన్నగోవిందు సిబ్బంది బాలురును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తిరుపతి లింగేశ్వర్నగర్కు చెందిన వారుగా తేలింది. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపామని చెబుతున్నారు. అయితే కేసు నమోదు చేయకుండా వదిలినా వారిపై నిఘా ఉంటుందని తెలిపారు.

# 6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేస్తున్న దాల్మియా భారత్!

**విజయవాడ, జూలై 23,ప్రభాతవార్తప్రతినిధి::** భారత్లో నాల్గవ అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థ అయిన దాల్మియా భారత్ లిమిటెడ్ (డిబిఎల్), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడపలో ఉన్న తమ సమగ్ర కర్మాగారంలో 3.6 మిలియన్ టన్నుల క్లింకర్ సామర్థ్యాన్ని 6.0 మిలియన్ టన్నుల సిమెంట్ సామర్థ్యాన్ని విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే 3.6 మిలియన్ టన్నుల గ్రైండింగ్ సామర్థ్యానికి అదనంగా ఉంటుంది. రూ. 3,287 కోట్ల వ్యూహాత్మక పెట్టుబడితో ఈ విస్తరణ దాల్మియా భారత్ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మరియు ప్రాంతీయ ఆర్థిక పురోగతికి నిబద్ధతను ప్రతిబింబిస్తుందని సంస్థ ఎండీ పునీత్ దాల్మియా హరిత పరిశ్రమగా మోడల్గా అభివృద్ధి చేయబడే ఈ యూనిట్ ఆధునిక సాంకేతికత, శక్తి సామర్థ్యం గల ప్రక్రియలు, మరియు ఈఎస్జి ఆధారిత పద్ధతులను సమన్వయం చేయనుంది. శీ2నీ28 రెండో త్రైమాసికం నాటికి ఈ ప్రాజెక్ట్ పూర్తవుతుందని ఆశించబడుతోంది. ఇది దాదాపు 5,000 ప్రత్యక్ష ,పరోక్ష ఉద్యోగాలను కల్పించి, కడపతో పాటు మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను ఉత్తేజితం చేస్తుంది. 75 మిలియన్ టన్నుల సిమెంట్ సామర్థ్యాన్ని సాధించాలనే దాల్మియా భారత్ అభిలాషకు మార్గం సిద్ధం చేస్తోంది.ఆంధ్రప్రదేశ్పై మాకున్న బలమైన అనుబంధాన్ని ఈ పెట్టుబడి మరింత బలపరుస్తోంది. రాష్ట్రానికి ఉన్న ప్రగతిశీల పారిశ్రామిక విధానాలు మరియు వ్యూహాత్మక స్థానం దాన్ని ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యంగా తీర్చిదిద్దాయి.

# ప్రతిభ ఆధారంగానే క్రీడా కార్యదర్శుల నియామకం

**విజయవాడ.జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** జిల్లా స్థాయి క్రీడా కార్యదర్శులను ప్రతిభ ఆధారంగా నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఎంపికైన వారు రెండేళ్ళ పాటు ఈ పదవిలో కొనసాగుతారు. గతంలో కార్యదర్శిగా పనిచేసిన వారికి ఈ సారి అవకాశం ఇవ్వరు. కార్యదర్శులుగా ఎంపిక కావడానికి వంద మార్కులను పాయింట్లు ఇస్తారు. సర్వీసుకు ఏడాదికి ఒక పాయింటు చొప్పున గరిష్టంగా 25 పాయింట్లు ఇస్తారు. అర్హతలకు ఐదు,అదనపు అర్హతలకు ఐదు,వ్యక్తిగతంగా క్రీడల్లో సాధించిన పతకాలకు 20,గతంలో క్రీడల నిర్వహణలో చూపిన నైపుణ్యాలకు ఐదు,విద్యార్థులు సాధించిన విజయాలపరంగా 30,పాఠశాల అభివృద్ధికి చేసిన కృషికి ఐదు,పాఠశాల విధుల్లో చూపిన నిబద్ధతకు ఐదు పాయింట్ల చొప్పున కేటాయిస్తారు. మహిళా టీచర్లకు ప్రోత్సాహకంగా అదనంగా 10 పాయింట్లు ఇస్తారు. ఈ పాయింట్లలో ఎక్కువ సాధించిన వారిని జిల్లా స్థాయి క్రీడా కార్యదర్శులుగా నియమించాలని జిల్లా విద్యాధికారులను డైరెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. ఎంపికైన వారి జాబితాను ఆగస్టు 8 లోపు డైరెక్టరేట్కు సమర్పించాలని పేర్కొన్నారు.

## ఎంబిబిఎస్,బిడిఎస్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**విజయవాడ.జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రం లోని మెడికల్ దంత వైద్య కళాశాల్లో ఎబిబీఎస్/బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నట్ యూజీ ప్రవేశ పరీక్ష రాసి స్థానిక ర్యాంకులు సాధించిన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ ఉదయం 9 నుంచి 29న రాత్రి 9 గంటల వరకు ధరఖాస్తులు డౌన్లోడ్ చేసుకొని పూరించి పంపాలి.అపరాధ రుసుం (రూ.20వేలు) తో ఈ నెల 30న ఉదయం 7 నుంచి 31 రాత్రి 8 గంటల్లోగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.విజయవాడ సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలోని 175 ఎంబీబీఎస్ సీట్లకు 18 శాతం ఆల్ ఇండియా కోటా,15 శాతం అన్ రిజర్వుడు క్యాటగిరీకి పోగా మిగిలిన సీట్లను ఆంధ్రా పరిధి 65-62 శాతం ఎస్వీయూ పరిధికి 34.38 శాతం కేటాయిస్తారు.లోకల్ క్యాటగిరీ కిందకు వచ్చే అభ్యర్థులు వరుసగా నాలుగేళ్ళు (9వ తరగతి నుంచి ఇంటర్) ఆయా ప్రాంతం లోని విద్యాసంస్థల్లో చదివి ఉండాలి. ఏ ఒక్క ఏడాది ఇతర రాష్ట్రాల్లో చదివినా లోక్ ప్రాధాన్యం కోల్పోతారు.కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలలకు జాతీయ వైద్య కమీషన్ అనుమతులు ఇవ్వకపోవడంతో సీట్లు పెండింగ్లో ఉన్నాయి.

ఈ ఏడాది విశాఖపట్నం లోని గాయత్రి విద్యా పరిషత్కు ఇంకా అనుమతులు రాలేదు. ఫీజుల మార్గదర్శకాలు ఇంకా విడుదల కావాల్సి ఉంది. విశ్వవిద్యాలయం మార్గదర్శకాలపై అభ్యంతరాలుంటే 89787-80501, 79977-10168 నంబర్లకు, సాంకేతిక సమస్యలు తలెత్తితే 90007-80707కు ఫోన్ చేయవచ్చు.

# 79వ స్వాతంత్ర్య దినోత్సవం ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష



**విజయవాడ,23 జూలై:**ఆగస్టు 15వ తేదీన నిర్వహించనున్న 79వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఈసారి రాష్ట్ర రాజధాని అమరావతిలోనే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు.ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్ర సచివాలయం వెనుక వైపున ఇటీవల పి4,ప్రప్రంచ జనాభా దినోత్సవ వేడుకులు నిర్వహించిన ప్రాంతంలో స్వాంత్రంత్ర్య దినోత్సవ వేడుకలను జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని కావున అందుకు అనుగుణంగా తగిన పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.రాజధాని నడిబొడ్డు ప్రాంగణంలో తొలిసారిగా రాష్ట్ర వేడుకైన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను మరీ ముఖ్యంగా బహిరంగ ప్రాంతంలోను వర్షాకాలంలోను నిర్వహించనున్నందున ఈకార్యక్రమం విజయవంతానికి మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సిఎస్ విజాయనంద్ అధికారులకు స్పష్టం చేశారు. రానున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించి ఆయా శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లను ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేని రీతిలో పటిష్టంగా చేపట్టాలని సిఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా వర్షాకాలమైనందున వేడుకల నిర్వహణకు తగిన రీతిలో ప్రాంగణమంతా లెవెలింగ్ చేయడంతో పాటు ప్రధాన వేదిక తోపాటు,ఇతర సీటింగ్ ఏర్పాట్లు వద్ద జర్మన్ టెంట్లు వేయించాని,వాహనాల పార్కింగ్ కు తగిన ఏర్పాట్లు చేయాలని సిఆర్డిఏ కమీషనర్ కన్నబాబును ఆదేశించారు.ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అదనపు డిజిపి మదుసూదన్ రెడ్డిని ఆదేశించారు.

# అటవీశాఖలో సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**- 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ**

**విజయవాడ, జూలై23 ,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర అటవీశాఖలో 100 సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్(ఏపీపీఎస్సీ) మంగళవారం నోటిఫికేషణ్ విడుదల చేసింది. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 17 వరకు ధరఖాస్తులు స్వీకరించనుంది. 2025 సెప్టంబరు 7న ఆఫ్లైన్లో ప్రాథమిక పరీక్ష జరుగనుంది. ప్రధాన పరీక్ష తేదీ తర్వాత వెల్లడిస్తారు. అర్హతలు, సిలబస్, మెడికల్ టెస్ట్ తదితర పూర్తి వివరాలు ఏపీపీఎస్సీ వెబ్సైట్లో ఉన్నాయని కార్యదర్శి రాజబాబు ఓ ప్రకటనలో తెలిపారు. అటవీ శాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్,అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ(మొత్తం పోస్టులు 691)కి ఈ నెల 14న నోటిఫికేషన్ ఇచ్చింది. ఏపీపీఎస్సీ నుంచి త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉంది.

# రైల్వే ఎఎస్ఎం పరీక్ష ప్రశ్నా పత్రం లీకేజీ కేసు పూర్వాపరాలు

**గుంతకల్లు రైల్వే, జూలై 23,ప్రభాతవార్త** రెండు దశాబ్దాల క్రితం రైల్వేలో సంచలనం సృష్టించిన ప్రొబేషనరీ ఏఎస్ఎం పదోన్నతుల పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ కుంభకోణం కేసు దర్యాప్తు, విచారణలు పూర్తై నింధితులకు ఎట్టకేలకు శిక్ష పడింది. ఈ కేసులో నింధితులలో ఉన్న ఓ ప్రైవేటు వ్యక్తి కేసు ట్రైల్స్ జరుగుతున్న సమయంలో మృతిచెందగా మిగిలిన నాటి 8మంది రైల్వే సిబ్బందిపై నేరారోపణలు రుజువు కావడంతో సిబిఐ కేసుల ప్రత్యేక న్యాయస్థానం జైలు శిక్షను విధించింది. ఈ కేసుకు సంబంధించిన పూర్వాపరాలు ఇలా వున్నాయి. పశ్చిమ రైల్వే బరోడా డివిజన్లో 2002ఆగస్టులో జరిగిన పదోన్నతుల పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో 8మంది రైల్వే సిబ్బందిపై నేరారోపణలు రుజువు కావడంతో ఒక్కొక్కరికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరిపై రూ.5లక్షల జరిమానా విధిస్తూ అహ్మదాబాద్ సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు సిబిఐ/రైల్వే వర్గాలు తెలిపాయి. పశ్చిమ రైల్వే బరోడా డివిజన్లో 2002ఆగస్టు 18న నిర్వహించనున్న రైల్వే ప్రొటేషనరీ సహాయ స్టేషన్ మాస్టర్ పదోన్నతి పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రం లీక్ చేసేందుకు రైల్వే సిబ్బంది, పలువురు ప్రైవేటు వ్యక్తులు నుంచి రూ.50వేల నుంచి లక్ష వరకు నింధితులు అక్రమంగా వసూలు చేసినట్లు ఆరోపిస్తూ అహ్మదాబాద్ చీఫ్ విజిలెన్స్ ఇన్స్పెక్టర్ చేసిన ఫిర్యాదు మేరకు 2002ఆగస్టు 17న సిబిఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి 2003జూలై 28న చార్జిషీట్ దాఖలు చేసింది. అహ్మదాబాద్లోని సిబిఐ కేసుల ప్రత్యేక న్యాయస్థానం విచారణలో 8మంది నింధితులు అక్రమార్జనకై నేరపూరిత కుట్ర నేరానికి పాల్పడినట్లు నేరారోపణలు రుజువు అయ్యాయన్నారు.

# ఆధునిక సాంకేతికతతో రవాణా శాఖను మరింత బలోపేతం చేస్తాం: మంత్రి రాంప్రసాద్రెడ్డి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జూలై, 23( ప్రభాతవార్త):** సిబ్బంది, వాహనాలు, ఆధునిక సాంకేతికలతో రవాణా శాఖను బలోపేతం చేసి రాష్ట్రంలో రహదారి భద్రతను మరింత పెంపొందిస్తామని రాష్ట్ర రవాణా, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. బుధవారం మంత్రి రాంప్రసాద్ రెడ్డి కాకినాడ పర్యటనలో భాగంగా, మద్యాహ్నం స్థానిక జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో రవాణా శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి శాఖా పరమైన కార్యక్రమాల అమలు ప్రగతి, వాటి నిర్వహణలో అధికారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సమీక్షి ంచారు. ఈ సందర్భంగా రవాణా శాఖలో పారదర్శకత, సమర్థ సేవల కల్పన, ఆదాయ వృద్ధి, రహదారి భద్రత తదితర అంశాలపై ఆయన అధికారులకు మార్గదర్శకాలను జారీ చేసారు. గత ప్రభుత్వం కేవలం ఆదాయ సేకరణకే ప్రాధాన్యత ఇచ్చి, సిబ్బంది, వాహనాలను కల్పించకుండా రవాణా శాఖను నిరక్ష ్యం చేసి నిర్వీర్యం చేసిందన్నారు. రవాణా శాఖలో ఖాళీగా ఉన్న ఆర్టిఓ, డిటిసి, ఎఓ, యంవిఐ, ఓయంవిఐ, ఇతర కేడర్ పోస్టులను భర్తీ చేసి, వాహనాలు, ఇతర కనీస అవసరాలను కల్పించి శాఖకు పూర్వ వైభవాన్ని తెస్తామన్నారు. అలాగే జిల్లాల విభజన జరిగాక, చాలా జిల్లాల్లో రవాణా శాఖ కార్యాలయాలకు సరైన భవనాలు కూడా లేవని, త్వరలో అన్ని కార్యాలయాలకు భవనాల నిర్మించేందుకు ప్రతిపాదించామన్నారు. రహదారి ప్రమాదాల నివారణలో పోలీస్, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రీన్ టాక్స్ రద్దు చేయడం వల్ల ఆదాయ సేకరణ తగ్గినప్పటికీ, ఎన్ ఫోర్స్ మెంట్ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడం, ఫీజులు, జరిమానాలను సమర్థవంతంగా వసూలు చేయడం ద్వారా ఆదాయ సేకరణ లక్ష్యాలను సాధించాలని అధికారులకు మంత్రి సూచించారు. రహదారి భద్రతా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలలో అవగాహన, ఆచరణ పెంచాలని కోరారు. ఓవర్ లోడింగ్, డ్రంకెన్ డ్రైవ్ లను నిరోధించి, రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. క్షేత్ర స్థాయిలో రవాణా ఎదుర్కొంటున్న సమస్యలన్నిటి పరిష్కారానికి తగు చర్యలు చేపడతామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

సమావేశంలో రహదారి భద్రత సందేశాలతో రవాణా శాఖ ప్రచురించిన పోస్టర్ ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి రవాణా శాఖ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై వివరించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల కనుగుణంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాల్లో ఒక ఎటిఎస్ ఫిట్ నెస్ సెంటర్లు ఏర్పాటు జరుగుతోందని, ఈ కేంద్రాలకు దూరంగా ఉన్న వాహనదారులకు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మరిన్ని ఎక్కువ సెంటర్లు ఏర్పాటుకు ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు.

వార్త


కలలు మన అంతర్గత కోర్కెలకు నిజమైన భాష్యాలు. వాటిని అర్థం చేసుకోవడానికి కళా నైపుణ్యం ఉండాలి.

-యూవా చర్చిస్

# అనూహ్యమే !


ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనారోగ్య కారణాలవల్ల రాజీనామా చేశారు. పదవీ కాలం ఇంకా రెండేళ్లుండగానే అత్యున్నత రాజ్యసభ ఛైర్మన్ పదవికి తృణప్రాయంగా వదిలేసి మరోసారి ధన్‌ఖడ్ వార్తల్లోకెక్కారు. ఇది బాహ్య ప్రపంచానికి తెలిసిన సత్యం. రాజ్యసభ ఛైర్మన్‌గా ఉండి కూడా వీలైన ప్రతిసారీ న్యాయవ్యవస్థపై విమర్శలు చేసేవారు. కొలీజియం మీద ఆయనకు మంచి అభిప్రాయం ఉండేదికాదు. రాజ్యాంగంలోని ప్రధానంగా చెప్పబడే తొలి మూడు వ్యవస్థల విషయంలో ఆయనకు భిన్నభిప్రాయాలుండేవి. అయితే శాసన నిర్మిత వ్యవస్థ అన్నిటా గొప్పదని కీర్తించేవారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యాక అక్కడ ఉన్నంతకాలం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతతో ఘర్షణ వైఖరినే అవలంబించారు. చెప్పాలంటే ఆయనే ఆ రాష్ట్రంలో ప్రతిపక్షం. రాజ్యాంగ వ్యవహారాల్లో అందరూ ఓ మార్గదర్శి సూచికగా భావించే కేశవానంద భారతి కేసు గురించిన వాఖ్యాలు న్యాయకోవిదులెవరూ అంగీకరించలేకపోయారు. అయినా ఆయనచుట్టూ పలు రకాల వ్యాఖ్యానాలు, కథనాలు, చర్చలు, విశ్లేషణలు పెనవేసుకుపోయాయి. వెనుక ఏమయిందో కానీ ధన్‌ఖడ్ రాజీనామా విషయం చాలా తేలికగా తెమిలిపోయిందని అనుకునేందుకు లేదు. అనారోగ్య కారణాలనగానే చాలా మంది నేతలు అవును, కామోసు అని సరిపెట్టుకున్నా కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేష్ మాత్రం 'ఏదో ఉండే ఉంటుందని' సందేహాలు వ్యక్తం చేయడంతో ఒక్కొక్కరు బయటకు వచ్చి ఒక్కో విషయాన్ని ఏకరువు పెడుతున్నారు. ఇంకో రెండేళ్ల పదవీకాలం ఉండగా ఏమీలేందే ధన్‌ఖడ్ తొందరపడరనే వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి. దేశ రాజకీయాల్లో ఇప్పుడిదే సంచలనం. ధన్‌ఖడ్ ఎంత గుంభనంగా అయితే రాజీనామా సమర్పించారో అంతే వేగంగా రాష్ట్రపతి ఆయన రాజీనామా పత్రం ఆమోదించారు. నోట్లకట్టల కేసులో అనుమానిత జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం కోసం 63 మంది విపక్ష ఎంపీల నుండి అందిన నోటీసులను స్వీకరించడం అనంతర అంశాలు ధన్‌ఖడ్ రాజీనామాకు దారితీసాయని అభిప్రాయం వ్యక్తమౌతోంది. నిజానికి జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానంపై 150 మంది అఖిల పక్ష ఎంపీలు సంతకం చేసినందున ముందుకే వెళ్తుందని అంతకు ముందే కేంద్ర మంత్రి రిజిజు చెప్పారు. కానీ ముందుగా విపక్ష ఎంపీల నోటీసులను స్వీకరించి అభిశంసన చర్యలపై సెక్రటరీ జనరల్ ఆదేశించడమే ఆయన తప్పిదమని అధికార పార్టీ నేతలు భావించినట్లుంది. బిజెపి తమ నేతృత్వంలోనే ఈ తతంగమంతా జరగాలని ఆ పార్టీ భావించడం వల్లనే తదుపరి అన్ని ప్రక్రియల జారీ అయ్యాయనుకుంటుండగా కొత్త మెలిక అడ్డొచ్చింది. అలా ఈ కార్యక్రమం రక్తికట్టాలని భావించినా అందుకు భిన్నంగా జరగడంతో బిజెపి నేతలే ధన్‌ఖడ్ మీద గుర్రుగా ఉన్నారు. రాజీనామాకు ముందు బిజెపి పెద్దల వ్యవహారంపై చర్చకూడా జరిగిందని బిజెపి వర్గాల సమాచారం. అధికార పక్షం నుంచి ఎలాంటి సంప్రదింపులు లేకుండానే 'వర్మ'పై అభిశంసన పత్రాల ప్రక్రియ ముందుకుసాగటం బిజెపికి రుచించ లేదు. ఇందులో ధన్‌ఖడ్ వ్యవహారశైలిని పార్టీ జీర్ణించుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో బిఎసి సమావేశానికి ముఖ్యులుగా భావించే నడ్డా, రిజిజు హాజరుకాకపోవడం ధన్‌ఖడ్‌కు చీకాకు కలిగింది. అదే రాజీనామాకు కారణమని బయటకొచ్చింది. ప్రభుత్వం నిర్ణయాలతో అసహనంతోనే ఆయన రాజీనామా చేసినట్లు తాజాపరిణామాల్లో వివరాలు బయటకొచ్చాయి. ఆయనెప్పుడూ న్యాయవ్యవస్థ మీద పదునైన విమర్శనాస్త్రాలు సంధిస్తుంటారు. జస్టిస్ వర్మ కేసులో కనీసం ఎఫ్‌ఐఆర్‌ను కూడా నమోదు చేయలేని పరిస్థితులు వివరించారు. అంటే న్యాయవ్యవస్థలోని లోపాలను సరిదిద్దలేని పరిస్థితి పట్ల ఆయన ఆవేదన అర్థమవుతోంది. న్యాయవాద వృత్తిలోఉన్న తానుకూడా న్యాయవ్యవస్థలోని భాగమే అనుకుని చేశారని అంతా అర్థంచేసుకున్నా గతంలోని కొన్ని సందర్భాల్లో ఆయన చేసిన వ్యాఖ్యానాలను బట్టి ఆయనది నిర్మొహమాట వ్యక్తిత్వంగా భావించాలి. వర్మ అభిశంసన నోటీసు ప్రక్రియను నడిపే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి కోపం వచ్చి ఉంటుందని తేలింది. కాగా ఉపరాష్ట్రపతి ఏర్పాటు చేసిన బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశానికి రాజ్యసభ పక్షనేత జె.పి.నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికిరణ్ రిజిజుగైర్హాజరయ్యారు. అదే ధన్‌ఖడ్ ఆగ్రహాన్ని కల్పించింది. అతి ముఖ్యమైన నేతలు తన సమావేశానికి రాకపోవడం అవమానంగా భావించినట్లున్నారు. తీవ్ర అసంతృప్తి కారణంగానే రాజీనామా చేసారన్న విశ్లేషణలు ఇప్పుడు ప్రజాబాహుళ్యంలోకి చేరిపోయాయి. ఇంతేగాక ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు ప్రభుత్వం సిద్ధంగానే ఉన్నా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు ముందే అవకాశమిచ్చి తమను ఇరకాటంలో పడేసారని ప్రధాని కూడా ధన్‌ఖడ్‌పై సీరియస్‌గా ఉన్నట్లు బిజెపి వర్గాలు కూడా ధృవీకరించాయి. సభలో ఖర్గే మాట్లాడుతుండగా నడ్డా కల్పించుకుని ఇక్కడ ఖర్గే మాట్లాడింది ఏదీ రికార్డుల్లోకి వెళ్లదు. నేను మాట్లాడేదే రికార్డుల్లోకి వెళ్తుందని అనడంతోధన్‌ఖడ్ అవాక్కయినట్లు, అలా తనను అవమానించినట్లు భావించారని సమాచారం. ఆయన పదిరోజుల నాడే తాను 2027 ఆగస్టు నెలలో సరైన సమయంలో భగవత్సంకల్పం మేరకు పదవీ విరమణ చేస్తానని ధన్‌ఖడ్ చెప్పడం ఆయనలోని దృఢసంకల్పం ఏమిటో తెలిసింది. అంతలోనే ఇలా. పదిరోజులు తిరకుంగానే 'అనారోగ్య కారణాలం'లూ రాజీనామా ఎందుకు చేశారో ఎవరికి కోసం ఈ వ్యూహమో ఇప్పుడు పూర్తిగా తేటతెల్లమైంది. రాజకీయాల్లో ఏది జరిగినా ఎలా జరిగినా స్వీకరించాల్సిందే.

కళ్లు పోయినవాడు అంధుడు కాదు. తప్పులను కప్పిపుచ్చుకునేవాడే అంధుడు.



మహాత్మాగాంధీ

చీకట్లోనే నక్షత్రాలు కనబడతాయి. అలాగే కష్టాల్లోనే సత్యాలు గోచరమవుతాయి.



శంకరా చార్యులు

## ప్రజావాక్కు



### అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా!

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో 2021లో అప్పటి ప్రభుత్వం సుమారు మూడు కోట్ల రూపాయల నిధులతో మంజూరు చేసినఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌కాంప్లెక్స్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. గతంలో శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభమైనప్పటికీ, మధ్యలోనే ఆగిపోవడంతో ప్రస్తుతం మార్కెట్ ఆవరణ మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయి నిరుపయోగంగా మారింది. కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి మొదలుపెట్టిన ఈ నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడంతో, ఈప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతపాలకులు, అసంపూర్తిగా ఉన్న ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను త్వరగా పూర్తి చేసి, ప్రజల వినియోగంలోకి తీసుకురావాలి.

- కామిడి సతీష్ రెడ్డి, జమ్మికుంట

### పి4 పథకంపై అవగాహన కల్పించాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి4 పథకం మంచిదే కానీ, గ్రామ స్థాయిలో ప్రజలకు అసలు ఉద్దేశం సరిగా అర్థం కావడం లేదు. పంచాయతీ సెక్రటరీలు ప్రజలతో సమావేశమై పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అర్హత లేని కుటుంబాలు 'బంగారు కుటుంబం'గా నమోదు అవుతుండగా, వారిని దత్తత తీసుకునే మార్గదర్శుల కొరత వల్ల నిజంగా అర్హులైన పేద కుటుంబాలకు నష్టం జరుగుతోంది. ప్రభుత్వం డబ్బులు ఇచ్చే పథకంగా ప్రజలు అర్థం చేసుకుంటుండటంతో అసలు లక్ష్యం నిర్వీర్యం అవుతోంది. ఈ విషయంలో అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

- సాలిన రామారావు, శ్రీకాకుళం జిల్లా

### దొంగకంపెనీల పేరుతో మోసం

దొంగ కంపెనీ పేర్లతో హెచ్‌వన్‌బి వీసాలు, అనేక లక్షలు తీసుకుని అక్కడ ఎమ్ఎస్‌లు చేయించి చివరికిజాబ్ దగ్గర వచ్చేసరికి చేతులు ఎత్తిజారిపోయే జనాలు. మొన్న టార్గెట్ అనే అమెరికన్ మాల్‌లో పద్నాలుగు వందల సరుకు దొంగిలించి పట్టుబడి బేడీలు రుచి చూసిన మహా తల్లులూ అమెరికాలో తయారౌతున్నారు. ఇవే ఇలాగే కొనసాగితే అందర్నీ షిప్పుల్లో పంపడం తథ్యం.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టాలి

సమాజంలో చిన్నారులు భవిష్యత్తు పౌరులు మాత్రమే కాదు, నేటి బాధ్యతగా కూడా భావించాలి. కానీ ఇటీవల చిన్నారులపై లైంగిక దాడుల సంఖ్య ప్రమాదకరంగా పెరుగుతోంది. యునిసెఫ్ నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 53శాతం బాలికలు లైంగిక వేధింపులకు గురవుతుండగా, వాటిలో 90శాతం దాడులు కుటుంబసభ్యులు లేదా పరిచయస్తులచే జరుగుతుండటం మన మానవత్వాన్ని కలవరపెడుతోంది. ఇలాంటి దాడులు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తున్నాయి. బాధితులు భయంతో మౌనంగాఉంటూ జీవితాంతం ఆ గాయాలతోనే బతకాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అంతేకాదు, మత్తు పదార్థాలు, అసభ్య వీడియోలు, సోషల్ మీడియా వల్లనూ బాల బాలికలు ప్రమాదంలో పడుతున్నారు. పోక్సో చట్టం వంటి చట్టాలు ఉన్నా, అమలు లోపం వల్ల నేరగాళ్లకు శిక్షలు పడటం అరుదుగా మారింది. న్యాయవ్యవస్థ వేగంగా స్పందించాలి. సమస్య పరిష్కారానికి కొన్ని కీలక చర్యలు అవసరం.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పంట పొలాల్లో కరెంట్ పోల్స్

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని గ్రామాలలో పంట పొలాల్లో మధ్యలో మెయిన్ లైన్ కరెంటు పోల్స్ ప్రమాదకరంగా వుండి వంగి ఉన్నాయి. అసలే ఇదివానాకాలం. ఈసమయంలో ప్రమాదవశాత్తు భారీ వర్షానికి గాని, ఈదురు గాలులకు గాని వైర్లు తెగి, నేల మీద పడితే మనుషుల, పశువుల ప్రాణాలు పోయే ప్రమాదం లేకపోలేదు. గతంలో ఎంతో మంది మృత్యువాత పడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు తక్షణమే స్పందించాలి. ఇందులో భాగంగా ప్రమాదాలు జరగకుండా వెంటనే అధికారులు ఫీల్డ్ విజిట్ చేసి వంగి ఉన్న కరెంటు స్థంభాలను గుర్తించి సరిచేయాలి.

-కె.సతీష్, భూపాల్ పల్లి జిల్లా

### భవిష్యత్ సోలార్ పవర్ దే

ప్రపంచంలో విద్యుత్ వినియోగం సోలార్ విండ్ పవర్‌తోనే సాధ్యమవుతుంది. ప్రస్తుతం బొగ్గు, నీరు, అణుశక్తితో విద్యుత్ ఉత్పత్తి భారంగా మారుతుంది. ఈ ఇంధనాల వాడకం వల్ల ఖర్చు అధికం కావడమే కాకుండా కాలుష్యం జరుగుతుంది. అదే సోలార్ పవర్, విండ్ పవర్ వల్ల పర్యావరణం లో ఏ మార్పు ఉండదు. కావున భవిష్యత్ విద్యుత్ ఉత్పత్తి సోలార్, విండ్ పవర్‌తోనే సాధ్యం అవుతుంది.

-డి చాంద్ బాషా, కర్నూలు

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# సైబర్ నేరాలను 'వల' వేసి పట్టాలి

**మార్కెట్ ప్లేసెస్ వేదికలు చివరికి లైబ్రరీలూ డార్క్ వెబ్‌లో ఉంటాయి. కానీ మాదకద్రవ్యాలు, ఆయుధాలు దొంగిలించిన డేటా అమ్మటానికి, హ్యాకింగ్ సర్వీస్‌లకి ఎక్కువగా వాడుకుంటారు. ఇలా చీకటి (డార్క్) వెబ్ సామ్రాజ్యం ఒక వైపు, మరోవైపు ఆన్‌లైన్ సైబర్ నేరాలు. ఉత్తరాది ముఠాలు గ్రామాల్లో తిష్ట వేసి దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడుతున్నారు. కొత్త హాట్ స్పాట్లుగా మహబూబ్ నగర్, చిత్తూరు జిల్లాలు ఉన్నట్లు ఎఫ్‌సిఆర్‌ఎఫ్‌లో వెల్లడైంది. చిన్నచిన్న జాగ్రత్తలతో ముప్పు తప్పుతుందంటున్నారు అధ్యయనకర్తలు. పాలకులూ కఠినచట్టాలు శిక్షలతో కట్టడి చేయాలి. ఈ సైబర్ నేరాలు, చీకటి (డార్క్)వెబ్ సామ్రాజ్యాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే సైబర్ సెక్యూరిటీ పెంచి, అంతర్జాల చీకటి దందాలకు చరమగీతం పాడాలి. ప్రజలను సాంకేతిక పరిజ్ఞానంలో అవగాహన, చైతన్యం కలిగించాల్సిన అవసరం ఎంతో ఉంది.**



మేకిరి దామోదర్

మనదేశం ఆధునిక టెక్నాలజీతో ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ, స్వార్థం కోసం కొందరు దాన్నే దుర్వినియోగ పరుస్తున్నారు. దేశ రక్షణ రహస్యాలను ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల, వ్యక్తుల గోప్యతను, బ్యాంకు నిల్వలను చెరబట్టి దేశద్రోహానికి, సైబర్ నేరాలకు చీకటి(డార్క్)వెబ్ అక్రమాలకు పాల్పడుతున్నారు. 'టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది'. దానితో ప్రాణం తీయవచ్చు, శస్త్ర చికిత్స చేసి ప్రాణం పోయవచ్చు. సాంకేతిక పరిజ్ఞాన ఫలాలు దేశ అభివృద్ధికి, సామాన్యుడి ప్రగతికి తోడ్పడినప్పుడే దానికి సార్థకత. దాన్ని దుర్వినియోగ పరిచే వారు ఎవ(ఎంతటివా)రైనా ముమ్మాటికి నేరస్తులే. ఇలామన దేశం ఉత్తరాదిలోని 10 జిల్లాల మారుమూల గ్రామాల్లో తిష్ట వేసిన ముఠాలు దేశవ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నాయి. ఆన్‌లైన్ మోసాల్లో 80శాతం వీరి ప్రమేయంతోనే జరుగుతున్నట్లు తాజాగా వెల్లడైంది. ముఖ్యంగా రాజస్థాన్, హర్యానా, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌లలోని పది జిల్లాలు సైబర్ నేరస్థుల కేంద్రంగా ఉన్నట్టు తెలుస్తుంది. అక్కడి ముఠాలే పలు విధానాల్లో బాధితులకు వలవేసి రూ.కోట్లు కొల్లగొడుతున్నట్లు తేలింది. ఐఐటి కాన్పూర్ స్టార్టప్ 'ది ఫ్యూచర్ క్రైమ్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎఫ్ సీఆర్‌ఎఫ్)' సంస్థ 'ఏ డీప్ డైవ్ ఇన్ టు సైబర్ క్రైమ్ ట్రెండ్స్ ఇంపాక్టింగ్ ఇండియా' పేరిట నిర్వహించిన తాజా అధ్యయనం ఈ విషయాలను వెల్లడించింది. 2023 జరిగిన సైబర్ నేరాల ఆధారంగా ఈ పరిశీలన జరిగింది. సైబర్ నేరాల బాధితులు ఎక్కువగా ఉంటున్న మెట్రో నగరాల్లో హైదరాబాద్ రెండవ స్థానంలో ఉండటం గమనార్హం. మరోవైపు సైబర్ నేరస్తులు ఈ ఏడాది దేశవ్యాప్తంగా రూ.20 వేల కోట్లకు పైగా కొల్లగొడతారని క్లౌడ్ సెక్‌సంస్థ అంచనా వేసింది. 'రెండోస్థానంలో హైదరాబాద్, సైబర్ ముఠాలు ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లోనే టార్గెట్ చేస్తున్నట్టు గణాంకాల ద్వారా తెలుస్తోంది. అత్యధికంగా సైబర్ బాధితుల, నమోదైన 17,623 కేసులు ఉన్న మెట్రో నగరాల జాబితాలో బెంగళూరు మొదటి స్థానంలో ఉండగా, 4,332 నమోదైన కేసులతో రెండవస్థానంలో హైదరాబాద్ నిలిచింది. 'ముంబాయిలో 4,169కేసులు నమోదైనాయి. అలాగే తెలంగాణలో హైదరాబాద్‌తో పాటు మహబూబ్ నగర్, ఏపీలోనిచిత్తూరు, తమిళనాడులోని చెన్నై, కోయంబత్తూర్ ప్రాంతాలు సైబర్ నేరాల బాధితులకు కొత్త హాట్‌స్పాట్ గా అవతరించినట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. నేరస్తులు పెట్రేగిపోవడానికి కారణాలివే. తొందరగా బెయిల్ లభించడం, అంతరాష్ట్ర సైబర్ నేరాల కేసులన్నీ అంత సులువుగా పర్యవేక్షించలేకపోవడం. సైబర్ నేరాల్లో మైనర్లు ఎక్కువగా ఉండటం. తాజాగా ఏఐ టూల్స్ సాయంతో అత్యంత సహజంగా కనిపించేలా ఫిషింగ్ మెయిల్స్, ఫేక్ డాష్ బోర్డులు, డోమెయిన్లు సృష్టిస్తున్నారు. నియంత్రణకు దర్యాప్తు సంస్థలు ఏం చేయాలంటే న్యాయస్థానాలకు అర్థమయ్యేలా నేరాల తీవ్రతపై సమగ్ర నివేదిక రూపొందించాలి. భారీ జరిమానాలతో పాటు కఠిన శిక్షలు వేయించడం. సైబర్ నేరాల ద్వారా సంపాదించిన ఆస్తుల్ని జప్తుచేయాలి. ఓటిపి చెప్పాలని లేదా పేమెంట్ పంపాలని వచ్చే కాల్స్‌కు స్పందించకూడదు. ఎకౌంట్లకు ఆంగ్ల అక్షరాలు, అంకెలు, సింబల్స్‌తో కూడిన బలమైన పాస్‌వర్డ్‌లను రూపొందించుకోవాలి. ఏదైనా లావాదేవీ జరిగినప్పుడు తప్పనిసరిగా ఫోన్‌కు ఓటిపి వచ్చేలా2 ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2ఎఫ్ ఏ) వ్యవస్థను ఏర్పాటు



చేసుకోవాలి. ఒకవేళ ఏదైనా సైబర్ నేరం బారిన పడితే వెంటనే '1930'కు ఫిర్యాదు చేయాలి. అంతర్జాలంలో అదృశ్య విభాగమే డార్క్ వెబ్ సామ్రాజ్యం. దీనిలో తెలిసింది గోరంత, తెలియాల్సింది కొండంత. ఈ మాట అంతర్జాలానికి అతికినట్లు సరిపోతుంది. మనకు తెలిసిన వెబ్ ప్రపంచం ఒక ఎత్తయితే.. తెలియని డార్క్ వెబ్ మరోఎత్తు. ఇటీవల కేరళకు చెందిన ఒకరు ఇందులో మాదకద్రవ్యాలను అమ్ముతున్నందుగాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ చీకటి లోకాన్ని చాలా వరకు నేరాలకే ఎందుకు వాడుతుంటారు!. ఇంతకీ డార్క్ వెబ్ అంటే ఏమిటి? అంతర్జాలంలోని అదృశ్య విభాగమే డార్క్ వెబ్. మామూలు సెర్చ్ ఇంజిన్లకు ఇది చిక్కదు. దీన్ని ఎక్సెస్ చేయాలంటే ప్రత్యేకమైన టూల్స్ లేదా బ్రౌజర్లు కావాలి. సాధారణంగా ఫైర్ పాక్స్, గూగుల్ యాహూ వంటి ఓపెన్ వెబ్ బ్రౌజర్ల ఐపి అడ్రస్‌ల ద్వారా యూజర్ల పనులను పర్యవేక్షిస్తాయి. అదే డార్క్‌వెబ్‌లో యూజర్ల ఐడెంటిటీ తెలియదు. గోప్యంగా లేదా అజ్ఞాతంగా ఉండాలని కోరుకునే వారికి ఇది ఓ రక్షణ స్థావరాన్ని సృష్టిస్తుంది. ఈ అంతర్జాల రహస్య అదృశ్య విభాగం 90 లోనే పురుడు పోసుకుంది. అమెరికా నేవల్ రీసెర్చ్ లేబరేటరీ అప్పట్లో ద ఆనియన్ రూటింగ్ ప్రాజెక్ట్ (టోర్) ప్రాథమిక వర్షన్‌తోనే దీనికి పునాది పడింది. పేరుకు తగ్గట్టుగా ఇది ఉల్లి పొరల మాదిరిగా కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లో సంకేత నిక్షిప్త సందేశాలను పొందుపరుస్తుంది. అంతర్జాలంలో ప్రసారమయ్యే ముఖ్యమైన ప్రభుత్వ సమాచారాలను రక్షించడం దీని ఉద్దేశం. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఆన్‌లైన్ గోప్యతను మరింత కట్టుదిట్టం చేసే లక్ష్యంతో రోజర్ డింగెల్ డైన్ ఆయన బృందం టోర్‌ను రూపొందించింది. ఇది స్వచ్ఛంద ఆపరేటెడ్ సర్వర్ల ద్వారా ఆన్‌లైన్ ట్రాఫిక్‌ను మళ్ళిస్తుంది. డేటాను ఎన్ క్రిప్ట్ చేయడం ద్వారా యూజర్ చిరునామాను దాచి పెడుతుంది. మొదట్లో మంచి ఉద్దేశం కోసం రూపొందించినప్పటికీ, క్రమంగా అక్రమ కార్యకలాపాలకు వాడుకోవడం ఎక్కువైంది. అక్రమ సరుకులు, సైబర్ నేరాల వంటి పనులకు వాడుకోవడం పెరుగుతోంది. అక్రమ కార్యకలాపాలకు పెట్టింది పేరైన డార్క్ వెబ్ విశ్వసనీయ పనులకు ఉపయోగపడుతుంది. వేగులు, పాత్రికేయులు, ఉద్యమకారులు పీడిత పాలనలో రహస్య సమాచారాన్ని ఇచ్చుపిచ్చు కోవడానికి దీన్ని వాడుకుంటారు. సెక్యూర్ డ్రాఫ్ వంటి వేదికలు అజ్ఞాతంగా లీకులు ఇవ్వడానికి అవకాశం ఇస్తాయి. సోర్సుల వివరాలు బయటకుపొక్కనీయవు. అంతర్జాల సెన్సార్ షిప్ అధికంగా ఉండే దేశాల్లో నిషేధిత సమాచార ప్రసారానికి డార్క్ జీవధారలా పనిచేస్తుంది. తమ డేటాను కాపాడుకోవడానికి కొన్ని ఆసుపత్రులు ఇతర సంస్థలు సైతం దాన్ని వాడుకుంటున్నాయి. అయితే ఈ అజ్ఞాత ధోరణే సైబర్ నేరాలకు ఆజ్యం పోస్తుంది. నల్ల బజార్లకు ఊతమిస్తోంది. మత్తు పదార్థాలు, దొంగ నోట్లకు, మాల్వేర్ లావాదేవీలకు ఆస్కారం కల్పిస్తోంది. దొంగిలించిన ఆర్థిక సమాచారం హ్యాకింగ్ టూల్స్ అమ్మకాలూ అక్కడ వెల్లువెత్తుతుంటాయి. ప్రపంచవ్యాప్తంగా చట్టపరమైన సంస్థలు డార్క్ వెబ్ వ్యవహారాలను ఓ కంట కనిపెడుతుంటాయి. కానీ అధునాతన ఎన్ క్రిప్షన్ పద్ధతులు మూలంగా నేరగాళ్లను గమనించడం పెద్ద సమస్యగా నిలుస్తోంది. అయినప్పటికీ అధునాతన విధానాలతో పోలీసులు నేరగాళ్లను పట్టుకుంటున్నారు. కేరళ వ్యక్తి ఉదంతమే దీనికి నిదర్శనం. సాధారణంగా టోర్‌ను డౌన్లోడ్ చేసుకొని డార్క్ వెబ్‌ను ఉపయోగించుకుంటారు. ఇది నోడ్స్ అని పిలుచుకునే పలు సర్వర్ల ద్వారా కనెక్షన్లు దారి మళ్ళిస్తుంది. టోర్ వీటిని ప్రపంచవ్యాప్తంగా యాదృచ్ఛికంగా ఎంచుకుంటుంది. ప్రతి దశలోనూ డేటాను రహస్య లిపిలోకి మారుస్తుంది. అందువల్ల డార్క్ వెబ్‌లో జరిగే వ్యవహారాలను పట్టుకోవటం దాదాపు అసాధ్యమనే చెప్పుకోవచ్చు. సంప్రదాయ సెర్చ్ ఇంజిన్లసూచికల్లో ఇవి ఉండవు. టూర్ యూజర్ తరఫున వెబ్ పేజీలను పరిశోధించదు. యూజరే సొంతంగా డార్క్ వెబ్ పేజీలను వెతుక్కోవాల్సి ఉంటుంది. మార్కెట్ ప్లేసెస్ వేదికలు చివరికి లైబ్రరీలూ డార్క్ వెబ్‌లో ఉంటాయి. కానీ మాదకద్రవ్యాలు, ఆయుధాలు దొంగిలించిన డేటా అమ్మటానికి, హ్యాకింగ్ సర్వీస్‌లకి ఎక్కువగా వాడుకుంటారు. ఇలా చీకటి (డార్క్) వెబ్ సామ్రాజ్యం ఒక వైపు, మరోవైపు ఆన్‌లైన్ సైబర్ నేరాలు. ఉత్తరాది ముఠాలు గ్రామాల్లో తిష్ట వేసి దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడుతున్నారు. కొత్త హాట్ స్పాట్లుగా మహబూబ్ నగర్, చిత్తూరు జిల్లాలు ఉన్నట్లు ఎఫ్‌సిఆర్‌ఎఫ్‌లో వెల్లడైంది. చిన్నచిన్న జాగ్రత్తలతో ముప్పు తప్పుతుందంటున్నారు అధ్యయనకర్తలు. పాలకులూ కఠినచట్టాలు శిక్షలతో కట్టడి చేయాలి. ఈ సైబర్ నేరాలు, చీకటి (డార్క్)వెబ్ సామ్రాజ్యాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోనే సైబర్ సెక్యూరిటీ పెంచి, అంతర్జాల చీకటి దందాలకు చరమగీతం పాడాలి. ప్రజలను సాంకేతిక పరిజ్ఞానంలో అవగాహన, చైతన్యం కలిగించాల్సిన అవసరం ఎంతో ఉంది. •

# ఆదాయపు పన్ను ఆర్థిక చైతన్యానికి పౌర బలం

రామ కిష్టయ్య సంగన భట్ల

భారత ఆర్థిక చైతన్యానికి సంకేతంగా నిలిచే జూలై 24 ఆదాయపు పన్ను దినోత్సవం. ఇది కేవలం ఓ చట్టబద్ధమైన విధానం రోజు కాదు. ఇది ప్రజల ఆర్థిక బాధ్యతను, ప్రభుత్వానికి పౌరుల భాగస్వామ్యాన్ని, నైతికతను, పారదర్శకతను గుర్తుచేసే చైతన్య దినం. భారత దేశంలో ఆదాయపు పన్ను చట్టం మూలాలు బ్రిటిష్ కాలంలోకే వెళ్తాయి. 1857 సిపాయిల తిరుగు బాటుతో ఏర్పడిన ఆర్థిక లోటును తీర్చేందుకు 1860 జూలై 24న బ్రిటన్ ఆర్థిక మంత్రి సర్ జేమ్స్ విల్సన్ పర్యవేక్షణలో ఆదాయపు పన్ను విధానం రూపొందించబడింది. గవర్నర్ జనరల్ లార్డ్ కేనింగ్ మద్దతుతో తొలిసారిగా భారత దేశంలో ఆదాయపు పన్ను అమలులోకి వచ్చింది. ఈ చరిత్రాత్మక నిర్ణయం భారత ఆర్థిక పరిపక్వతకు నాంది పలికింది. ఈ చారిత్రికతకు గౌరవ సూచకంగా భారత ఆదాయపు పన్ను శాఖ 2010 నుంచి ప్రతి సంవత్సరం జూలై 24ను ఆదాయపు పన్ను దినంగా అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పన్ను చెల్లింపు దారుల పట్ల కృతజ్ఞత ప్రకటిస్తూ అవగాహన కార్యక్రమాలు, సాంకేతిక శిక్షణలు, విజేతల సన్మానాలు నిర్వహించబడుతున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961 నాటి చట్టం, ఇది 1962 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం వ్యక్తులు, కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు తమ ఆదాయానికి తగిన విధంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. పన్ను వసూళ్లను పర్యవేక్షించే ఆదాయపు పన్ను శాఖ దీనిని నిష్ఠతో అమలు చేస్తోంది.

భారత ఆర్థిక వ్యవస్థలో ఆదాయపు పన్ను కీలకమైన వనరుగా నిలుస్తోంది. దేశానికి వచ్చే మొత్తం పన్ను ఆదాయంలో సగానికి పైగా ఆదాయపు పన్నుల ద్వారానే లభిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే ఆదాయపు



పన్నుల ద్వారా రూ.10 లక్షల కోట్లకు పైగా ఆదాయం నమోదైంది. ఈ ఆదాయంతోనే ప్రభుత్వం ఆరోగ్యం, విద్య, రక్షణ, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు పెడుతోంది. పన్ను చెల్లించే వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఆదాయపు పన్ను శాఖ అనేక సంస్కరణలను ప్రవేశ పెట్టింది. ముఖ్యంగా ఫేస్‌లెస్ అసెస్మెంట్ విధానం ద్వారా అవినీతి నివారణ, ఇఫైలింగ్ వేదిక ద్వారా సులభత, ప్రీఫిల్డ్ రిటర్న్‌లతో ప్రజలకు సమయాన్ని ఆదా చేసే మార్గం, డిజిటల్ చెల్లింపు పద్ధతుల ద్వారా పారదర్శకత పెరిగింది. అంతేకాక, ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని పన్ను చెల్లింపు దారుల అనుభవాన్ని మెరుగు పరచడం జరిగింది. పన్ను విధానంలో సామాజిక సమతుల్యతకూ ప్రాధాన్యం ఇచ్చారు. అధిక ఆదాయం కలిగిన వారు అధికపన్నుచెల్లిస్తే, తక్కువ ఆదాయం కలిగిన వారు మినహాయింపులనుపొందే విధంగా వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఫలితంగా, సమాజంలోని బలహీన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయి. 2023-24లో దేశవ్యాప్తంగా 8.2 కోట్లకు పైగా పన్ను చెల్లింపు దారులు నమోదయ్యారు. వారిలో 60 శాతం పాత పన్ను విధానాన్ని ఎంచుకోగా, మిగిలిన వారు కొత్త పన్ను విధానాన్ని అనుసరించారు. ఇది ఆదాయ స్థాయిలను బట్టి వ్యక్తులు ఎంచుకునే స్వేచ్ఛను సూచిస్తుంది. ఇదే ప్రజల ఆర్థిక చైతన్యానికి నిదర్శనం. పన్ను చెల్లించడాన్ని నేరుగా చట్టబద్ధ కర్తవ్యంగా కాక, దేశా, నికి చేసే సేవగా భావించాల్సిన అవసరం ఉంది. ప్రతి పౌరుడు తన ఆదాయానికి తగిన విధంగా పన్నుచెల్లిస్తే మాత్రమే సమాజంలో సమతుల్యాత, అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆదాయపు పన్నుదినం అంటే కేవలం పన్ను చట్టాన్ని గుర్తు చేసే రోజు కాదు. ఇది ప్రజల ఆర్థికబాధ్యతకు గుర్తుగా నిలిచే అవిశ్రాంత పిలుపు. ఈ సందర్భంగా పన్ను చెల్లించు - దేశాన్ని నిర్మించు అనే నినాదం ప్రజల మనసుల్లో నాటుకోవాలి. ధనికులు, మధ్యతరగతి వారు అనే తేడా లేకుండా నిజాయితీగా అందరూ పన్నులు చెల్లిస్తేనే సమాజం బాగుపడుతుంది. జూలై 24 దేశాభివృద్ధిలో పౌర సహకారానికి ఒక నిశ్చల గుర్తింపు. భవిష్యత్ భారత నిర్మాణానికి ప్రజల నైతిక ఆర్థిక చింతనకు నిలిచే శాశ్వత పిలుపు. •

# నకిలీ విత్తనాలతో గోసపడుతున్న రైతులు

డా. మోటె చిరంజీవి

ప్రతిసారి నకిలీ విత్తనాలతో రైతులు మోసపోతున్నారు. దేశానికి అన్నం పెట్టేటువంటి రైతులు దళారుల చేతిలో మోసపోతు గోసపడుతున్నారు. వానాకాలం ప్రారంభమైతే చాలు దుక్కులన్నీ చదును చేసుకుని, పంటలు వేసుకోవడానికి సిద్ధంగా ఉంటాయి. ఇక వారికి కావాల్సింది నాణ్యమైనటువంటి విత్తనాలు. ఈ నాణ్యమైనటువంటి విత్తనాలకోసం వారు వారికి దగ్గరలో ఉన్నటువంటి ప్రైవేటు ఫర్టిలైజర్స్ షాపుల పైన ఆధారపడుతుంటారు. అందులో కొంతమంది నాణ్యమైన విత్తనాలను రైతులకు ఇస్తే, కొంతమంది డబ్బే ప్రధానంగా నకిలీ విత్తనాలను విక్రయిస్తూ సంపాదిస్తున్నారు. ఇటీవల కాలంలో రకరకాల పేర్లతో, రకరకాల కంపెనీలతో నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ప్రతి సంవత్సరం వీటిని విక్రయించేటువంటి వారిని పోలీసులు పట్టుకొని, చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకున్నప్పటికీ ఇంకా చాలా ప్రాంతాలలో యేధేచ్ఛగా నకిలీ విత్తనాల దందా కొనసాగుతుంది. నకిలీ విత్తనాలు విక్రయించే వారి ఆగడాలకు అంతులేకుండా పోతుంది. వర్షాలు ప్రారంభం కావడంతో నిషేధిత బిటి 3(లూజ్) విత్తనాల విక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నాయి. గ్రామాలకు సంబంధించిన కొంతమంది ఓ ముఠాగా ఏర్పడి ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుండి నకిలీ బీటి 3 విత్తనాలను దిగుమతి చేసి రైతులకు కిలో రూ.3000లకు రైతులకు విక్రయిస్తున్నారు. ఇవే కాక రైతులు పెట్టేటువంటి పత్తి, వరి, మొక్కజొన్న, ఇతర పంటలకు సంబంధించిన కూరగాయల, పండ్ల పంటలకు సంబంధించిన నకిలీ విత్తనాలు మార్కెట్లలో చాలాచోట్ల పట్టుబడుతున్నాయి. నకిలీ విత్తనాలే కాకుండా నకిలీ మందులు కూడా అనేకంగా ఉన్నాయి. పంటపై పిచికారి చేసేందుకు ప్రభుత్వ నిషేధిత గ్లైపోసెట్ మందులు సైతం ముందస్తుగానే సరఫరా చేస్తులో కొంత మంది ముఠా సభ్యులు నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లు తెలిసినప్పటికీ సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు తూతూ మంత్రంగా ఎరువుల దుకాణాల తనిఖీలు చేస్తున్నామంటూ చేతులు దులుపుకోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నకిలీ బీటి3 విత్తనాల అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని



మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అవి మంచి విత్తనాలను తీసుకొచ్చినటువంటి రైతులు వారి పొలాల్లో నాటి కొద్దిరోజుల తర్వాత పూత రాకపోవడం వల్ల అవి నకిలీ అని గుర్తించి అధికారులకు సమాచారం ఇస్తున్నారు. పంట వేసిన తర్వాత దానికి కొంత పెట్టుబడి కూడా పెట్టడం జరుగుతుంది. మరి ఈ నకిలీ విత్తనాలను గుర్తించడానికి రైతులకు అనేక అవగాహన కార్యక్రమాలు పెట్టినప్పటికీ, చదువు లేనటువంటి వారు వాటిని గుర్తించలేకపోతున్నారు. ముందుగా వారు కొనే ప్రతి విత్తనానికి ఫర్టిలైజర్ షాపుల యజమానితో రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తన అనుమతులు పొందిన మంచి కంపెనీల గుర్తింపు పొందిన డీలర్ల నుంచే విత్తనాలు కొనాలి. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందినటువంటి లైసెన్స్ కలిగినటువంటి డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు తీసుకోవాలి. స్థానికంగా ఉన్న ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాలు, ప్రభుత్వ వ్యవసాయ పనిముట్లు విత్తనాలు విక్రయించేటువంటి వారి వద్ద మాత్రమే విత్తనాలను తీసుకోవాలి. అక్రమ వ్యాపారులకు దూరంగా ఉండాలి. విత్తనాల బ్యాగును క్షుణ్ణంగా పరిశీలించి, దాని పైన ఉండే హాలో గ్రామ్ ఉందో లేదో సరిచూసుకోవాలి. ప్రతి బ్యాగ్‌కు బార్ కోడ్ ఉంటే దాన్ని స్కాన్ చేసినట్లయితే దాని పూర్తి వివరాలు మనకి కనిపిస్తాయి. విత్తన సంచి వెనక స్టిక్కర్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రైవేటు కంపెనీల విత్తన సంచుల వెనుక భాగంలో పచ్చ రంగు ట్యాగ్ అంటే రూట్ ఫుల్ లేబుల్ అని, లేదా నీలి ట్యాగ్ ఆధారంగా సర్టిఫైడ్ సీడ్ అని గుర్తించాలి. పత్తి, మిరప వంటి విత్తనాలకు పచ్చ ట్యాగ్ ఉండేలా చూసుకోవాలి. ప్రతి ట్యాగ్ పైన లైసెన్స్ లార్డ్ నెంబర్ క్యూఆర్ కోడ్ ఉంటేనే అది నమ్మకమైన విత్తనంగా గుర్తించాలి. మరొక ముఖ్య విషయం ఏమిటంటే ప్యాకింగ్ తేదీ, చెల్లుబాటు గల తేదీలను ముద్రించబడి ఉన్నాయా లేదా అనేది చూసుకోవాలి. అలా లేని వాటిని కొనొద్దు. ఇవే కాకుండా జీవ సాంకేతికతను ఉపయోగించి జన్యు శాతం వంటి ప్రమాణాలు తప్పక మొలక శాతం 80 కంటే ఎక్కువ. జన్యు శాతం 98 కంటే ఎక్కువగా ఉండేలా చూడాలి. ఇలా చూసుకుని ఉన్నప్పుడే రైతులు నకిలి విత్తనాల నుండి ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారు. లేకపోతే అధిక నష్టం వాటిల్లవచ్చు. అందుకే ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రైవేటు విత్తన విక్రయ కేంద్రాల పైన దాడులు జరిపి అవి మన్నికైనవా కావా అనేటువంటిది చూసుకోవాలి. వాటి తయారీ కేంద్రాలకు వెళ్లి విత్తనాలను పరీక్ష చేయాలి. పకడ్బందీ చర్యలు తీసుకుంటేనే నకిలీ విత్తనాలను అరికట్టవచ్చు. ఆ దిశగా ప్రభుత్వం, వ్యక్తులు పనిచేయాలి. •

# తెనాలి అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యులను చేద్దాం : నాదెండ్ల పిలుపు

**తెనాలి, మున్సిపాలిటీ జులై 23, ప్రభాతవార్త :** నియోజకవర్గ అభివృద్ధిలో ప్రజలందరి ఈ ప్రాంత అభివృద్ధిలో ప్రజలను కూడా భాగస్వామ్యులను చేయాలని, ఈమేరకు



భాగస్వామ్యం ఎంతో అవసరమని నియోజకర్గ శాసన సభ్యులు, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. బుధవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నందు తెనాలి నియోజకవర్గ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, ముఖ్యంగా పి4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్ట్నర్షిప్)అమలు చేయుటకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు పి4 కార్యక్రమంలో అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పి4 పేరుతో రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజనాసింహా, తెనాలి మండల తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ, కొల్లిపర మండల తహశీల్దార్ సిద్దార్థ, తెనాలి మండల ఎంపీడీవో అత్తోట దీప్తి, కొల్లిపర మండల ఎంపిడివో విజయలక్ష్మి, మున్సిపల్ కమీషనర్ ఎం.లక్ష్మీ పతిరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు : ఎస్పీ సతీష్‌కుమార్

**గుంటూరు తూర్పు, జులై 23 (ప్రభాతవార్త) :** గుంటూరులో శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణం నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన కంకరగుంట, ఆర్యూబీ, శంకర్ విలాస్, ప్రాంతాల్లో పలు ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేస్తూ వాటిపై వాహనదారులకు అవగాహన కల్పించేందుకు సూచికలె, సూచన బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ పోలీసులు సూచనలు తప్పని సరిగా పాటించి నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. వాహనదారుల



డొంకరోడ్డులోని మూడు వంతెనల ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను పరిశీలించారు. త్వరలో శంకర్ విలాస్ పాత బ్రిడ్జిని కూల్చివేయనున్న నేపథ్యంలో సమస్యలు తలెత్తకుండా చూస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వాహన రద్దీ ఎక్కువగా ఉన్న సహకారంతో ట్రాఫిక్ నిర్వహణను మరింత ప్రభావ వంతంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఈస్ట్ డిఎస్పీ అజీజ్, వెస్ట్ డిఎస్పీ అరవింద్, ఎస్బి సిఐ అలహరి శ్రీనివాస్, ఈస్ట్ మరియు వెస్ట్ ట్రాఫిక్ సిఐలు అశోక్, సింగయ్య, అరండల్‌పేట సిఐ ఆరోగ్యరాజు, ఇతర ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాగర్ కుడి కాలువకు సాగునీరు విడుదల

**విజయపురిసౌత్, జులై 23 ప్రభాతవార్త:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువకు బుధవారం అధికారులు సాగునీటిని విడుదల చేశారు. కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఆదేశాలతో కుడి కాలువ



3వ గేటు ద్వారా 500 క్యూసెక్కుల నీటిని సాగర్ కుడి కాలువ గేట్స్ డీఈ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి వరద నీరు వస్తుండటంతో సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. దీంతో కుడికాలువ ఆయకట్టుకు అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషనన ఏఈలు భారతి, సుధ, అనితశ్రీ సిబ్బంది రమణ తదితరులు పాల్గొన్నాం

## తుళ్ళూరులో డెంగ్యూపై అవగాహన ర్యాలీ

**తుళ్ళూరు,జులై 23,ప్రభాతవార్త :** మండల కేంద్రంలో బుధవారం డెంగ్యూ వ్యాధిపై ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.గ్రామంలోని ప్రధాన వీధుల్లో నిర్వహించిన ఈ ర్యాలీలో ఆరోగ్య శాఖ సిబ్బంది,విద్యార్థులు "దోమలను నిర్మూలిద్దాం - డెంగ్యూ నివారించుకుందాం" అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.అనంతరం డెంగ్యూ వా



ృప్తి లక్షణాలు,నివారణ చర్యలపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో తుళ్ళూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్ ఆత్మహత్య

**తాడేపల్లి,జులై 23,ప్రభాతవార్త :** తాడేపల్లి మండలం పెనుమాకలో ఓ ఫోటోగ్రాఫర్ ఉరివేసుకొని బలవన్మరణానికి పాల ్పడ్డాడు.ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలను తాడేపల్లి ఎస్సై ఖాజావలి తెలిపారు.ఐదు నెలల క్రితమే వివాహమైన 21ఏళ్ళ చరణ్,కుటుంబ కలహాల నేపద్యంలోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కిందపడి యువతి ఆత్మహత్య

**సత్తెనపల్లి, జులై 23 ప్రభాతవార్త :** మండలంలోని కంకణాలపల్లి రైల్వేగేటు సమీపంలో పెమ్మ భార్గవి (20) అనే యువతి మంగళవారం సాయంత్రం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. బెల్లంకొండ మండలం గంగిరెడ్డిపాలెంకు చెందిన భార్గవి తన అక్క - బావ ఇంట్లో నివాసం ఉంటుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్గవి బలవన్మరణానికి పాల్పడినట్లు చెప్తున్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ముగిసిన ఏఎన్‌యు ఇంజనీరింగ్ అర్హత పరీక్ష

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జులై23, ప్రభాతవార్త:** వర్సిటీలోని ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సెల్ఫ్ సపోర్టింగ్ కేటగిరిలో 2025-26 విద్యా సంవత్సరానికి బిటెక్, యంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగాం ప్రవేశాలకు నిర్వహించిన ఏఎన్‌యు ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ బుధవారం ముగిసింది. ఆవివరాలను పీజీ ప్రవేశాల తాత్కాలిక డైరెక్టర్ ఆచార్య పి.బ్రహ్మాజీరావు వెల్లడించారు. మొత్తం 114మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 86మంది పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ, డాటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ కేటగిరిలో ప్రవేశాలు పొందిన వారికి ఫీజు రీఎంబర్స్ మెంట్ రాదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు అడ్మిషన్ల కార్యాలయంను సంప్రదించాలని సూచించారు.




**SATTENAPALLE MUNICIPALITY : SATTENAPALLE**
**e-Procurement Short Tender Notice**

Tender Notice No.12/2025-26/E1/SAPMPLTY,Dt.23-07-2025

| | | |
|---|---|---|
| 1 | No of works | 01 No |
| 2 | Total Value of Works | 7.15 Lakhs |
| 3 | Bid Document Download Stating Date | 24/07/2025 11:00 AM |
| 4 | Bid Document Download End Date | 28/07/2025 1:00 PM |
| 5 | Last Date&Time for receipt of bids | 28/07/2025 2:00 PM |
| 6 | Bid Opening Date | 28/07/2025 3:00 PM |

Further details can be seen @e-procurement market place at www.tender.apeprocurement.gov.in

Sd/- Commissioner,SATTENAPALLE MUNICIPALITY : SATTENAPALLE


# గుంటూరు వార్త

# ఏపిలో వేగంగా అభివృద్ధి

### మంత్రి ఆనం, ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట,జులై 23,ప్రభాతవార్త :** రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతుందని దేవాదాయ ధర్మాదాయశాఖామంత్రి ఆనం రాంనారాయణరెడ్డి అన్నారు. బుధవారం



నరసరావుపేట పర్యటనకు వచ్చిన ఆయనకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, ఆర్డీవో మధులత, పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబులు మాట్లాడారు.



రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఉచిత గ్యాస్ కనెక్షన్లను గతంలో అందించిందని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఆగస్టు 10 నుండి అమలు చేస్తామన్నారు. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ, ఆడబిడ్డ నిధి, మహిళలకు నెలకు రూ.1500లు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి వెళ్ళిందన్నారు. అదే విధంగా ప్రతి ఆలయంలో ఓంకార నామం తప్పనిసరిగా ఉండే నిబంధన అమలు చేస్తున్నామన్నారు. ఆలయాల్లో భక్తులకు మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమం జరుగుతుందన్నారు. వేద పాఠశాలలో చదువుకునే విద్యార్ధులకు బృతి అందిస్తున్నామన్నారు. అర్చకుల వేతనాలను పెంపుదల చేయడం జరిగిందన్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 998 దేవాలయాల్లో రూ.772 కోట్లతో పునర్ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలియజేశారు. కోటప్పకొండ దేవస్థానానికి రూ.57 లక్షల అప్పులను రద్దు చేశామని గుర్తు చేశారు. అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఈ సందర్భంగా మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి తెలియజేశారు. సభా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ శాకాంబరీ దేవిగా దుర్గమ్మ



**మంగళగిరి, జులై 23, ప్రభాతవార్త:** మంగళగిరి పెద కోనేరు శ్రీ దుర్గా భవాని ఆలయంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని బుధవారం మూడు రోజులపాటు జరిగే అమ్మవారి శ్రీ శాకాంబరీ దేవి అలంకారోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారిని కాయగూరలతో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చక స్వామి కూర్మాల బాల సాయి పూజల నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ కూర్మాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ త్రిశక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని మూడు రోజులు మూడు విధాలుగా కాయగూరలు, ఆకుకూరలు, శ్రావణమాసం ప్రారంభం రోజు పూలతో అలంకరించి పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శాకాంబరీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటే భక్తులకు లేమి అనేది లేకుండా ఉంటుందని, దేశం కూడా సుభిక్షంగా ఉంటుందన్నారు.

## భర్తను చంపి డోర్ డెలివరీ చేసిన భార్య

**గుంటూరు,జులై23,ప్రభాతవార్త :** భర్తను చంపి డోర్ డెలివరీ చేసిన ఘటన నంద్యాలలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పిడుగురాళ్లకు చెందిన రమణమ్మకు నంద్యాల జిల్లా నూనెపల్లెకు చెందిన రమణయ్య (50)తో వివాహమైంది. గొడవల కారణంగా భార్య పుట్టింటికి వెళ్లింది. ఆమెను తీసుకొనిరావడానికి భర్త రాగా ఘర్షణ జరిగింది. భార్య తమ్ముడితో కలిసి దాడిచేయడంతో రమణయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం మృతదేహాన్ని కారులో నంద్యాలలోని ఇంటి వద్ద పడేసి పరారయ్యారు.



క్యటుంబ కలహాలతో గత 2 నెలల నుంచి పుట్టింట్లో ఉంటున్న తన భార్యను తిరిగి తీసుకురావడానికి పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు వెళ్లిన 50 ఏళ్ల రమణయ్య మంగళవారం హత్యకు గురయ్యారు. మృతదేహాన్ని అతడి భార్య రమనమ్మ తన సోదరుడితో కలిసి రాత్రి వేళ కారులో తీసుకొచ్చి నంద్యాల జిల్లా నూనెపల్లెలోని రమణయ్య ఇంటి వద్ద పడేశారు. ఈ ఘటనపై నంద్యాల జిల్లా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పట్టణ అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించిన కమిషనర్

**గుంటూరు తూర్పు, జులై 23 (ప్రభాతవార్త) :** శంకర్ విలాస్ ఆర్‌ఓబి పనులు ప్రారంభం అవుతున్నందున ప్రధాన రహదారులను ట్రాఫిక్ రద్దీకి తగిన విధంగా సిద్దం చేసుకోవాలని, ట్రాఫిక్ రైల్వే నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ 3వంతెనల వద్ద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సదరు వంతెన ప్రాంతాల్లో జిఎంసి చేపట్టాల్సిన డ్రైన్ నిర్మాణ పనులు ఉంటే చేపట్టాలని ఈఈని ఆదేశించారు. కంకరగుంట, ఆర్యూబి వద్ద వర్షానికి నీరు నిలిచి



తీసుకోవాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమీషనర్ ఛాంబర్‌లో జిఎంసి ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్‌ఓబి నిర్మాణ పనులు ప్రారంభమైనందున నగరంలో ప్రజల రాకపోకలకు జిఎంసి వైపు నుండి పక్కగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ప్రత్యామ్నాయ రోడ్లలో ఇరువైపులా ఆక్రమణలు తొలగింపు పూర్తి చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను, రోడ్లకు మరమ్మత్తులు ఉంటే వెంటనే చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రైల్వే రాకపోకలు జరగడానికి వీలు ఉండడం లేదని, అక్కడ ప్రస్తుతం ఉన్న మోటార్లకు అదనంగా ఏర్పాటు చేసి వర్షాకాలం ముగిసే వరకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. రోడ్ల మీద ఆక్రమణలను నగరపాలక సంస్థ తొలగిస్తుందని వాటిని పునరావృతం కాకుండా పట్టణ ప్రణాళిక సిబ్బందికి ట్రాఫిక్ పోలీస్ సహకరించాలన్నారు. రోడ్ల అభివృద్ధి చేయాలని ట్రాఫిక్ పోలీసులు గుర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ట్రాఫిక్ సిఐలు అశోక్, వీరాస్వామి, ఈఈలు సుంద్రరామిరెడ్డి, కోటేశ్వరరావు, ఎసిపిలు రెహ్మాన్, వెంకటేశ్వరరావు, డిఈఈలు నాగభూషణం, కళ్యాణ రావు, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో ఇరువురి కిడ్నాప్,హత్య

**"పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పట్టపగలు దారుణం జరిగింది. కోర్టుకు వచ్చిన తండ్రి, కొడుకును పట్ట ్టపగలు, అత్యంత రద్దీ ప్రాంతంలో కిడ్నాప్ చేసి ఆ పై హతమార్చడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది."**

**- కోర్టుకు వచ్చిన తండ్రి, కొడుకును కిడ్నాప్ చేసి హతమార్చిన ప్రత్యర్థులు**

**- రియల్‌ఎస్టేట్ వివాదాలే హత్య కారణంగా ప్రాథమిక విచారణలో వెల్లడి**

**నరసరావుపేట క్రైం, జులై 23 ప్రభాతవార్త :** నరసరావుపేట పట్టణంలో బుధవారం స్థానిక కోర్టుకు చెక్ బౌన్స్ కేసులో బాపట్ల జిల్లాకు చెందిన ప్రశాంత్‌రెడ్డి, తండ్రి వీరాస్వామిరెడ్డిలు తమ న్యాయవాదితో కలిసి కోర్టుకు హాజరయ్యేందుకు వచ్చారు. ఒక రోజు ముందుగానే వారు నరసరావుపేట పట్టణానికి చేరుకొని స్థానికంగా బస చేశారు. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన వారు బెంగుళూరులో రియల్‌ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వారికి మరో రియల్‌ఎస్టేట్ వ్యాపారి గద్దం అనీల్ కుమార్‌రెడ్డికి వ్యాపార లావాదేవీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనీల్ కుమార్ రెడ్డి మృతులకు సంబంధించి చెకు ్కలను ఏపి పరిధిలోని ఒంగోలు, అద్దంకి, నరసరావుపేట ప్రాంతాలలో చెక్ బౌన్స్ కేసులను వేశారు. ఈ కేసులకు సంబంధించి మృతులు నరసరావుపేట కోర్టుకు హాజరయ్యారు. సంతమాగులూరు గ్రామంలో చిన్నముతాకు చెందినవారుగా పోలీసులు గుర్తించారు. తొలుత ఫ్యాక్షన్ జంట హత్యలుగా పోలీసులు భావించారు. అయితే



కిడ్నాప్ చేసేందుకు ఉపయోగించిన కారు

పూర్తిగా వ్యాపార లావాదేవీల విభేదాల క్రమంలోనే ఈ సంఘటన జరిగినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. హోటల్ నుండి బయటకు వచ్చిన ప్రశాంత్‌రెడ్డి, వీరాస్వామిరెడ్డిలను పథకం ప్రకారం కాపుకాసిన ప్రత్యర్థులు బలవంతంగా కారులోకి లాక్కెళ్ళారు. వారి న్యాయవాది అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పట్టణంలోని ప్రధాన వీధుల్లో వారిని కిడ్నాప్ చేసిన కారు వెళ్తున్న సమయంలో ఇరువురు న్యాయవాదులు ద్విచక్ర వాహనంపై కారునువెంబడించారు. చిలకలూరిపేట రోడ్డులోని ఓవర్ బ్రిడ్జిపై కారు సమీపంలోకి వెళ్ళి ఆపమని కోరినా మరింత వేగంగా కారును బైపాస్ వైపు మళ్ళించారు. అతికిరాతకంగా వారిని హత్య చేసి సంతమాగులూరు గ్రామ సమీపంలో ఉన్న రియల్‌ఎస్టేట్ వెంచర్‌లో వారి మృతదేహాలను పడవేసి అక్కడి నుండి హంతకులు పరారయ్యారు. అయితే ప్రధాన నిందితునిగా భావిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు చెప్తున్నారు.



కాపాడేందుకు ప్రయత్నించిన న్యాయవాది

## పేదలకు అభయ హస్తం ముఖ్యమంత్రి సహాయనిధి

**సత్తెనపల్లిటౌన్, జులై 23,ప్రభాతవార్త :** సత్తెనపల్లి పట్టణంలోని ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అభయ హస్తం ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్ లోని ప్రజా వేదికలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 87 మంది లబ్ధిదారులకు 79 లక్షల 59 వేల 226 లను పంపిణీ చేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి సహాయ నిధి పక్కన పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధిని పునరుద్ధరించిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను కూటమి ప్రభుత్వ నెరవేరుస్తుందని శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు.ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం కనుమరుగాయె!

**- ప్రసవానికి వచ్చిన బాలింతలకు నరకమే**

**- కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిల్**

కారంపూడి, జులై 23 ప్రభాతవార్త: ప్రతి పేదవానికి నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వం మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. వైద్యులు, సిబ్బంది, సరపడా మందులు అందిస్తున్నా రోగులకు మాత్రం వైద్యం కనుమరుగైంది.



లక్షల రూపాయల ఖర్చుతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నా ప్రసవానికి వచ్చిన బాలింతలు నరకాన్ని అనుభవించాల్సిందే. మాతా శిశు సంరక్షణ కేంద్రంగా ఉన్న కారంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, వ్యాధి నిరోధక టీకాలు అందిస్తూ సాధారణ వైద్యసేవలు అందించాలి. కానీ కాన్పులకు వచ్చిన బాలింతలు మాత్రం ఇబ్బంది పడుతున్నారు. ఇద్దరు వైద్యాధికారులు ఉన్నప్పటికీ కాన్పులు మాత్రం జరగనట్లు తెలుస్తోంది. మంగళవారం బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన గర్భిణీ ప్రసవం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చింది. ఏడు గంటలపాటు పురిటినొప్పులతో విలవిల్లాడింది. సరైన వసతులు లేవని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పంపడానికి 108 వాహనం కోసం ఎదురుచూశారు. 108 వాహనం వేరే ప్రాంతానికి వెళ్లడంతో ఆ వాహనం వచ్చేంత వరకు గర్భిణీ స్త్రీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉంచారు. పురిటి నొప్పులతో బాధపడిన మహిళ ఎట్టకేలకు సాయంత్రానికి వచ్చిన 108 వాహనంలో ప్రసవానికి వేరే ప్రాంతానికి తరలించారు. నొప్పులతో బాధపడిన మహిలకు జరగరానిది ఏమైనా జరిగితే పరిస్థితి ఏమిటని బాధితులు అంటున్నారు. సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్లలేక అక్కడ వేలకువేలు కట్టలేని కుటుంబాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తే సదుపాయాలు లేవని పంపడం సరికాదని అంటున్నారు. గతంలో కారంపూడి ప్రాథమిక వైద్యశాలకు ఓ చరిత్ర ఉంది. కార్పొరేట్ వైద్యశాలకు ధీటుగా వైద్యసేవలు అందించారు. కానీ అలాంటి వైద్యసేవలు కనుమరుగయ్యాయి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కూడా లేకపోవడంతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు పంపడం జరుగుతుంది. పేదవానికి మాత్రం వైద్యం దూరమయినట్లు తెలుస్తుంది. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి కారంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్యం అందే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి: రవి**

సాధారణ కాన్పు చేయడానికి వైద్యులు ప్రయత్నించారు. సరైన సమయంలో 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో జిల్లా కోఆర్డినేటర్‌తో మాట్లాడి 108 వాహనాన్ని పిలిపించి గర్భిణీని వైద్యశాలకు తరలించారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రవి తెలిపారు.

## మృతుని కుటుంబానికి నష్టపరిహార చెక్కును అందజేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు క్రైమ్,జులై 23,ప్రభాతవార్త :** స్థానిక 34వ డివిజన్ దేవాపురంలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు శ్లాబ్ కూలీ మృతిచెందిన తోట అప్పారావు కుటుంబ సభ్యులకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మున్సిపల్ కార్యాలయంలో రూ.5లక్షల నష్టపరిహార చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ దేవాపురంలో జరిగిన ఘటన అత్యంత బాధాకరం.వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడానికి రూ.5లక్షలు పరిహారంగా వారి కుటుంబానికి అందజేశాం.వారి కుటుంబ సభ్యులకు కుటుంబ పోషణ నిమిత్తం గుంటూరు రైతు బజార్‌లో ఒక షాప్ ఇవ్వడానికి నగరపాలక సంస్థ అంగీకరించిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి తాము ఎప్పుడూ ముందుంటామని ఎమ్మెల్యే మాధవి తెలిపారు.



# సేద్యానికి సాంకేతికత తోడైతే రాష్ట్ర వ్యవసాయరంగం ప్రపంచానికే మార్గదర్శిగా నిలుస్తుంది : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,జులై23,ప్రభాతవార్త: గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన రాష్ట్ర వ్యవసాయరంగానికి ఏడాదిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్త జవసత్వాలు అందించారని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం ప్రత్తిపాటి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పాలకుల్లా మోసపు వాగ్దానాలతో రైతులను వంచించకుండా కష్టకాలంలో వారికి అండగా నిలిచారని అదేవిధంగా నిలుస్తారని కూడా తెలిపారు. ఆరుగాలం శ్రమించిన అన్నదాతలు నష్టపోకూడదనే మిర్చికి గిట్టుబాటు ధర కల్పించి సకాలంలో కొనుగోళ్లు జరిగేలా చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించారని అన్నారు. ధరపతనమై దిగాలుపడిన మామిడి రైతులకు ఆపన్నహస్తం అందించి ఆదుకున్నారని అన్నారు. మార్కెట్ ఇంటర్వేషన్ స్కీమ్ ద్వారా కేంద్రం మరియు రాష్ట్రం చెరిసగం భారం భరించేలా టన్ను తోతాపురి మామిడికి రూ 11,490 కొనుగోలు చేసేలా కేంద్రాన్ని ఒప్పించారన్నారు. జ్యూస్ ఫ్యాక్టరీలు, వ్యాపారులతో నిత్యం కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.



**పంటల వివరాలపై శాటిలైట్ సర్వే ఏఐ పరిజ్ఞానం వినియోగించాలన్న ముఖ్యమంత్రి ఆలోచనతో రాష్ట్ర వ్యవసాయరంగం వేగంగా అభివృద్ధి చెందుతుంది**

ఇప్పుడు రాష్ట్ర వ్యవసాయరంగంలో సాంకేతికను జొప్పించడం ద్వారా తక్కువ శ్రమ, ఖర్చుతో అధికా లాభాలు సాధించేలా రైతులకు మేలుజరిగేలా ముఖ్యమంత్రి కొత్త ఆలోచనలు చేయడం నిజంగా రాష్ట్ర రైతాంగం సంతోషించాల్సిన అంశం అని అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి వ్యవసాయశాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలే నూతన సంస్కరణలు అమలు చేయాలని అధికారులను ఆదేశించడం అభినందనీయమని తెలిపారు. పంటల వివరాలపై సమగ్ర శాటిలైట్ సర్వే చేపట్టాలని సాంకేతిక పరిజ్ఞానంతో సాగును కొత్తపుంతలు తొక్కించాలన్న చంద్రబాబు ఆలోచనలు అమలైతే రాష్ట్ర వ్యవసాయరంగం విన్నూత్న మార్పులతో వేగంగా వృద్ధి చెందుతుందని అన్నారు. డ్రోన్ వినియోగం, ఏఐ పరిజ్ఞానంతో పాటు శాటిలైట్ సర్వేతో గొప్ప ఫలితాలు సాధించవచ్చునని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు తగిన అవగాహన, శిక్షణ కల్పిస్తే సేద్యంలో గొప్ప ఫలితాలు సాధించవచ్చునని తెలిపారు.

**అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ సాయం అందాలన్న చంద్రబాబు నిర్ణయాలపై రైతాంగం హర్షిస్తోంది**

రాష్ట్రంలోని ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ధి కలగాలన్న ముఖ్యమంత్రి ఆలోచించి రాష్ట్ర రైతాంగం హర్షిస్తుంది, పథకానికి అర్హులుగా ఇప్పటికే 47లక్షలు పైబలుకు రైతాంగాన్ని గుర్తించినట్లు అధికారులు చెప్పగా ఈకెవైసి, ఈ పంట నమోదు గుర్తించి పథకం ప్రయోజనాలు అందించాలని ముఖ్యమంత్రి ఆదేశాలు రైతులకు మేలు చేస్తాయని అన్నారు. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో పాటు, రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన దిశగా భూసర్వేలోని సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణ అమలు చేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలతో రైతులు ఎదుర్కొంటున్న సర్వే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

# పాఠశాల అభివృద్ధికి శ్రీనివాసరావు సేవలు అభినందనీయం

యద్దపాడు, జులై 23, ప్రభాతవార్త : పాఠశాల ఉన్నతికి తన వంతు సహాయ సహకారాలు అందజేసి విద్యార్థుల ఉన్నతికి ఎనలేని కృషిచేసిన వ్యక్తి శ్రీనివాసరావు అని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు కొనియాడారు. మండల పరిధిలోని కొండవీడు గ్రామంలోని పిఎమ్‌శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 8సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయుడుగా ఉంటూ బదిలీపై వెళ్ళిన హెచ్‌ఎమ్ జి శ్రీనివాసరావును, తెలుగు పండిట్ జి నరేంద్రకుమార్‌ను, జె కవిత, బిఎమ్ సుమతులను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రస్తుత హెచ్‌ఎమ్ ఎ మాధవి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్స్, గ్రామపెద్దలు పెద్దన్న, బిక్కు, మహమ్మద్ హుస్సేన్, వై వెంకట్రావు, ఎస్‌ఎమ్‌సీ చైర్మన్ షేక్ రసూల్ వైస్‌చైర్మన్ వై కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



# అక్కడ జగన్ మోసాలు,ఇక్కడ రజిని వేషాలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు

## మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, టిడిపి నాయకులు

చిలకలూరిపేట, జులై23,ప్రభాతవార్త: బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ అనే పేరుమీద పేటలో ఒక సభను ఏర్పాటుచేసి, ప్రజల తిరస్కరణకు గురైన నాయకులందరిని పోగేసి, బాబుగారి పాలనమీద, పుల్లారావు చేస్తున్నఅభివృద్ధి



కార్యక్రమాల మీద అసత్య ప్రచారాలు చేసుకుంటూ ప్రజలను మరోమారు మోసం చేద్దామంటే, వైసిపి నేతలను విశ్వసించే స్థితిలో ప్రజలు లేదని బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, టిడిపి నాయకులు తెలిపారు. టిడిపి నేతలు మిమ్మలను బహిరంగ చర్చలకు రావాలని సవాల్ విసరటం జరిగిందని ఈ సందర్బంగా వారు గుర్తుచేశారు. పసలైని ఆరోపణలు చేసిన మీకు, సదరు సవాల్‌ను స్వీకరించే దమ్ములేదని పార్టీ నేతలు తెలిపారు. ఇప్పటికైనా నిజాయితీగా ప్రజల కోసం పనిచేయాలని, ఒక్కొక్క హామీని నిలబెట్టుకునే దిశగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని అస్థిర పరచటానికి మీరు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టటానికి టిడిపి శ్రేణులు సిద్ధంగా ఉంటారని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా ఇటీవల మీరు చేసిన అసత్య ఆరోపణలు అన్నీ అవాస్తవాలని ప్రజలకు తెలియజేయాలని, లేదా మీరే ఒక వేదిక, తేదీ, సమయం నిర్ణయిస్తే ఏ ఏడాదిపాటు కూటమి ప్రభుత్వం అమలుపరిచిన హామీలపై చర్చించటానికి మేము సిద్దంగా ఉన్నామని టిడిపి నేతలు తెలిపారు. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని చేస్తున్న జగన్ మోసాలు, పేటలో రజిని వేస్తున్న వేషాలు ప్రజలు నమ్మే స్దితిలో లేరని అన్నారు. ఒక్కక్క హామీ అమలుకు అంకితభావంతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పట్ల, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుపై ప్రజలు అచంచల విశ్వాసంతో ఉన్నారన్నారు. అలాంటి వ్యక్తులపై నిందారోపణలు చేస్తే ఆకాశం మీద ఉమ్మిన చందాన ఉంటుందని వారు విమర్శించారు. బాబు

# ముప్పాళ్ళలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ

సత్తెనపల్లి,(ముప్పాళ్ళ),జులై 23,ప్రభాతవార్త : ముప్పాళ్ళ మండలంలోచాగంటి వారి పాలెం సాయిబాబా గుడి దగ్గర .నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సమన్వయకర్త డాక్టర్ గజ్జల



సుధీర్ రెడ్డి మాట్లాడుతూ బాబు షూరిటీమోసం గ్యారంటీ రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో.చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ అని ప్రతి ఇంటికి బాండ్లు పంపిణీ చేసిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత బాబు షూరిటీ కాస్త మోసం గ్యారంటీగా మారిపోయిందని ప్రజలను చంద్రబాబు తరచూ మభ్యపెడుతున్నారనిమహిళలకు ఉచిత బస్సు అని చెప్పి సంవత్సరం దాటిపోయిన పట్టించుకున్న ఊసే లేదని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ప్రతినెలా ఇస్తానని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను గాలికి వదిలేసి పబ్బం గడుపుతున్నారని18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 చొప్పున ఇస్తానని చెప్పి ఏడాది గెలిచిన మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా చంద్రబాబు చోద్యం చూస్తున్నారనిఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చిన ఘనత నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి దక్కుతుందని తెలియజేస్తూ చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చక పోగా వైసిపి కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తి లేదని కార్యకర్తలకు నేను అండగా ఉంటానని భరోసా ఇస్తూప్రతి ఒక్క వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ముప్పాళ్ళ మండలంలోని ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి చంద్రబాబు నాయుడు వలన జరిగిన నష్టాన్ని తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ వార్డు అనుబంధ విభాగాల బాధ్యులు ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# 25న ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ ప్రారంభోత్సవం

సత్తెనపల్లి టౌన్,జులై 23ప్రభాతవార్త : సత్తెనపల్లి పట్టణం లో మెయిన్ రోడ్డు నందు గల ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ను ఈ నెల 25వ తారీకు



మంత్రి వర్యులు బీసీ జనార్దన్ రెడ్డి ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న సందర్భంగా గెస్ట్ హౌస్ ను పరిశీలించిన సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలి : ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి టౌన్,జులై 23ప్రభాతవార్త : సత్తెనపల్లి పట్టణంలో ని ప్రభుత్వ ఏరియా వైద్యశాల నందు అభివృద్ధి కమిటీ మీటింగ్ కార్యక్రమం



లోసత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయ పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ గైల్ స్వచ్ఛంద సంస్థవారు హాస్పిటల్ కి బహుకరించిన పరికరములు ఫర్నిచర్ పరిశీలించి. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ స్కీమ్ గురించి ఆరా తీసి. వచ్చిన రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలనిడాక్టర్స్ మరియు కమిటీ సభ్యులను కోరిన. ఈ కార్యక్రమం లో హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు

# రోటరి క్లబ్ ఆధ్వర్యంలో బాలగంగాధర్ తిలక్ జయంతి ఉత్సవాలు

చిలకలూరిపేట, జులై 23, ప్రభాతవార్త: చిలకలూరిపేట రోటరిక్లబ్ ఆధ్వర్యంలో చంద్ర శేఖర్ అజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి ఉత్సవాలను బుధవారం పట్టణంలోని ఆర్‌విఎస సివిఎస్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్బంగా వారు దేశానికి చేసిన సేవల



గురించి క్లబ్ మాజీ అధ్యక్షులు, సిఆర్ కళాశాల చరిత్రోపన్యాసకులు తోటకూర వెంకటనారాయణ విద్యార్ధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉప్పుటూరి ప్రసాద్, కార్యదర్శి బోడి రామాసుబ్బారావు, ఆర్‌విఎస్ హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాబూ హామీల అమలు ఎక్కడ..?

## వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు, జులై 23,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ఇంత వరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడం కాదా..? బాబూ అంటూ వైకాపా సమన్వయకర్త



అంబటి మురళీకృష్ణ ప్రశ్నించారు. పట్టణంలోని 22,23వార్డుల్లో బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు నాయుడు మోసాలను ఎండగట్టారు. అరకొరగా అమలు చేసిన ఉచిత సిలెండర్ల పథకం, తల్లి వందనం పథకం చాలా మంది అర్హులకు అందలేదన్నారు. అలవికానీ హామీలను ఇచ్చి తీరా అమలు చేసే సమయంలో మీన మేషాలు లెక్కించడం.....గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్లే పథకాలను అమలు చేయలేకపోతున్నామని చెప్పడం సిగ్గు చేటు కాదా..? అని ప్రశ్నించారు. హామీలు ఇచ్చేటపు ్పడు అమలు చేయగలమా..? లేదా..? అనే విషయాలు తెలియకుండా చంద్రబాబునాయుడు హామీలను ఇచ్చారా..? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయకపోగా ఇది మంచి ప్రభుత్వమని ప్రచారం చేసుకొంటున్నారన్నారు. హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 99శాతం పథకాలను అమలు చేసిన ఘనత ఒక్క మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నేతృత్వంలోని వైకాపాకే దక్కిందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని మాట తప్పకుండా....మడమ తిప్పకుండా అమలు చేసిన ఘనత జగన్‌కే చెల్లిందన్నారు. ముమ్మాటికీ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని వైకాపా నాయకులు ప్రశ్నిస్తుంటే అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అయితే కూటిమి ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా వైకాపా నాయకులు, కార్యకర్తలు భయపడే ప్రశ్నే లేదన్నారు. అన్నీ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. ప్రజలు కూడా ఏది మంచి ప్రభుత్వం గుర్తించాలని, 2029లో మళ్ళీ జగనన్నను ముఖ్యమంత్రి చేయాలని, తద్వారా పేదరిక నిర్మూలన, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో జీవించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం మోసాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైఫుల్లా, ఎంపిపి భవనం పద్మలీల, వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ మహమ్మద్(మాము), నల్లమోతు రవీంద్రబాబు, గేరా కుమారి, సంజీవ్, ఎందేటి వెంకటసుబ్బయ్య, చింతలపూడి మురళీకృష్ణ, కూచిపూడి మరియరాణి, షేక్ నాజర్, షేక్ పీర్‌సాహెబ్, షేక్ మౌలాలి, పిల్లి మాణిక్యరావు, చందూరు వీరయ్య, అమిరినేని సాంబశివరావు, అంబటి వెంకటేశ్వరరావు, సుషోబిత, లంకపోతు పిచ్చిరెడ్డి, అప్పిరెడ్డి, ఆదిశేషు, షేక్ లాజర్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# 24వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు

సత్తెనపల్లి టౌన్,జులై 23ప్రభాతవార్త : సత్తెనపల్లి పట్టణంలోని 24 వ



వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు , ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి వర్యులు మరియు సత్తెనపల్లి నియోజకవర్గం శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ దానికి ముందు ప్రారంభోత్సవ చేశారు .ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులుతదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌ఎం అజితకుమారిని సత్కరించిన ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

చిలకలూరిపేట,జులై23,ప్రభాతవార్త: పల్నాడుజిల్లా ఎపియస్‌ఆర్‌టిసి ఆర్‌యంగా ఇటీవల పదవీ భాధ్యతలు స్వీకరించిన అజిత కుమారి బుధవారం చిలకలూరి పేట ఆర్‌టిసి డిపోను సందర్శించారు. ఈ సందర్బంగా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మర్యాద పూర్వకంగా ఆర్‌యం అజితకుమారిని కలిసి సత్కరించి బోకే అందించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



# జిల్లా భాజపా ఉపాధ్యక్షుడు, కార్యదర్శిగా నియమితులేన శివనాగేశ్వరరావు, హేమకుమార్‌లకు సత్కారం

చిలకలూరిపేటటౌన్, జులై 23, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడిగా



నియమితులైన మల్లెల శివనాగేశ్వరరావు, కార్యదర్శిగా నియమితేలైన గట్టా హేమ కుమార్‌లను పట్టణంలోని బిజెపి కార్యాయంలో నాయకులు సత్కరించారు. ఈ సందర్బంగా వారిని ఈ పదవిలో నియమించిన రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్‌కు పల్నాడుజిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్బంగా నియోజకవర్గ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి వారిద్దరిని సత్కరించారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోట పవన్‌గాంధి, కార్యదర్శి ఎస్ పోలయ్య, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి ఆదిమూలం గురుస్వామి, బిజెపి నాయుకులు పులుగుజ్జు మహేష్, రావికింది రామకృష్ణ, మాచర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పంట నమోదు చేసుకోవాలి : ఏడిఏ రామకోటేశ్వరి

చేబ్రోలు(పొన్నూరు), జులై 23,ప్రభాతవార్త: పంట వేసిన ప్రతి రైతు ఈ పంట యాప్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకురాలు



వి.రామకోటేశ్వరి సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని గొడవర్రు రైతు సేవా కేంద్రంలో బుధవారం జరిగిన పొలం పొలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందేందుకు పంట నమోదు చేసుకున్నట్లయితే వీలుగా ఉంటుందన్నారు. రైతులందరూ పంటల బీమా పథకం కింద రైతులు చెల్లించాల్సిన బీమాను సకాలంలో చెల్లించాలన్నారు. మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ యాక్టివ్, ఇన్‌యాక్టివ్ లిస్టులను రైతు సేవా కేంద్రంలో రైతుల సందర్శనార్ధం ఉంచడం జరిగిందన్నారు. రైతులు తమ పేర్లను సరిచూసుకోవాలన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయశాఖ పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి వెదసాగు చేసిన రైతులు పొలాల్లో వర్షపునీటిని నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. అనంతరం అధికారులు వివిధ ప్రాంతాల్లో పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బి.జానకీదేవి, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# దోనేపూడి, చిన్నపులివర్రు గ్రామాలలో పొలం పిలుస్తుంది

కొల్లూరు, జులై 23 (ప్రభాతవార్త) : మండల పరిధిలోని దోనేపూడి, చిన్నపులివర్రు గ్రామాల్లో బుధవరం మండల వ్యవసాయ అధికారి నరేంద్రబాబు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.



ఈ సందర్భంగా ఏఈవో నరేంద్రబాబు గ్రామసభ నిర్వహించి గ్రామసభ నందు రైతులనుద్దేశించి మాట్లాడుతూ ఈ పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. పంట నమోదు రైతులు చేయించుకోవడం వల్ల ప్రకృతి వైఫరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం నుండి వచ్చు ఇన్‌పుట్ సబ్సిడీని పొందటానికి మరియు క్రాఫ్ ఇన్సూరెన్స్ చేపించుకోవడానికి, రైతులు పండించిన పంటను అమ్మటం కొరకు ఈ పంట నమోదు తప్పనిసరి అని తెలియజేశారు. బుధవారం నుండి పంట చేయడం జరుగుతుందని కావున మీ రైతు సేవ కేంద్రం ముందు సంప్రదించి ప్రతి ఒక్కరూ ఈ పంట చేసుకోవాల్సింది రైతులకు తెలియజేశారు. గ్రామంలోని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించారు. కౌలు రైతులు అందరూ కౌలు గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. కౌలు గురి_ంపు కార్డులు పొందిన రైతులు జెఎల్‌జి గ్రూపులుగా ఏర్పడి బ్యాంకు నందు క్రాప్‌లోన్ పొందుటకు వినియోగించాలని తెలియజేశారు. వెద పద్ధతి వరి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎద పద్ధతులు కలుపు నివారణ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, విహెచ్ఎలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

నూజెండ్ల,జులై23,ప్రభాతవార్త: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని ఎంపిడివో పావులూరి ఉమాదేవి తెలిపారు. బుధవారం మండలంలోని కొత్త జడ్డావారిపాలెం,పాత జడ్డావారిపాలెం, ఎద్దవరం గ్రామ పంచాయితీల్లోని ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లను డిప్యూటి ఎంపిడివో సత్యనారాయణతో కలసి ఆమె పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులకు, క్లాప్‌మిత్రులకు తగు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు రామకృష్ణ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.





# కామ్రేడ్ అచ్యుతానందన్‌కు ఘన నివాళి

పొన్నూరు, జులై 23,ప్రభాతవార్త: కేరళ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సిపిఎం అగ్రనేత కామ్రేడ్ విఎస్ అచ్యుతానందన్



అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న స్థానిక సిపిఎం నాయకులు అచ్యుతానందన్‌కు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పొన్నూరు మండల కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి చిన్న వయసులోనే తల్లిదండ్రులు మరణించడంతో కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో పనికి వెళ్ళి అక్కడ కార్మికుల సమస్యలపై పోరాడిన వ్యక్తి కామ్రేడ్ విఎస్ అచ్యుతానందన్ అని చెప్పారు. 17వ ఏట కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకొని ప్రజా సమస్యలపై పనిచేస్తూ సిపిఎం పార్టీలో పొలిట్ బ్యూరో స్థాయికి ఎదిగారన్నారు. 2006నుండి 2011వరకు కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించి మంచి ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారన్నారు. సిపిఎం పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. అచ్యుతానందన్ మృతి పార్టీకి తీరని లోటని చెప్పారు. తొలుత అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాంబ్రహ్మాచారి, సెల్వన్‌రాజు, ఆందోని, వాసు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

# వరినారుమళ్ళలో ఇనుము దాతులోప నివారణ చేపట్టాలి

## మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు

పొన్నూరు, జులై 23,ప్రభాతవార్త: రైతులు వరి నారుమళ్ళలో ఇనుము దాతులోప నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు కోరారు. మండల పరిధిలోని ములుకుదురు, మాచవరం గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరి వెదసాగు చేసిన పైరులో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. నీటిని బయటకు పంపించిన తర్వాత 19:19:19, యూరియా పిచికారి చేయాలన్నారు. వరి పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకము ద్వారా పంటల బీమా కింద ఎకరానికి రూ.800చెల్లించాలన్నారు. కౌలు రైతులు తప్పని సరిగా సీసీఆర్సీ కార్డులు పొందాలన్నారు. ఈ పంట నమోదు, అన్నదాత సుఖీభవ కోసం పంట నష్టం జరిగినప్పుడు పేరు నమోదు కోసం ఉపయోగ పడతా యన్నారు. సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు మాట్లాడుతూ రైతు లు వ్యవసాయా



ధికారుల సూచనలు, సలహాలు అనుసరించి పంటలు సాగు చేసుకోవాలని చెప్పారు. వ్యవసాయాంత్రీకరణ ద్వారా పరికరాలు, స్ప్రేయర్లు, ఆయిల్ ఇంజన్లు ఇప్పించాలని కొందరు రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, డి.యామిని, గ్రామ ఉద్యాన సహాయకురాలు సిహెచ్ భానురేఖ, ఎంపిఈఓ ఎస్.సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

# చుపాచుప్స్ కొత్త టివిసి సంర్ఘుకే బాహార్ ప్రచారం

విజయవాడ, జులై 23, ప్రభాతవార్త : పర్ఫెట్టి వాన్‌మెల్లీకి చెందిన కన్ఫెక్షనరి బ్రాండ్లలో ఒకటి చుపాచుప్స్ సరికొత్త కాంపెయిన్ ప్రారంభించినట్లు వాన్‌మెల్లి ఇండియా మార్కెటింగ్ డైరెక్టర్ గుంజన్ ఖేతన్ తెలిపారు. సాధారణజీవితాన్ని పూర్తి వినోదంగా ఏవిధంగా మారుస్తుందనే ఆలోచనతో ఈ టివిసి రూపొందించామన్నారు. క్యారంస్ ఆడే స్నేహితులు చుపాచుప్‌ను కొరకడంతో ఊహించలేనంత ఉల్లాసంగా మారడం నేపథ్యమన్నారు.

# వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

వినుకొండ,జులై23,ప్రభాతవార్త: పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ నందు గల వాసవి



కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య సదావర్తి సంఘం ఆధ్వర్యంలో ఆషాడమాస పట్టి కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవారు శాకంబరీదేవి అలంకరణలో దర్శన మిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో రంగనాయక స్వామి దేవస్థానం నుంచి కోలాట భజన, మేళతాళాలతో అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. సదావర్తి సంఘం అధ్యక్షులు బొన్నలగడ్డ బాబ్జి మాట్లాడుతూ నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన మొట్టమొదటి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎన్నెస్పీ జెడ్పీ స్కూల్‌కు స్టీల్ గ్లాసులు బహూకరణ

వినుకొండ,జులై23,ప్రభాతవార్త: పట్టణంలోని ఎన్నెస్పీ కాలనీ నందు గల జెడ్పి స్కూల్



విద్యార్థులు రాగిజావ త్రాగుటకు స్టీల్ గ్లాసులను దాత మానం నాగేశ్వరరావు బుధవారం అందజేశారు. సుమారు రూ.5వేలు విలువ గల 150 గ్లాసులను వారి మిత్రులు మందటి శ్రీనివాసరావు, అత్తలూరు మల్లికార్జునరావు, నెమలపురి శ్రీనివాసరావుల ద్వారా పాఠశాలకు బహుకరించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సిహెచ్ వీరప ్పయ్య, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం ఎన్. పద్మజ, పీడీ ఆర్. రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## గోవింద్ డెయిరీని సందర్శించిన సంగం డెయిరీ ఛైర్మన్

**పొన్నూరు, జూలై 23,ప్రభాతవార్త:** పాడి రైతులకు పశుపోషణలో ఖర్చులు తగ్గించుకునేందుకు అవసరమైన మెళుకువలను తెలియజేసేందుకు సంగం డెయిరీ విశేషంగా కృషి చేస్తోందని సంగం డెయిరీ ఛైర్మన్, ఎమ్మెల్యే



ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. దేశంలోనే అత్యధిక ప్రసిద్ధిగాంచిన డెయిరీలలో ఒకటైన పూణే గోవింద్ డెయిరీని సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, అధికారులు సందర్శించారు. గోవింద్ డెయిరీ పాడి రైతుల సంక్షేమానికి, పాడిపరిశ్రమాభివృద్ధికి అవలంబిస్తున్న పద్ధతులను గోవింద్ డెయిరీ ఛైర్మన్ రాజేనాయక్‌ను అడిగి తెలుసుకొన్నారు. గోవింద్ డెయిరీ ఫారంను సందర్శించిన ఛైర్మన్ ధూళిపాళ్ళ అక్కడి రైతులు అవలంభిస్తోన్న పశువైద్య చికిత్సలో పాటిస్తున్న ఆయుర్వేద పద్ధతులను అడిగి తెలుసుకొన్నారు. గోవింద్ డెయిరీ ప్లాంటలో ఉపయోగిస్తున్నా టెక్నాలజీని పరిశీలించారు. అందుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకొన్నారు. పాల ఉత్పత్తుల ఎగుమతులలో మెలకువలు గురించి అడిగి తెలుసుకొన్నారు. గోవింద్ డెయిరీ ఛైర్మన్ సంజీవ్ రాజేనాయక్ నింబల్కర్, పాల సేకరణ మేనేజర్ పాడి రైతులకు గోవింద్ డెయిరీ అందిస్తున్న సాంకేతిక వనరులు, సౌకర్యాల గురించి వివరించారు. ఛైర్మన్ నరేంద్రకుమార్ వెంట సంగం డెయిరీ సీఈవో పర్వతనేని అనిల్‌కుమార్, అధికారులు, పశువైద్యాధికారులున్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలి

### జిల్లా వైద్యశాలల కోఆర్డినేటర్ డాక్టర్ రంగారావు

**పొన్నూరు, జూలై 23,ప్రభాతవార్త:** ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేవిధంగా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యశాలల కోఆర్డినేటర్ డాక్టర్ బి.రంగారావు ఆదేశించారు. నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిని బుధవారం ఆయన ఆకస్మింగా తనిఖీ చేశారు. వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రతి నిత్యం ఎంత మంది రోగులు ఇక్కడకి వస్తున్నారు. వారికి



అందిస్తున్న వైద్య సేవలు, వైద్యశాలలో ఉన్నటువంటి పరిస్థితులు, ల్యాబ్ యొక్క స్థితిగతులను పరిశీలించారు. రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరును పరిశీలించారు. వైద్యశాలలో ఇంకా మెరుగైన సేవలు అందించేవిధంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. వైద్యశాల అభివృద్ధికి, రోగులకు అందించాల్సిన వసతులకు సంబంధించిన పలు సూచనలను, సలహాలను ఇచ్చారు. వైద్యశాలకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పిరోజ్‌ఖాన్‌ను అడిగి తెలుసుకొన్నారు.

## మాస్టర్ ట్రైనీలకు శిక్షణ

**బాపట్ల, జూలై 23,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, కమిషనర్ ఆదేశాల మేరకు బాపట్ల ప్రాంతీయ శిక్షణా కేంద్రంలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 26జిల్లాల నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు. భువన జియో ట్యాగింగ్, జియో ఫేసింగ్ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని గూగుల్ మీట్



గ్రామస్థాయి ఎఫ్ఎలకు శిక్షణ ఇస్తారని చెప్పారు.



ద్వారా ఐఎఫ్ఎస్ డైరెక్టర్ వై.వి.షణ్ముఖ కుమార్, అడిషనల్ కమిషనర్ మల్లెల శివప్రసాద్ ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో 160మంది మాస్టర్ ట్రైనీలు పాల్గొని శిక్షణ పొందారు. జిల్లాలోని టెక్నికల్ సిబ్బంది, ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.పద్మజ, ఎస్‌పిఎం ఐఅండ్ సిబి డి.నరేంద్రబాబు, ఎపిఒ కె.స్వరూపరాణి, ఈసి జెవి సునీల్, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ఈ నెల 26 తేదీ వరకు జరుగుతుందని చెప్పారు.

## జెడ్పీ హై స్కూల్ ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు

**కాకుమాను జులై 23 (ప్రభాతవార్త) :** మండల కేంద్రంలో జెడ్పీ హై స్కూల్, కాకుమాను లో గతంలో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు బి. సత్యం , ఉపాధ్యాయులు ఎస్. రాము , వి. శ్రీనివాసరావు , టి. రవి కుమార్ బదిలీ అయిన సందర్భంగా బుధవారం వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడిందనీ మండల



విద్యా శాఖాధికారి కె.ఎఫ్ కెన్నడి తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు భాస్కర్ అధ్యక్షత వహించగా మండల విద్యాశాఖ అధికారి కె .ఎఫ్ కెనడీ ముఖ్య అతిథిగా హాజరై, బదిలీ అయిన ఉపాధ్యాయుల విద్యారంగంలో చేసిన సేవలను ప్రశంసించారు. ప్రత్యేక అతిథిగా రిటైర్డ్ టీచర్ జవహర్ రాణి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని తానెంతోకాలం గడిపిన అనుభూతులను పంచుకున్నారు. పాఠశాల సిబ్బంది అంతా పాల్గొని, బదిలీ అవుతున్న ఉపాధ్యాయులకు సన్మానాలు నిర్వహించి, వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ భవిష్యత్తు జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు తమ అభిమాన ఉపాధ్యాయులకు కవితలు, పాటలు, నాటికలతో గౌరవం నివ్వగా,వేదిక ఎంతో హృద్యంగా మారింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు

## ప్రత్తిపాడులో పొలం పిలుస్తుంది

**ప్రత్తిపాడు జులై 23, (ప్రభాతవార్త):** మండలం కేంద్రం ప్రత్తిపాడు-3 మరియు తిక్కిరెడ్డిపాలెం గ్రామములో పొలం పిలుస్తుంది కార్యక్రమం



నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాదికారిణీ షేక్. సుగుణ బేగం మరియు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బాగంగా రైతులకు అధిక వర్షాల కారణంగా పంట పొలంలో నిలిచిన నీరును బయటికి పోయే విధంగా చూసుకోవాలని తెలిపారు. 19.19.19,లేదా యురియా ఒక కేజీ ఎకారికి స్ప్రే చేయిచుకోవడం ద్వార పోషకాలు లబిస్తాయి అని తెలిపారు.రైతులకు సిసిఆర్సి (కౌలు రైతు కార్డు)ల ప్రాముఖ్యతను వివరించడం జరిగింది.కౌలుకు వ్యవసాయం చేస్తున్న రైతులు అందరు తమ గ్రామంలో ఉన్న రైతు సేవ కేంద్రం సిబ్బంది లేదా వీఆర్వో ని సంప్రదించి సిసిఆర్సి కార్డు ను పొందాలని తెలియజేసారు. డిజిటల్ క్రాప్ సర్వే గురించి తెలియజేసారు.మీ గ్రామాలలో ఉన్న ప్రతి ఒక్క రైతు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని తెలియచేసారు. కిసాన్ డ్రోన్స్ 80శాతం సబ్సిడీ పై అందుబాటులో ఉన్నాయని ఆసక్తి గలవారు రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి అప్లై చేసుకోవచు అని తెలిపారు.ఈ కార్యక్రమానికి రైతు సేవ కేంద్రం సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## చిన్నారులకు చేయూత

**మాచర్ల, జులై 23 ప్రభాతవార్త:** తల్లిదండ్రిని కోల్పోయిన చిన్నారులకు స్వామి వివేకానంద ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థిక చేయూతనందించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన దగ్గుల లక్ష్మీకార్తీక రెడ్డి (12) దగ్గుల అఖిల్‌రెడ్డి (10 చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయారు. ఈ విషయాన్ని కొత్తపల్లి గ్రామస్థులు స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు ఫౌండర్, ఛైర్మన్ మెట్టు గోవిందంరెడ్డికి తెలియజేశారు. స్పందించిన ఆయన చిన్నారులిద్దరికీ చదువు పూర్తయ్యేంత వరకు స్వయంగా బాధ్యత తీసుకుంటానన్నారు. కేవలం చదువే కాకుండా విలువలతో కూడిన విద్యను ఆశ్రమంలోనే కాకుండా జిల్లాలోని వివిధ ఆశ్రమాల్లో, స్కూళ్లలో జాయిన్ చేసి వారి పర్యవేక్షణ చూసుకుంటామన్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులందరూ హర్ష వ్యక్తం చేశారు.

## పేదరిక నిర్మూలనే పి4 లక్ష్యం: యాగంటి

**మాచర్ల, జులై 23 ప్రభాతవార్త:** పేదరిక నిర్మూలనే పి4 లక్ష్యమని మాచర్ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మాచర్ల పట్టణంలోని 15వ వార్డు సచివాలయ పరిధిలో నిర్వహించిన పి4 సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను, అభివృద్ధి బాటలో రాష్ట్రాన్ని నడిపిస్తూ పేదరికంలో ఉన్న ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం రూపొందించిన పథకం పి4 అని తెలియజేశారు. పి4 పథకం ద్వారా పేదరికంలో ఉన్న చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి, స్కిల్ డెవలప్‌వమెంట్ ద్వారా శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించడం, ఉన్నత చదువులు




చదువుకోవడానికి తోడ్పాటు, స్వయం ఉపాధి, చిన్న చిన్న వ్యాపారాలను, కుటీర పరిశ్రమలను పెట్టుకోవడానికి పి4 పథకం ఆర్థికంగా చేయూతనివ్వడమే దీని ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మద్దిగపు వెంకటరామిరెడ్డి, బండ్ల బ్రహ్మం, సచివాలయ సిబ్బంది శ్రీలక్ష్మి, పులుసు రఘురెడ్డి, చందు గౌడ్ సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## కొత్తపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది!

**మాచర్ల, జులై 23 ప్రభాతవార్త:** మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మాచర్ల మండల వ్యవసాయాధికారి డి.పాపకుమారి గ్రామ రైతులతో కలిసి పత్తి పంట పొలాలను పరిశీలించారు. పత్తి పంటల సాగులో గులాబీ రంగు పురుగు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను రైతులకు వివరించారు. సాగు చేస్తున్న రైతులు పంటల బీమా కట్టుకోవాలని సూచించారు. కౌలు రైతులు సంబంధిత



గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి, సీసీఆర్‌సీ కార్డులను పొందాలన్నారు. కొత్తపల్లి గ్రామంలో కంది మినికిట్ ఎల్ఆర్‌జీ-52 రకం విత్తనాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో మాచర్ల వ్యవసాయ విస్తరణాధికారి ఎం.మార్కండేయులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది జి.ప్రతాప్, బి.అంజినాయక్, ఎస్.వెంకటేశ్వర్లు, కొత్తపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన యువనేతలు

**మాచర్ల, జులై 23 ప్రభాతవార్త:** మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి గ్రామంలోని ఎస్సీ



కాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రాయనూతల మోషే పార్థీవదేహాన్ని ఎమ్మెల్యే తనయుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి, జూలకంటి అక్కిరెడ్డిలు సందర్శించి పూలమాల వేసి నివాలులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబానికి జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయాన్ని జూలకంటి గౌతమ్‌రెడ్డి అందజేశారు. అలాగే పూరేటి సుబ్బారావు సతీమణి అనారోగ్యంతో మరణించడంతో విషయం తెలుసుకొని వారిని పరామర్శించారు. ఆర్థికసాయం అంజేజేవారు. ఈ సందర్భంగా గౌతమ్‌రెడ్డి వెంట పార్టీ సీనియర్ నాయకులు జూలకంటి చిరంజీవిరెడ్డి, యువనాయకులు, అక్కిరెడ్డి, పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డా॥గోపిరెడ్డిని కలిసిన రాష్ట్ర కార్యదర్శులు

**నరసరావుపేట, జూలై 23 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా వైఎస్సార్‌సిపి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు



పడాల శివారెడ్డి, ఏనుముల మురళీధర్‌రెడ్డి కలిసారు. ఇటీవల తమనురాష్ట్ర కమిటిలోకి తీసుకోవటానికి సహకారం అందించినందుకు వారు కృతఘ్నతలు తెలిపారు.శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగాడాక్టర్ గోపిరెడ్డిని వారు సత్కారించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఏడు నియోజకవర్గాలలో తిరుగులేని విజయాలను నమోదు చేసే విధంగా క్షేత్రస్థాయి నుండి పార్టీ శ్రేణులను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. పార్టీ గెలుపే ధ్యేయంగా అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పదవులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు.

## అనాథ ఆశ్రమంలో వృద్ధులకు నూతన వస్త్రాలు, పండ్లు, బియ్యం పంపిణీ

**నరసరావుపేట, జూలై 23 ప్రభాతవార్త :** ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రోటరీక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో




బుధవారం వృద్ధులకు బియ్యం, నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మస్తాన్‌షరీఫ్, కార్యదర్శి కరీమ్ మొహిద్దీన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్.నజీమా పాల్గొని మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో సేవా భావాలు పెంపొందుతాయని, సమాజం పట్ల బాధ్యత ఏర్పడుతుందన్నారు. అనాథలుగా ఉండేవారికి తోడుగా ఉన్నామనే భరోసాను కల్పించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. రోటరీ సహకారంతో తమ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తారని షేక్.కరీమ్ మొహిద్దీన్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్.కె.జిలానీ మాలిక్, ప్రవీణ్, గంగాధర్ పాల్గొన్నారు.

## బిజెపి మజ్దూర్ సంఘ్ జెండా ఆవిష్కరణ

**నకరికల్లు, జూలై 23 ప్రభాతవార్త :** భారతదేశంలోనే భారతీయ మజ్దూర్ సంఘ్ బలమైన కార్మిక సంఘమని జిల్లా బిఎంఎస్ అధ్యక్షులు ఆర్.బంగారయ్య అన్నారు. 70 వసంతాలు మజ్దూర్ యూనియన్ పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయ ఆవరణలో సంఘం జెండాను ఆవిష్కరించారు. ఆంధ్రరాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షునిగా తనకు అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. దత్తోపంత్ టెంగ్డే చిత్రపటానికి, భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మికుల సంక్షేమం కోసం యూనియన్ పని చేస్తుందన్నారు. అన్ని ప్రభుత్వరంగ సంస్థలలో కార్మికులు, ఉద్యోగుల హక్కులను కాపాడేందుకు కృషి చేస్తామని బంగారయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, మట్టా ప్రసాద్, చౌడేశ్వరరావు, రామ్మూర్తి, మహానంది, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## దాసరిపాలెంలో సుపరిపాలనలో తొలి అడుగు

**రొంపిచర్ల, జూలై 23 ప్రభాతవార్త :** మండలంలోని దాసరిపాలెం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు బుధవారం పర్యటించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను తెలియజేశారు. ప్రజలకు సమర్థవంతంగా సంక్షేమ పథకాలను అందించడం ప్రజా ప్రతినిధుల బాధ్యతగా తెలిపారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాల వివరాలను తెలియజేస్తూ పంపిణీ చేశారు. నివాసితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తొలుత గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబుకు ఘనంగా స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యోగులు సేవా దృక్పధంతో పని చేయాలి

**కొల్లూరు, జులై 23 (ప్రభాతవార్త) :** ప్రభుత్వ ఉద్యోగులు సేవా ధృక్పదంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు వస్తుందని కొల్లూరు మండల పరిషత్ ఉపాధ్యక్షులు మురాల రాంబాబు అన్నారు. కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో కొల్లూరు సెక్టార్ ఐసిడియస్ సూపర్‌వైజర్‌గా నాలుగున్నర సంవత్సరాల పాటు విధులు నిర్వహించి బదిలీపై వెళ్ళిన విజయలక్ష్మి, నూతనంగా కొల్లూరు సెక్టార్ ఐసిడియస్ సూపర్‌వైజర్‌గా బాధ్యతలు తీసుకున్న రజనీలకు కొల్లూరు, అనంతవరం సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగ పాల్గొన్న వైస్ ఎంపీపీ రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు తమ బాధ్యతలను అంకిత భావంతో నిర్వహిస్తే ప్రజలలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తలు సూపర్‌వైజర్ విజయలక్ష్మిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై స్పందించాలన్నారు. కార్యకర్తలు ప్రజలతో మమేకమై కేంద్రాల నిర్వహణ పట్ల బాధ్యతగా పనిచేస్తూ ప్రజల మన్ననలను పొందాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నీరజ, ఆదిలక్ష్మి, నగరాజకుమారి, రాజ్యలక్ష్మి, వనజ, కాశీ విశాలాక్షి, పద్మ, బాలత్రిపుర సుందరి, వింధ్యారాణి, నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ పర్యటన

**నరసరావుపేట, జూలై 23 ప్రభాతవార్త :** నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు



బుధవారం పర్యటించారు. స్థానిక ఎన్జీవో కాలనీలో రూ.11 లక్షల నిధులతో నిర్మించే సి.సి.రోడ్డుకు శంఖుస్థాపన చేశారు. అనంతరం మున్సిపాల్టి స్వచ్ఛ సర్వేక్షణ్ -2025లో 1వ ర్యాంక్‌ను సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పురపాలక సంఘాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేయాలని, అన్నివర్గాల ప్రజలు ఇందుకు సహకారం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఈ సందర్భంగా కోరారు.

**జామియా మసీదు వద్ద మైనార్టీల కోసం లైబ్రరీ నిర్మాణం ...**

పురపాలక సంఘ కార్యాలయ సమీపంలో జామియా మసీదు వద్ద రూ.10 లక్షల ఎం.పి. నిధలతో నిర్మించే లైబ్రరీకి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు శ్రీకారం చుట్టారు. అభివృద్ధి పనులకు, మైనార్టీల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటామన్నారు. అదే విధంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎంతో చొరవ చూపారని తెలిపారు. మైనార్టీల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు.

## ప్రత్తిపాడులో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ

**ప్రత్తిపాడు,జులై 23,ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన బాబు షూరిటీ



మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఇన్చార్జి బాలసాని కిరణ్ కుమార్ హాజరయ్యారు.ముందుగా వైయస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం14 నెలలలో ఘోరంగా విఫలమైనదని,పథకాలు అందించడంలో అన్ని బూటకాలు మాటలు చెబుతుందని అన్నారు. రైతులను ఆదుకునే విషయంలో జగనన్న ఎప్పుడు ముందుండే వారని రైతు భరోసా సకాలంలో అందించి రైతులను ఆదుకున్నారని చంద్రబాబు వచ్చి14 నెలలు గడిచిన ఇంకా రైతులకు రైతు భరోసా అందించలేదన్నారు. జగనన్న పథకాన్ని కాపీ కొట్టి తల్లికి వందనం పేరుతో 35 లక్షల మంది తల్లులు ఖాతాలో డబ్బులు వేయకుండా మోసం చేశారని అన్నారు.సూపర్ సిక్స్ పథకాన్ని తుంగలో తొక్కారని ప్రజలు జగనన్న కన్నా ఇంకా ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని ఆశ చూపి ఓట్లు దండుకున్నారని మోసం ఎక్కువ కాలం ఉండదని మరల వైసీపీ ప్రభుత్వం వస్తుందని అన్నారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన వైసిపి కార్యకర్తలు అందరూ బాబు షూరిటీ మోసం గ్యారెంటీ పాంప్లెట్ ని ప్రతి గ్రామానికి వెళ్లి14 నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని వివరించి వైసీపీ ప్రభుత్వానికి కూటమి ప్రభుత్వానికి పథకాల్లో ఉన్న తేడాలని వివరించాలని బలసాని కిరణ్ కుమార్ కార్యకర్తలకు మరియు నాయకులకు తెలియజేశారు.

## ప్రజలకు అండగా సిపిఐ జెండా : జంగాల అజయ్

**ప్రత్తిపాడు జులై 23 (ప్రభాతవార్త) :** కార్మిక కర్షక ప్రజలకు అండగా సిపిఐ జెండా నిరంతర పోరాటాలతో అండగా ఉంటుందని జంగాల పేర్కొన్నారు.ప్రత్తిపాడు నియోజకవర్గ భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభ,ప్రత్తిపాడు కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం నందు ప్రతిపాడు



నియోజవర్గ సిపిఐ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ,ప్రజా వ్యతిరేక ప్రభుత్వల విధానాలను, అమలుపరిచే తీరను, ఎప్పటికప్పుడు ఎండ గడుతూ, ప్రజాపక్ష పార్టీగా సిపిఐ ఈ ప్రాంత ప్రజలకు అండగా ఉందని తెలిపారు.కేంద్రములో మోడీ ప్రభుత్వం అధికారం కోసం ఎన్నికల ముందు 400 రూపాయలుగా ఉన్న గ్యాస్ ధరలు తగ్గిస్తామని,స్విస్ బ్యాంకుల్లో ఉన్న బ్లాక్ మనీ నీ వెనక్కి తెప్పించి ఒక్కొక్క పేదవాడి ఖాతాలలో 15వేల రూపాయలు జమ చేస్తానని చెప్పి మోడీ అమిషాలు ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారు ఇచ్చిన హామీలనే అమలు చేయలేకపోవటం దుర్మార్గ చర్యగా దుయ్యబట్టారు.కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు పేదల కోసం తన సొంత భూమిని వేలాది ఎకరాలు పంచిపెట్టిన సిపిఐ పార్టీ మనది అని గుర్తు చేశారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గమును,నియోజవర్గ కార్యదర్శి రామిశెట్టి అదేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా సోమపల్లి అంజిబాబు,తన్నీరు ప్రభుదాసు,మండల కార్యదర్శిగా మామిడి అంకమ్మరావు, కోశాధి కారిగా గుంటుపల్లి రవిబాబు,కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ముందుగా సిపిఐ పార్టీ జెండాను అజయ్ ఆవిష్కరించగా అనంతరం జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించి వచ్చారు.ఈ కార్యక్రమంలో,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోడి రెక్క కోటి రత్నం, మహిళా అధ్యక్షురాలు పెనుబాక రమాదేవి, గోపిరెడ్డి నాగిరెడ్డి,మేడ తాతారావు,గొట్టం ప్రవీణ్ కాకర్ల జగదీష్,పి సాయి సిద్ధిరవి, పాల్గొన్నారు.

## మైకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ

**కొల్లిపర, జులై 23 (ప్రభాతవార్త) :** మండల పరిధిలోని శిరిపురంలో మైకా మినిస్ట్రీస్ వారి అబెండెంట్ హాస్పటల్‌లో బుధవారం బిషప్ డాక్టర్ పాముల ఐజయ్య 62వ జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఐవితో బాధపడుతున్న చిన్నారులకు, చర్మకార సోదరులకు నూతన వస్త్రాలను సమస్థ అధ్యక్షురాలు పాముల రవికుమారి, నాగార్జున యూనివర్శిటీ అంబేద్కర్



ఛైర్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జంగం శ్యామ్, డాక్టర్ అనూష, జైపాల్, కనపర్తి అనిల్, అక్కిదాసు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులు తప్పని సరిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలి

### -మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి

**కొల్లిపర, జులై 23, (ప్రభాతవార్త) :** కౌలు రైతులు తప్పని సరిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అన్నవరం, హనుమాన్‌పాలెం గ్రామాల్లో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ఖరీఫ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తగిన సూచనలు సలహాలు, ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవడం లన అనేక ఉపయోగాలు



ఉన్నాయన్నారు. ప్రతిరైతు తమ పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవడం వలన ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోతే పెట్టుబడి రాయితీ, పంటల భీమా, రుణాల వడ్డీ వంటి పథకాలకు అర్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జూలకల్లు,పందిటిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పిడుగురాళ్ల, జూలై 23 ప్రభాతవార్తః మండలంలోని జూలకల్లు, పందిటిపాలెం గ్రామాల్లో బుధవారం ఏవో ఎం సంధ్యారాణి ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం



నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సంధ్యారాణి మాట్లాడుతూ రైతులందరూ కేఎన్ఎం - 1638 అనే వరి రకం 120 నుంచి 125 రోజుల పంట ఎకరానికి 45 నుంచి 50 బస్తాలు అవుతుందన్నారు. తక్కువ కాల పరిమితి గల పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఈ రకం బీపీటీ 5204 కంటే మంచిరకం కేఎన్ఎం 1638 అనే రకం అగ్గి తెగులును తట్టుకుంటుందన్నారు. మానుగాయ రాదని, గాలులకు పడిపోదని, సన్న రకాలను మాత్రమే సాగు చేసుకుంటే మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉంటుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు స్వరూప, వంశీ, రైతులు పాల్గొన్నారు.

## అన్నమయ్య కళావేదికపై శుక్రవారం కవికోకిల గుర్రం జాషువా సాహిత్య సభ

**గుంటూరు కల్చరల్,జూలై 23,ప్రభాతవార్త :** స్థానిక రాజేంద్రనగర్ 2వ లైన్‌లో కళాస్రవంతి సాహితీ సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్ ఆధ్వర్యంలో జరిగిన ఒక సమావేశంలో శుక్రవారం అన్నమయ్య కళావేదికపై కవికోకిల గుర్రం జాషువా 54వ వర్ధంతి సందర్భంగా సాహిత్య సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాస్రవంతి సాహితీ సాంస్కృతిక సంస్థ రిజిస్టరైన సందర్భంగా పలు రంగాల్లో బహుముఖ ప్రతిభావంతులైన వారిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

# సుపరిపాలన తొలి అడుగులో పాల్గొన్న మంత్రి ఆనం,ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట టౌన్, జూలై 23 ప్రభాతవార్త : నరసరావుపేట పట్టణంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖామంత్రి ఆనం




రాంనారాయణరెడ్డి పాల్గొన్నారు. 27,28,29 వార్డులలో వారు పర్యటించి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మంచి ప్రభుత్వానికి, సమర్ధవంతమైన ముఖ్యమంత్రికి ప్రతి ఒక్కరూ తమ సంపూర్ణ మద్దతు తెలియజేయాలని, అండగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వం గడిచిన ఐదేళ్ళలో ప్రజలకు ఇచ్చిన ఏ హామీని అమలు చేయలేదన్నారు. అదే విధంగా ప్రజల సొమ్మును వైకాపా నాయకులు వేల కోట్లు దోచుకున్నారని తెలిపారు. గత కొన్ని వారాలుగా మద్యం కుంభకోణంలో వెలుగులోకి వస్తున్న అవినీతి, ఆ పార్టీ నాయకుల అరెస్ట్‌లు జరిగిన దోపిడిని తెలియజేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఆ పార్టీ హయాంలో ఎక్కడ స్థలాలు కనిపించినా అక్కడ దౌర్జన్యాలు, కబ్జాలు జరిగాయన్నారు. ప్రైవేట్ స్థలాలు సైతం దోచుకున్నారని తెలిపారు. చివరకు ల్యాండ్ యాక్ట్‌ను తీసుకువచ్చి ప్రజలను దగా చేశారన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ యాక్ట్ చట్టాన్ని రద్దు చేశారని మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి తెలియజేశారు. గడిచిన ఏడాది కాలంలో ప్రజలకు సుపరిపాలన అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీ మంచి పాలనపై బురద చల్లేందుకు ప్రజల వద్దకు వెళ్ళి అసత్యాలు చెప్తున్నారని విమర్శించారు. కూటమి పాలనపై మాట్లాడే అర్హత, హక్కు వైకాపాకు లేదని మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి అన్నారు.

# 24వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు

**సత్తెనపల్లి, జూలై 23 ప్రభాతవార్త :** పట్టణంలోని 24వ వార్డులో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ఇంటింటికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిలో సమస్యలను తెలుసుకొని వాటిని టిడిపి మైయాప్‌లో స్వయంగా నమోదు చేసి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధికారులకు ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా వెంట మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితిపై హైకోర్టు ధర్మాసనం వ్యాఖ్యల పై హర్షం : కేసన శంకరరావు

**మంగళగిరి, జులై 23, ప్రభాతవార్త:** ప్రభుత్వ వసతిగృహాలలో మౌలిక సదుపాయాల కల్పనపై పలుమార్లు గత ప్రభుత్వ హయాంలో విజ్ఞాపనల నిచ్చినా అరకొర సదుపాయాలే గాని,పూర్తి వసతులుఅన్ని హాస్టళ్ల లో ఏర్పాటు చేయడం లేదని,వీటి నిర్వహణ పర్యవేక్షణలపై హైకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలంటూ,ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.ఇక నుండైనా అవినీతికి తావులేని నిర్వహణ పర్యవేక్షణా పద్ధతులను అధికారులు అవలంబించాలని వారు



కోరారు. ఐదేళ్లకోసారి వచ్చే ప్రతి ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల కోసం వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నాయన్నారు. కానీ విద్యార్థులు పడుకోవడానికి కనీసం మంచాలుపరుపులు కూడా లేకుండా నేలపై పరుండ బెట్టడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వాలు కేటాయించే నిధులన్నీ అవినీతి అధికారులు గుత్తేదారులకు లబ్ధి చేకూర్చేందుకే పనులు చేపడుతున్నారా?..అంటూ ధర్మాసనం ప్రశ్నించాల్సి రావడం విచారకరమన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరన్నా తమ బిడ్డల్ని కటిక నేలపై పరుండ బెడతారా?.. అంటూ, అటువంటప్పుడు హాస్టళ్ల లో ఉండే నిమ్నకులపేద వర్గాల బిడ్డలను మంచాల పైనపరుపుల పైన పండుకొని, సుఖ నిద్రకు అవకాశం ఎందుకు కల్పించలేకపోతున్నారంటూ హైకోర్టు ప్రశ్నించాల్సి రావడం,ప్రభుత్వ వర్గాలకు చెంపపెట్టుగా భావిస్తున్నామన్నారు. బాలల హక్కుల రక్షణ జాతీయ కమిషన్(ఎన్సీపీసీఆర్) మార్గదర్శకాల ప్రకారం,ఇప్పటికైనా అన్ని ప్రభుత్వ హాస్టళ్ల లో కనీస మౌలిక సదుపాయాలు నాణ్యమైన ఆహారం,విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాధికారుల దేనన్నారు. వసతి గృహాల నిర్వహణసౌకర్యాల కల్పన విషయంలో నిరక్ష్యం తగదన్నారు. సంక్షేమ శాఖ అధికారులతో పాటు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కూడా జోక్యం చేసుకొని,పూర్తిస్థాయి పర్యవేక్షణలతో హాస్టళ్ళ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని కోరుకుంటున్నామన్నారు.ఆ విధంగా వసతి గృహాల్లో పరిస్థితుల మెరుగుదలకు కార్యాచరణ ప్రణాళికను హైకోర్టు ధర్మాసనం అఫిడవిట్ రూపంలో సి.ఎస్. విద్యానంద్ ను కోరడం సంతోషదాయక మన్నారు.ప్రతి జిల్లాలో సీనియర్ అధికారులతో అన్ని హాస్టళ్ళ తనిఖీలు చేయాలని,ఆ నివేదికలను తమ ముందు ఉంచాలని కోరిన ధర్మాసనానికి రాష్ట్ర బీసీ సమాజం తరఫున శంకరరావు ధన్యవాదాలు తెలియజేరు.

# ఘనంగా శ్రీ తేళ్ల కృష్ణమ చౌదరి జయంతి వేడుకలు

**పెదనందిపాడు జూలై 23 (ప్రభాతవార్త) :** పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ ఫౌండర్ తేళ్ల కృష్ణమ చౌదరి 121 వ జయంతి సందర్భముగా కళాశాల




పాలకవర్గంజాయింట్ సెక్రటరీ నర్రా బాల వెంకట కృష్ణ కళాశాల ఆవరణలోని వారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తేళ్ల కృష్ణమ చౌదరి పాలవర్రు గ్రామానికి చెందినవారు. వారు డిస్ట్రిక్ట్ జడ్జి గా పనిచేసి రిటైర్డ్ అయిన తరువాత పెదనందిపాడు మరియు పరిసర ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు కళాశాల స్థాపన అవసరమని గుర్తించి, దాతల సహకారంతో పెదనందిపాడు విద్యాభివృద్ధి సంఘం ద్వారా పి.ఎ.ఎస్ కళాశాల స్థాపన కొరకు విశేష కృషి చేసి.ది పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ కి ఫౌండర్ సెక్రటరీ కరస్పాండెంట్ గా సేవలందించారు. బుధవారం వారి121 జయంతి సందర్భముగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. వీర రాఘవయ్య , వైస్ ప్రిన్సిపాల్ కే. ప్రతాప్ కుమార్ , అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు మరియు కళాశాల విద్యార్థులు శ్రీ తేళ్ల కృష్ణమ చౌదరి గారి విగ్రహానికి పుష్పాలతో ఘనంగా నివాళులర్పించి వారి జయంతి వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భముగా కళాశాల పాలకవర్గ అధ్యక్షులు శ్రీ కాళహస్తి సత్యనారాయణ తదితర సభ్యులు. కృష్ణమ్మ చౌదరి సేవలను కొనియాడారు.

# 3వంతెనల వద్ద మురుగుకు చెక్

## గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

**గుంటూరు తూర్పు, జులై 23 (ప్రభాతవార్త) :** రూ.2కోట్లతో చేపట్టిన మూడు వంతెనల నుంచి మణిపురం బ్రిడ్జి అనుసంధానంగా పీకలవాగులో కలిసే డ్రెయిన్ నిర్మాణానికి సహకరించిన నెహ్రూనగర్ వాసులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. నాలుగు దశాబ్దాలుగా చినుకుపడితే మూడు వంతెనలతో పాటు నెహ్రూనగర్, మోతీలాల్‌నగర్ ప్రాంతాలు నీట మునిగిపోయేవి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నాం అని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. డ్రెయిన్ నిర్మాణానికి సంబంధించి నెహ్రూనగర్‌లో అడ్డుగా ఉన్న గృహ యజమానులను గురువారం కమీషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఎమ్మెల్యే నసీర్ వెళ్ళి కలిశారు. ఎన్నో ఏళ్ళుగా వర్షాకాలంలో ముంపు కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి వారికి వివరించారు. ఇళ్ళు కోల్పోతున్న వారికి డ్రైయిన్ ఆవశ్యత గురించి తెలియజేశారు. ప్రతి ఒక్కరికి పునరావాసం కల్పించి ప్రభుత్వ పరంగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఇళ్ళు కోల్పోతున్న వారు ఎమ్మెల్యే నసీర్ చెప్పిన మాటకు అంగీకరించారు. డ్రెయిన్ నిర్మాణానికి పూర్తిగా



సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో నాలుగు దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చేపబోతున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు వంతెనల వద్ద నీరు నిల్వ లేకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామన్నారు. నగర మేయర్ కోవెలమూడి నానితో కలిసి రైల్వే, మున్సిపల్ అధికారులను సమన్వయం చేసుకుంటూ డ్రెయిన నిర్మాణాన్ని వేగ వంతంగా పూర్తి చేస్తామని వెల్లడించారు.

# పేదరిక నిర్మూలన కోసమే పి4

**గుంటూరు తూర్పు, జులై 23 (ప్రభాతవార్త) :** రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న మొదటి పదిశాతం మంది అట్టడుగున ఉన్న 20శాతం కుటుంబాలను దత్తత తీసుకోవాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం దాతలు, ప్రజలు భాగస్వామ్యం (పీ4)కార్యక్రమాన్ని ప్రారంభించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అదనపు కమీషనర్, గుంటూరు పశ్చిమ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి చల్లా ఓబులేసులతో కలిసి నగరంలో హాస్పిటల్స్, విద్యా సంస్థల ప్రతినిధులతో పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వార్డు సభల ద్వారా నీడ్ అసెస్మెంట్ సర్వే వార్డ్ సచివాయాల వారీగా జరుగుతుందని సర్వే అనంతరం మార్గదర్శకులుగా బంగారు కుటుంబాల అవసరాలకు తగిన విధంగా దత్తత తీసుకోవచ్చన్నారు. నగరంలోని హాస్పిటల్స్, విద్యా సంస్థలు తమ సంస్థల వివరాలతో పీ4 వెబ్‌సైట్‌లో రిజిష్టర్ చేసుకోవాలని కోరారు. పి4 కార్యక్రమంలో బంగారు కుటుంబాలకు అవసర మైన స్వల్ప కాలిక, దీర్ఘకాలిక సహాయాలను మార్గదర్శులు అందించవచ్చన్నారు. సమాజంలో అసమానతలు తొలగించి అట్టడుగున ఉన్న కటుంబాల ఆర్థికాభివృద్ధి కోసం అమలు చేస్తున్న పీ 4కార్యక్రమంలో మార్గదర్శకులుగా ప్రతి ఒక్కరూ బాగస్వాములు కావాలన్నారు. ప్రతి కుటుంబానికి విద్యా, వైద్యం అతి ముఖ్యమైన అవసరమని అందు వలన వైద్యా, విద్యా సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. మార్గదర్శులు దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలకు కేవలం ఆర్థిక సహాయం అందించటమే కాకుండా వారు అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రోత్సహించటం, నైపుణ్యాల శిక్షను అందించవచ్చన్నారు. అనంతరం కమీషనర్ ఛాంబర్‌లో గుంటూరు క్రెడాయ్ ఛాప్టర్ ప్రతినిధులు కమీషనర్‌ని కలిసి పీ4లో భాగస్వాములు అవుతామని తెలిపారు. సమావేశంలో గుంటూరు ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓలు రామారావు, సోమశేఖర్, ఎస్ఎస్ సాంబయ్య, క్రెడాయ్ ఏపి ఛైర్మన్ ఆళ్ళ శివారెడ్డి, మామిడిరాము, వినోదరెడ్డి, రాజగోపాల్, హాస్పిటల్స్, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిన కమిషనర్

**గురజాల, జూలై 23 ప్రభాతవార్త:** మేజర్ గ్రామ పంచాయతీ గురజాల నగర పంచాయతీగా రూపుదిద్దుకుంది. నగర పంచాయతీకి తొలిసారిగా 2021లో ఎన్నికలు జరిగాయి. నాడు గ్రామ పంచాయతీకి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కాగా నేడు నగర పంచాయతీగా మారడంతో కమిషనర్ విధులు నిర్వహిస్తున్నారు. నేడు నగర పంచాయతీ కమిషనర్‌గా వైవిఎల్ శివన్నారాయణ రావు వ్యవహరిస్తున్నారు. కమిషనర్ బాధ్యతలు, విధులను ప్రజలకు వివరిస్తున్నారు. పారిశుధ్యం మెరుగుదల, తాగునీరు సరఫరాకు కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పాలక మండలి ప్రజల సహకారంతో కమిషనర్ ముందుకు వెళ్తున్నారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి మండల పరిషత్ కార్యాలయం సమీపంలో, లోతట్టు ప్రాంతాలలో నీరు నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన మండల పరిషత్ కార్యాలయం చర్యలు చేపట్టి శుభ్రపరిచారు. రానున్న రోజుల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా కార్యాలయం వద్ద కల్వర్టు నిర్మాణం, సైడు కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. అనుమతులు రాగానే నిర్మాణాలు చేపడతామని కమిషనర్ శివన్నారాయణ తెలిపారు.



# ఇరువర్గాల మధ్య దాడి..పలువురికి గాయాలు

సత్తెనపల్లి, జూలై 23 ప్రభాతవార్త : మండలంలోని రెంటపాళ్ళ గ్రామంలో ఇరువురు వ్యక్తులపై మంగళవారం రాత్రి దాడి జరిగింది. గొర్రెలు మేపుకునే విషయంలో రెండు వర్గాలకు మధ్య వివాదం చోటు చేసుకుంది. తీవ్ర గాయాలపాలైన వారిని బంధువులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం బధవారం ఉదయం పోలీసులకు బాధితులు సమాచారం అందించగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కొనసాగుతున్న వరద ఉధృతి

## అప్రమత్తమైన అధికారులు

**కొల్లిపర, జులై 23 (ప్రభాతవార్త) :** ప్రకాశం బ్యారేజీ నుంచి 20వేల క్యూసెక్కుల నీటిని కృష్ణానది దిగువకు విడుదల చేయడంతో గత రెండు రోజులుగా వరద ఉధృతి కొనసాగుతుంది. మండల యంత్రాంగం



అప్రమత్తయ్యారు. రేవుల్లోకి ఎవరూ వెళ్ళ వద్దని హెచ్చరికలు జారీ చేశారు. కొల్లిపర తహశీల్దార్ సిద్దార్ధ బుధవారం మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, పిడపర్రు, కొల్లిపర గ్రామాల్లోని రేవులను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు. పడవ నడిపే జాలర్లకు తగిన జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వరద ఉధృతి కారణంగా లంక గ్రామాలకు ప్రజలు పడవలపై వెళ్ళ వలసిన పరిస్థితి నెలకొంది.

# నోటీసు ఇచ్చిన గంటకే షాపును స్వాధీనం చేసుకున్నారు

**పెదకూరపాడు, జూలై 23 ప్రభాతవార్త :** లింగంగుంట్ల షాపు నెం.18లో సివిల్ సప్లయ్ అధికారులు తమ రేషన్‌కార్డుకు సంబంధించిన బియ్యంతో పాటు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి అందించే బియ్యం కూడా ఉన్నాయని డీలర్ నోటీసుకు సమాధానం తెలిపారు. అయితే తనిఖీలలో ఒక క్వింటా 25 కేజీల అదనంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. డీలర్ ఉదయ లక్ష్మి తాము వినియోగించే బియ్యం కూడా అందులో ఉన్నాయని చెప్పినా విచారణ సరిగా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటికి వచ్చి అధికారులు నోటీసులు గొడకు అంటించి వెళ్ళారన్నారు. తాము ఎలాంటి తప్పు చేయలేదని, రేషన్ బియ్యం సక్రమంగా ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. నోటీసు ఇచ్చిన గంటకే తాము లేని సమయంలో అధికారులు రేషన్ స్టాక్‌ను వేరొక షాపుకు తరలించి చర్యలు తీసుకున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ బలోపేతానికి సమగ్ర చర్యలు

**గుంటూరు విద్య,జూలై 23,ప్రభాతవార్త :** ఉమ్మడి గుంటూరు జిల్లాలోని స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ మరింత బలోపేత దిశగా ముందుకు తీసుకు వెళ్ళడానికి సమగ్ర చర్యలను చేపట్టినట్లు స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు.పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో ఏసుబాబు మాదిగ మాట్లాడారు.దళిత వాడల్లో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి వాటిని మండల కమిటీలకు అనుసంధానం చేయడం వలన ఇటు గ్రామస్థాయిలో అటు మండల స్థాయిలో పార్టీ మరింత బలోపేతం కావడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు.

# నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలి : నగర కమిషనర్

**గుంటూరు తూర్పు, జులై 23 (ప్రభాతవార్త) :** నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు తగిన డ్రైనేజి సిస్టం ఏర్పాటు చేసుకుని నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని, లేకుంటే మార్టిగేజ్ మంజూరు చేయబోమని నగరపాలక సంస్థ కమీషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం కమీషనర్ గోరంట్ల, గాయత్రీనగర్, ప్రాంతాల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి డ్రైనేజి కనెక్షన్ లేని వాటికి మార్టిగేజ్ మంజూరు నిలిపివేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ



అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘన చేస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. భవనాలు నిర్మాణ దశలోనే వార్డ్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, నిరంతరం పరిశీలిస్తూ, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టేకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రైన్ల ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భవనం నుండి మేజర్ డ్రైన్ వరకు డ్రైనేజి కనెక్షన్ వారు ఇచ్చుకోవాలని, లేని వాటికి మార్టిగేజ్ మంజూరు చేయడం నిలిపి వేస్తామని తెలిపారు. ప్రధానంగా సెట్‌బ్యాక్ పోర్షన్‌లో ఏ విధమైన నిర్మాణాలు చేయకూడని, జనరేటర్లు కూడా పెట్టడానికి వీలు లేదన్నారు. అపార్ట్‌మెంట్ నిర్వాహకులే డ్రైనేజిలైన్‌ను మేజర్ డ్రైన్ వరకు కనెక్ట్ చేసుకోవాలన్నారు. అనంతరం చౌడవరంలోని సిఆర్ కాలనీలో పర్యటించి, కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అంచనాలు సిద్ధం చేయాలని, ట్యాంకర్ల ద్వారా త్రాగునీటి సరఫరా చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఏసిపి రెహ్మాన్, ఎస్ఎస్ ఐజాక్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వర్షంలో ప్రతి అడుగు భద్రతకు ముందడుగు

## - మీ భద్రత మా బాధ్యత.. సిపి రాజశేఖర్‌బాబు వెల్లడి

**ఎ కొండూరు, జులై 23, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ (సిపి) రాజశేఖర్‌బాబు వర్షంలో ప్రతి అడుగు భద్రతకు ముందు అడుగు మీ భద్రత.. మా బాధ్యత అంటూ ఎన్‌టిఆర్ జిల్లా ప్రజలకు వివిధ వాహనదారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షంలో బైక్‌పై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించి స్పీడ్ తగ్గించాలని పిల్లలను నీరు ఉన్న ప్రదేశాల్లో నడవనీయవద్దని చెరువులు ప్రవహిస్తున్న నదుల వద్దకు పంపవద్దని రోడ్లపై కరెంట్ స్థంబాలను తాకవద్దని జాగ్రత్తగా ఉండండి సురక్షితంగా ఉండండని సిపి రాజశేఖర్ బాబు కోరుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా ప్రజలకు ఏ అపాయం ఎదురైనా వెంటనే డయల్ 112కి కాల్ చేయాలని ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ విజయవాడ సిపి రాజశేఖర్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఈ వర్షాకాలం అందరికి మంచిదే అయిన తగు జాగ్రత్తలు తీసుకుని పోలీసుల హెచ్చరికలను సూచనలను పాటించాలని సిపి రాజశేఖర్ బాబు కోరారు.

# అన్న క్యాంటీన్‌లో ఎటువంటి మరమ్మత్తులు ఉండరాదు : కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,జులై 23,ప్రభాతవార్త:** నగర పరిధిలోని అన్న క్యాంటీన్లలో ఎటువంటి మరమ్మత్తులు ఉండరాదని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం గాంధీజీ మహిళా కళాశాల వద్ద గల అన్న క్యాంటీన్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లో విజయవాడ నగరపాలక సంస్థ వారు కల్పించే సౌకర్యాల్లో ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదని,ఎక్కడ మరమ్మత్తులైన త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా చూసుకోవాలన్నారు. ప్రతి రోజు నోడల్ ఆఫీసర్లు తమ తమ అన్న క్యాంటీన్లను పరిశీలించి ఎటువంటి మరమ్మత్తులు లేకుండా చూసుకోవాలని,ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని,ఆహారంలో నాణ్యత,పారిశుధ్య నిర్వహణ ఖచ్చితంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు.

# నేడు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవం

**గుంటూరు విద్య,జూలై 23,ప్రభాతవార్త :** ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయం విశ్వవిద్యాలయం 57వ సా ్నతకోత్సవం గన్నవరంలోని ఆత్కూర్ స్వర్ణ భారతి ట్రస్ట్ నందు 24వ తేది ఉదయం 11గంటలకు



నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి తెలిపారు.విశ్వవిద్యాలయ పరిపాలన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీ దేవి మాట్లాడారు.కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ విశ్వవిద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ విచ్చేస్తున్నారన్నారు. కార్యక్రమం ఏర్పాట్లు మొత్తం కూడా పూర్తయ్యాయని పేర్కొన్నారు. అండర్ గ్రాడ్యుయేషన్,పోస్టు గ్రాడ్యుయేషన్,డిప్లొమా కోర్సుల్లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు ఈ స్నాతకోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథుల చేతుల మీదగా విద్యార్హత పట్టాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.ఉన్నత విద్యలో విద్యాపరమైన ప్రతిభ కనబరిచి వివిధ విభాగాల్లో అత్యధిక జిపిఏ సాధించిన 23మంది విద్యార్థులకు పురస్కారాలు గౌరవాలు దక్కనున్నాయని తెలిపారు.డాక్టర్ ఎం.వి.రెడ్డి,వి.రామచంద్రరావు పేరిట వ్యవసాయ పరిశోధనలో అత్యుత్తమ ప్రతిభకు రెండు జాతీయ అవార్డులు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.విలేకరుల సమావేశంలో వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# స్టడీ ఆఫ్ బ్యూటీపై ముఖాముఖి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై23, ప్రభాతవార్త:** వర్సిటీలోని ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ థియేటర్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థి కళాకారులకు ఆర్ట్ అప్రిసియేషన్, స్టడీ ఆఫ్ బ్యూటీ అనే అంశంపై ముకాముఖి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వర్సిటీలోని సంగీత, నృత్య, నాటకకళ విద్యార్థులు బాగస్వాముల య్యారు. ముఖ్య ప్రసంగీకులుగా పాల్గొన్న ప్రొఫెసర్ పిఆర్‌కె ప్రసాద్ కళ, వాటి ఉపయోగం,విలువలు, వివిధ రకాల లక్షణాలు గురించి వివరించారు. కళ యొక్కప్రాధాన్యతను గుర్తించడం చాలా ముఖ్యమ న్నారు. వివిధ రకాల మనస్తత్వాలకు పలు రకాల కళలు ఆయా సందర్భాలను బట్టి సన్నివేశాన్ని పండించడంతో పాటు భావాన్ని కలిగిసాతయన్నారు విద్యార్థి కళాకారులు వాటిపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు సైతం వారివారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. విభాగాధిపతి ఆచార్య ఎల్.వి.భూషణ్‌రావు మాట్లాడుతూ ప్రదర్శనలో పాత్రయొక్క లోతులను అంచనా వేసుకుని పాత్రలతో మాట్లాడటం పాత్రలు ఆశించిన విధంగా పాత్ర పోషణ ఉండాలన్నారు. ఇందులో సౌందర్య కళ చాలా ముఖ్యమన్నారు. ఆయా కళల ప్రదర్శనలో సహచర కళాకారులు చేసే విమర్శలు ఎదుగదలకు, భవిష్యత్‌కు తీర్చిదిద్దుకోవచ్చునన్నారు. ఈ కార్యమ్రకంలో సంగీత కళళ విభాగాధిపతి ఆచార్య మంజుల, నృత్య శాఖ అధ్యాపకుతు కాశయ్య, విశ్వనాథ్‌లు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడదాం

**కారంపూడి, జులై 23 ప్రభాతవార్త:** మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని మండల విద్యాశాఖ అధికారి టి.రవికుమార్ అన్నారు.



బుధవారం మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా శ్రీవెంకటేశ్వర ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. 300 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి మొక్కలు అందించి నాటించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విలియం శౌరిబాబు, కొండపల్లి అప్పారావు, పావులూరి కోటేశ్వరరావు, ట్రస్టు వ్యవస్థాపకులు హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెదేపా కార్యకర్తను పరామర్శించిన యువనేతలు

**విజయపురిసౌత్, జులై 23 ప్రభాతవార్త:** మాచర్ల మండలం అలుగురాజువల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త అవిశెట్టి శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయ పడ్డారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాలతో ఎమ్మెల్యే తన యుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి, టీడీపీ యువ నాయకుడు



జూలకంటి అక్కిరెడ్డి బుధవారం శ్రీను ఇంటికి వెళ్ళి పరామర్శించారు. అనంతరం యువనేతలు మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అండగా ఉంటారని బాధితునికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, మేకల వెంకటేశ్వర్లు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, తన్నీరు అంజి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాస శివరాత్రి పూజలు

**పెదనందిపాడు జులై 23 (ప్రభాతవార్త):** మాస శివరాత్రి సందర్భంగా పెదనందిపాడు శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి



దేవస్థానంలో బుధవారం స్వామివారికి ఉదయం నుండి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు. సహస్ర కుంకుమార్చన. లలిత సహస్రనామ పారాయణం. పరివార దేవత అర్చనలను భక్త సమాజం సహకారంతో. ఆలయ ప్రధాన అర్చకులు వడ్లమూడి చంద్రశేఖర శర్మ అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూనె రామకృష్ణ అనిత. చీమకుర్తి వెంకటరావు దుర్గారాణి. నున్న వేణు సురేఖ దంపత ఎలతో పాటు. కొత్త నాగలక్ష్మి. లక్ష్మీదేవి.ధనలక్ష్మి. నాగలక్ష్మి. తదితరులు పాల్గొన్నారు.

24-7Pg5.qxd:24-7Pg5.qxd 01/01/01 8:11 AM Page 1



# ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియ షురూ!

## లోక్‌సభ, రాజ్యసభ ఎలక్టోరల్ కాలేజి ఎంపీలతో సంప్రదింపులు

**న్యూఢిల్లీ,జూలై 23:** ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల ప్రక్రియను భారత ఎన్నికల సంఘం ప్రారంభించింది. అందులో భాగంగా లోక్‌సభ, రాజ్యసభలోని ఎలక్టోరల్ కాలజితో సంప్రదింపులుజరిపింది. రిటర్నింగ్‌ఆఫీసర్ల పేర్లను ఖరారు చేసేందుకు చర్యలుచేపట్టింది. ఈ మేరకు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ సోమవారం రాత్రి అనారోగ్య కారణాలతో రాజీనామాచేసిన సంగతి తెలిసిందే. అయితే ధన్‌ఖడ్ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సంతకంతో కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అనంతరం ఆ విషయాన్ని రాజ్యసభలో సభాధ్యక్ష స్థానంలో ఉన్న ఘన్‌శ్యాం తివారీ ప్రకటించారు. రాజ్యసభ ఎక్స్ అఫీషియో ఛైర్మన్‌గా ఉప రాష్ట్రపతి వ్యవహరిస్తారు.

ఇప్పుడు ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియను ఇసి మొదలుపెట్టింది. ఉభయసభల్లో అధికార, విపక్షాల బలబలాలు 2022లో బాధ్య తలు చేపట్టిన జగదీప్ ధన్‌ఖడ్ 2027 వరకు కొనసాగించాల్సి ఉంది. కానీ తన ఐదేళ్ల పదవీ కాలాన్ని మధ్యలోనే ముగించారు. ఆయన రాజీనామాతో భారత రాజ్యాంగ నిబంధనల ప్రకారం తక్షణమే ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంటుంది. ఉపరాష్ట్రపతి ఎన్నిక విధానం గురించి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 66 వివరిస్తుంది. ఎలక్టోరల్ కాలేజీ ద్వారా ఈ ఎన్నికలు జరుగుతాయి.

ఎలక్టోరల్ కాలేజీలో లోక్‌సభ, రాజ్యసభలకు ఎన్నికైన సభ్యులతోపాటు, నామినేటెడ్ సభ్యులు కూడా ఓటర్లుగా ఉంటారు. అయితే, ఎలక్టోరల్ కాలేజీలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విధాన సభల సభ్యులకు ఓటుహక్కు ఉండదు. ఉపరాష్ట్రపతిని ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు నైష్పత్తిక ప్రాతినిధ్య విధానంలో ఏక ఓటు బదిలీ విధానం ద్వారా రహస్య పద్ధతిలో పరోక్ష విధానంలో ఎన్నుకుంటారు.

కాగా, ఎలక్టోరల్ కాలేజీలో ఖాళీలు ఉన్నాయనే కారణంతో ఎన్నికను వాయిదా వేయడానికి ఉండదు. ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి 5 యేళ్లు పదవిలో ఉంటారు. పదవీ కాలపరిమితి పూర్తయిన ఉపరాష్ట్రపతి, కొత్తగా ఎన్నికైన ఉపరాష్ట్రపతి బాధ్యతలు స్వీకరించే వరకు పదవిలో ఉంటారు. ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేయడానికి అర్హతలను కూడానిర్దేశించింది. భారతీయ పౌరుడై ఉండాలి. 35 సంవత్సరాల వయసు నిండి ఉండాలి. రాజ్యసభకు ఎన్నిక అయ్యేందుకు అవసరమైన అర్హతలు ఉండాలి. కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల్లో ఆదాయం పొందే ప్రభుత్వ ఉద్యోగంలో ఉండకూడదు. ఒకవేళ ఉద్యోగి అయితే దానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. చట్టసభల్లో (పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ) సభ్యుడై ఉండకూడదు. ఒకవేళ చట్ట సభలో సభ్యుడైతే ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత ఆ చట్టసభ సభ్యత్వం కోల్పోతారు.

ఎన్నిక అనివార్యం అయితే పార్టీల బలాలిలా ఉన్నాయి. మొత్తం 782 ఎంపిలనుంచి ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవాలి. 542 లోక్‌సభ స్థానాలు, 240 రాజ్యసభ స్థానాల ఎంపిలు ఎన్నికలో పాల్గొంటారు. ఎన్డీయే బలం ప్రస్తుతం లోక్‌సభలో 293గా ఉంది. రాజ్యసభలో 134 మందివరకూ ఉన్నారు. వారిలో 10 మంది నామినేటెడ్ ఎంపిలు కూడా లేకపోలేదు. ఇక విపక్షం పరంగాచూస్తే 355 మందివరకూ ఉన్నారు. వీరు లోక్‌సభలో 249 మంది, రాజ్యసభలో 106 మందివరకూ ఉన్నారు. లోక్‌సభలో ఇతరులు 20 మంది, రాజ్యసభలో 30 మందివరకూ ఉన్నట్లు అంచనా. ఇపుడు వీరంతా కలిసి రాజ్యసభ ఛైర్మన్‌ను ఎన్నుకుం టారు. నిజానికి ఉపరాష్ట్రపతి అభ్యర్థే రాజ్యసభకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.



## జస్టిస్ వర్మ కేసువిచారణ నుంచి
# తప్పుకున్న సిజెఐ

**న్యూఢిల్లీ, జూలై 23:** ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ దాఖలు చేసిన పిటిషన్ విచారణ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వైదొలిగారు. ఇదే విషయాన్ని ఆయన బుధవారం వెల్లడిం టచారు. విచారణ కమిటీలో తాను ఉన్నందున దాన్ని వేరొక బెంచ్‌కు బదిలీ చేస్తామని పేర్కొన్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మ కేసుపై కొంతకాలంగా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. అయితే తన వాదన వినకుండానే చర్యలు తీసుకుంటున్నారని జస్టిస్ వర్మ ఇటీవల ఆరోపించారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కూడాచేశారు. ఆవిషయంపై రాజ్యాంగ సమస్యలను లేవనెత్తుతుండడం వల్ల తమ పిటిషన్‌ను వీలైనంత త్వరగా విచారించాలని జస్టిస్ వర్మ తరఫున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీంను కోరారు.

దీంతో ఆ పిటిషన్ విచారణ నుంచే జస్టిస్ బీఆర్ గవాయ్ వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. విచారణ కమిటీలో తాను కూడా సభ్యుడిగా ఉన్నందున ఈ కేసును విచారించబోనని సిజెఐ స్పష్టం చేశారు.

ఈ కేసు నుంచి జస్టిస్ బీఆర్ గవాయ్ వైదొలగడంతో ఈ కేసు విచారణకు ప్రత్యేక బెంచ్ ఏర్పాటుచేయడానికి సుప్రీంకోర్టు చర్యలు తీసుకుంటోంది. అయితే అదే కేసులో ఇటీవల న్యాయవాది మాథ్యూస్ నెడుంపర జస్టిస్ వర్మను ఏకవచనంతో సంబోధించడంపై జస్టిస్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యవసరంగా విచారణ జరపాలని మూడు పిటిషన్లు దాఖలు చేయడంపైనా ఆయన అసహనం వ్యక్తంచేశారు.

# అద్దె ఇంట్లో బోగస్ ఎంబసీ

## నకిలీ రాయబారి అరెస్ట్, కార్లు, నగదు, కీలకపత్రాలు స్వాధీనం

**లక్నో,జూలై 23:** ఒక వ్యక్తి ఏకంగా అద్దె ఇంట్లో నకిలీ రాయబార కార్యాలయం నిర్వహిస్తున్నాడు. లగ్జరీ, ఫ్యాన్సీ దౌత్యకార్లతో రాయబారిగా బిల్డప్ ఇచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు షాక్ అయ్యారు. చివరకు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీ శివారు ప్రాంతమైన ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఈ సంఘటన జరిగింది. హర్షవర్ధన్ జైన్ అనే వ్యక్తి విలాసవంతమైన రెండంతస్తుల భవనాన్ని అద్దెకు తీసుకున్నాడు. అమెరికా నేవీ అధికారి స్థాపించిన ఏదేశం గుర్తించని 'వెస్టార్కిటికా' రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేశాడు. తనను తాను రాయబారిగా అందరితో పరిచయం చేసుకున్నాడు. రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, ఇతర ప్రముఖులకు సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలువినియోగిస్తూ ఆదరణ పొందు తున్నాడు. కాగా, జూలై 22న ఉత్తర ప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్‌కు ఈ నకిలీ రాయబార కార్యాలయం గురించి తెలిసింది. దీంతో ఆ భవనంపై రైడ్ చేశారు. హర్షవర్ధన్ జైన్‌ను అరెస్ట్ చేశారు. నాలుగు లగ్జరీ కార్లు, 12 మైక్రోనేషన్ల దౌత్యపాస్‌పోర్టులు, విదేశాంగ మంత్రిత్వ శాఖ స్టాంపులున్న పత్రాలు, 34 దేశాల స్టాంపులు, రూ.44 లక్షల నగదు, విదేశీ కరెన్సీ, 18 దౌత్య నంబర్ ప్లేట్‌లను స్వాధీనం చేసుకున్నారు. హర్షవర్ధన్ జైన్‌పై పలుసెక్షన్లకింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు విదేశాల్లో పని పేరుతో జాబ్ రాకెట్టును హర్షవర్ధన్ జైన్ నడుపుతున్నాడని, మనీలాండరింగ్ నెట్‌వర్క్‌లోనూ భాగమని పోలీసులు ఆరోపించారు.

## జపాన్‌తో వాణిజ్య ఒప్పందం ఓకే..
### ఇకపై జపాన్ ఉత్పత్తులపై 15% సుంకం

**వాషింగ్టన్,జూలై 23:** జపాన్‌తో భారీ వాణిజ్య ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అలాగే జపాన్‌నుంచి అమెరికా దిగుమతిచేసుకునే వస్తువులపై 15శాతం సుంకాన్ని విధించనున్నట్లుపేర్కొన్నారు. ఈ వాణిజ్య ఒప్పందం ద్వారా అమెరికా 90శాతం లాభాలను పొందుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మేం ఇప్పుడే జపాన్‌తో భారీఒప్పందాన్ని పూర్తి చేశాం. నా సూచనల మేరకు అమెరికాలో జపాన్ 550 బిలియన్ల డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. దానివల్ల 90శాతం లాభాలను పొందుతుంది. అంతేకాకుండా అమెరికా తయారు చేసే కార్లు, బియ్యం వంటి ఉత్పత్తుల విషయంలో జపాన్ మార్కెట్‌ను మా సంస్థల కోసం తెరిచేఉంటుంది. ఇలాంటి ఒప్పందం ఎప్పుడూ జరగలేదని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఇటీవల ట్రంప్ రాసిన లేఖలో జపాన్ వస్తువులపై 25శాతం సుంకం విధించినున్నట్లు చెప్పారు. కానీ తాజాఒప్పందంలో 15శాతంగా సవరణ చేశారు.

## చైనా పౌరులకు భారత్ టూరిస్టు వీసా జారీ షురూ!

**బీజింగ్,జూలై 23:** కొవిడ్, గల్వాన్ సంఘర్షణల నేపథ్యంలో నిలిపివేసిన చైనీయులకు ఇచ్చే పర్యాటక వీసాలను భారత్ తిరిగి పునరుద్ధరిస్తోంది. ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపరుచుకునేలా ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఫలితంగా దాదాపు ఐదేళ్ల తర్వాత చైనీయులకు భారత్ టూరిస్టు వీసాల జారీ ప్రక్రియను పునః ప్రారంభిస్తున్నట్లు చైనాలోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది.

గురువారం నుంచి చైనా పౌరులకు టూరిస్టు వీసాలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించింది. 2025 జూలై 24 నుంచి చైనా పౌరులు భారత పర్యటక వీసాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం ముందుగా ఆన్‌లైన్‌లో వీసా అప్లికేషన్‌ను నింపి ప్రింట్ చేసుకోవాలి. ఆ తర్వాత వెబ్‌లింక్‌తో అపాయింట్‌మెంట్ బుక్ చేసి భారత్ వీసా అప్లికేషన్ కేంద్రానికి వెళ్లాలి. ఈ సమయంలో తప్పనిసరిగా వారి పాస్‌పోర్ట్, వీసా అప్లికేషన్ ఫారమ్, ఇతర పత్రాలు సమర్పించాలి.

## రికవరీ సొమ్ముతో పరారైన ఢిల్లీ ఎస్‌ఐలు!

**న్యూఢిల్లీ, జూలై 23:** ఢిల్లీ పోలీసు విభాగంలో సబ్‌ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న అంకుర్ మాలిక్, నేహ పునియా సైబర్ నేరగాళ్ల నుంచి రికవర్ చేసిన రూ. 2 కోట్ల సొమ్ముతో పరారయ్యారు. తీవ్ర గాలింపు అనంతరం ఇండోర్‌లో పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఆ ఘటన పోలీసు వర్గాల్లోనే కాకుండా, సాధారణ ప్రజల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. ఢిల్లీ సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా ఉన్న అంకుర్ మాలిక్ పలు సైబర్ కేసులను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించాడు. బాధితుల నుంచి రికవరీ చేసినడబ్బునువారికి అందించకుండా ఒక పక్కా పథకం ప్రకారంవ్యవహరించాడు. నకిలీ ఫిర్యాదుదారులపేరిట బ్యాంకు ఖాతాలుతెరిచి, ఈ ఖాతాలకు రూ. 2 కోట్లను మళ్లించాడు. ఆ తర్వాత తెలివిగా ఏడు రోజుల సెలవు తీసుకుని అదృశ్యమయ్యాడు. ఆశ్చర్యకరంగా, అదే సమయంలో అతని బ్యాచ్‌కు చెందిన మహిళా ఎస్సై నేహ పునియాకూడా కనిపించకుండా పోయింది. వీరి అదృశ్యంపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా షాకింగ్ వివరాలు బయటపడ్డాయి. 2021లో శిక్షణ సమయంలో వీరిద్దరి మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడిందని, అప్పటి నుంచే రికవరీ సొమ్ముతో పరారయ్యే పథకం రూపొందించుకున్నారని తేలింది.

## బలూచిస్థాన్‌లో పరువు హత్య!

**కరాచి, జూలై 23:** పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్‌లో ఒక మహిళ, ఆమె ప్రియుడు కులపెద్దలమండలి(జిర్గా) ఆదేశాల మేరకు దారుణ హత్యకు గురైన భయానక వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దేశం మొత్తం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ హృదయ విదారక ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు రేకెత్తించగా, బలూచిస్థాన్ పోలీసులు వేగంగా స్పందించి, ఆ మహిళ సోదరుడు, జిర్గా నాయకుడు సహా 13 మందిని అరెస్ట్ చేశారు. అనైతిక సంబంధం పేరిట మరణశిక్ష విధించారు. వైరల్ అయిన వీడియోలో బానో బీబీ, ఇహ్సానుల్లా అనే జంటను అనైతిక సంబంధం ఆరోపణతో ఒక ఎడారి ప్రాంతంలో కాల్చిచంపారు. ఈ హత్యలో బానో బీబీ సోదరుడుకూడా పాల్గొన్నట్లు తెలిసింది. జిర్గా నాయకుడు సర్దార్ షేర్బాజ్ సటక్‌జాయ్ ఈ హత్యకు ఆదేశించినట్లు పోలీసులు వెల్లడించారు. వీడియోలో బానో బీబీ ఖురాన్‌ను చేతిలో పట్టుకుని నాతో ఏడు అడుగులు నడవండి ఆ తర్వాత నన్ను కాల్చవచ్చుఅని బ్రాహ్వీ భాషలో చెప్పినట్లు కనిపిస్తుంది. ఆ వెంటనే, ఆమె, ఇహ్సానుల్లాను బహిరంగంగా, అత్యంత దగ్గరినుంచి కాల్చి చంపారు. ఈనెల 20న ఈవీడియో సామాజిక మాధ్యమాలకు ఎక్కడంతో పౌర హక్కుల కార్యకర్తలు, బలోచ్ గ్రూపుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ఈ ఘటన పాకిస్థాన్‌లో పరువు హత్యల సమస్య ఎంత తీవ్రంగా ఉందో మరోసారి ప్రపంచానికి చాటి చెప్పింది.

## అపాయింట్‌మెంట్ లేకుండానే
# రాష్ట్రపతి భవన్‌కు ధన్‌ఖడ్!



**న్యూఢిల్లీ, జూలై 23:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే ధన్‌ఖడ్ తన లేఖను సమర్పించేందుకు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లిన సమయంలో ఎలాంటి అపాయింట్‌మెంట్ లేదన్న వార్తలు వస్తున్నాయి. అలా ఆయన ఎందుకు చేశారన్నది గందరగోళంగా మారింది. కాగా, జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి సోమవారం రాత్రి రాజీనామా చేశారు. ఆరోగ్య సమస్యల నేపథ్యంలో వైద్యుల సూచన మేరకు రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. ఆ విషయం రాత్రి 9.25 గంటలకు వెల్లడించారు. అయితే తన రాజీనామా లేఖను మెయిల్ ద్వారా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపినట్లు తెలిసింది. కానీ తాజాగా ధన్‌ఖడ్ రాజీనామా వ్యవహారంలో ఆసక్తికర విషయం వెలుగు చూసింది. ధన్‌ఖడ్ నేరుగా రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి ముర్ముకు తన రాజీనామా లేఖను అందించినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో రాష్ట్రపతి భవన్‌కు చేరుకునేందుకు ఎలాంటి అపాయింట్‌మెంట్ తీసుకోలేదని ముమ్మరప్రచారం జరిగింది. ఉపరాష్ట్రపతి ఎటువంటి సమాచారం లేకుండా రాష్ట్రపతి భవన్‌కురావడంతో అక్కడిసిబ్బంది గందరగోళ పరిస్థితికి లోనయ్యారని తెలుస్తోంది. సాధారణంగా రాష్ట్రపతిని ఎవరు కలవాలనుకున్నా ముందుగానే కార్యక్రమం షెడ్యూల్ అయ్యిఉంటుంది. కానీ ఇప్పుడు ధన్‌ఖడ్ అకస్మాత్తుగా సోమవారం రాత్రి 9 గంటలకు రాష్ట్రపతిని కలవడానికి రావడంతో ఎడిసి సైనిక కార్యదర్శి ఆ విషయాన్ని అధికారులకు వెంటనే తెలియజేశారట. అనంతరం ముర్ముతో సమావేశం జరిగిన తర్వాత రాజీనామా లేఖను ధన్‌ఖడ్ సమర్పించారని తెలుస్తోంది. ఆ తర్వాతనే రాజీనామా విషయాన్ని ప్రకటించారని సమాచారం. కాగా, జగదీప్ ధన్‌ఖడ్ చేసిన రాజీనామాను ద్రౌపదీ ముర్ము మంగళవారం ఆమోదించారు. అనంతరం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సంతకంతో కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఆ విషయాన్ని రాజ్యసభలో సభాధ్యక్ష స్థానంలో ఉన్న తివారీ ప్రకటించారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజ్యసభ సమావేశం కాగానే హోంశాఖ నోటిఫికేషన్ గురించి సభ్యులకు ఘన్‌శ్యాం తివారీ వివరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఏ) కింద ధన్‌ఖడ్ చేసిన రాజీనామా వెంటనే అమల్లోకి వస్తుందని హోంశాఖ నోటిఫికేషన్ వెల్లడించిందని తెలిపారు.

# ట్రంప్ 25 సార్లు చెప్పినా మౌనం వీడని మోడీ!



## ఎఐసిసి నేత, ఎంపి రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ,జూలై 23:** భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణను కుదిర్చింది తానేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 25సార్లు చెప్పుకున్నారంటే, తెరవెనుక ఏదోజరిగిఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదర్చడానికి ట్రంప్ ఎవరని ఆయన ప్రశ్నించారు. అది ట్రంప్ చేయాల్సిన పని కానేకాదన్నారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా సమాధానం ఇవ్వలేదని మండిపడ్డారు. బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై విపక్షాలు చేస్తున్న డిమాండ్‌కు ప్రధాని అంగీకరించే అవకాశమే లేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకవేళ దీనిపై ప్రధాని మోడీ ప్రకటన చేయాల్సి వస్తే, ట్రంపే భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చారని చెప్పాల్సి వస్తుందని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని స్వయంగా చెప్పేందుకు మోడీ అంగీకరించరన్నారు. కానీ అదే నిజమని ఆయన పేర్కొన్నారు. ట్రంపే భారత్ పాక్‌లతో కాల్పుల విరమణ చేయించారని, ఈవిషయం యావత్ ప్రపంచానికి తెలుసన్నారు. ఇది కేవలం కాల్పుల విరమణకు సంబంధించిన అంశం కాదని, ఇంతకంటే పెద్ద సమస్యల గురించి తాము పార్లమెంటులో చర్చించాలని భావిస్తున్నామని రాహుల్ పేర్కొన్నారు.

రక్షణ రంగం, రక్షణ రంగ పరిశ్ర మలు, ఆపరేషన్ సిందూర్‌పై చర్చిస్తామని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం పరిస్థితేం బాగాలేదని యావత్ ప్రపంచానికి తెలుస న్నారు. ప్రధాని మోడీ విదేశీ పర్యటననుంచి తిరిగి రాగానే, ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటులో చర్చిస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను ఆపానని ట్రంప్ 25సార్లు చెప్పుకోగా, అది ఇంకా కొనసాగుతోందని మోడీ సర్కారు వాదిస్తోందని రాహుల్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌లో విజయం సాధించామని చెబుతూనే, దాన్ని ఇంకా కొనసాగిస్తున్నామని చెప్పడంలో అర్థం లేదని ఆయన విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ గురించి వివరించేందుకు భారత అఖిలపక్ష ఎంపీలతో కూడిన టీమ్‌లు ప్రపంచ దేశాల్లో పర్యటించిన అంశంపైనా రాహుల్ స్పందించారు. భారత విదేశాంగ విధానాన్ని మోడీ సర్కారు ధ్వంసం చేసిందని, అఖిలపక్ష ఎంపీల పర్యటనల వల్ల మన దేశాన్ని ఏ ఒక్కరూ సమర్థించలేదన్నారు.

# ఫెడ్ రిజర్వు అధ్యక్షుడిపై ట్రంప్ ధ్వజం



**వాషింగ్టన్,జూలై 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్‌పై మరోసారి ధ్వజమెత్తారు. పావెల్ ఒక మూర్ఖుడని కామెంట్ చేశారు. వడ్డీ రేట్లను చాలా ఎక్కువగా కొనసాగించారని.. ఆయనను ఎనిమిది నెలల్లో పదవి నుంచి తప్పించనున్నట్లు పేర్కొన్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు చాలా బలంగా ఉందన్నారు. అన్నిరంగాల్లో దూసుకెళ్తూ రికార్డులు సృష్టిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. పావెల్ కారణంగా జనం ఇళ్లు కొనలేకపోతున్నారని వడ్డీ రేట్లను చాలా ఎక్కువగా ఉండేలా చేస్తున్నాడని బహుశా రాజకీయ కారణాలతోనే అలా చేస్తుండవచ్చని ఆరోపించారు. వాస్తవానికి ట్రంప్ 3శాతం పాయింట్లు తక్కువగా ఉండాలని కోరుకుంటున్నారు. గతంలోనూ సెంట్రల్‌బ్యాంక్ ఛైర్మన్‌గా ఉన్న పావెల్‌ను తొలగిస్తామని పేర్కొన్నారు. అయితే, తాను పూర్తికాలం ఈ పదవిలో ఉంటానని అప్పటి వరకు వీడేది లేదని పావెల్ స్పష్టం చేశారు. ట్రంప్ ఆయనను ఎందుకు తొలగించాలనుకుంటున్నారో మాత్రం స్పష్టత ఇవ్వలేదు. కానీ, చాలాకాలంగా వడ్డీ రేట్లను తగ్గించడం లేదని ఆరోపిస్తూ వస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం పావెల్‌ను ట్రంప్ తొలగించాలన్న నిర్ణయం తీసుకుంటే కారణాలను చట్టబద్ధంగా వివరించాల్సి ఉంటుంది. తన ఆరోపణలను నిజమేనని నిరూపించేందుకు ఆధారాలను సైతం సమర్పించాల్సి ఉంటుంది.

ఈ ఏడాది వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచినందుకు ట్రంప్ ఫెడ్ ఛైర్మన్‌పై ఆగ్రహంతో ఉన్నారు. ట్రంప్ సుంకాల ఆందోళన మధ్య బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గురువారం ప్రధా వడ్డీ రేట్లతో పావుశాతం తగ్గించడంతో 4.25శాతానికి చేరింది. అయితే, యుఎస్ ఫెడరల్ రిజర్వ్ చివరిసారిగా గతేడాది డిసెంబర్‌లో వడ్డీ రేట్లను తగ్గించింది. అయితే, ఇటీవల ఫెడ్ ఛైర్మన్ వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించారు. ట్రంప్ ఆర్థిక విధానాలకు సంబంధించిన ప్రభావం, ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధిపై సుంకాల ప్రభావం స్పష్టంగా కనిపించే వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకూడదని నిర్ణయించినట్లు పలు నివేదికలు తెలిపాయి. రాజకీయ నేతల ఇష్టానుసారంగా వడ్డీ రేట్లను మార్చే కేంద్ర బ్యాంకుల కారణంగా దేశాల్లో ద్రవ్యోల్బణం పెరుగుదల, ఇతర ఆర్థిక సమస్యలుంటాయని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. నివేదికల ప్రకారం.. వడ్డీ రేట్ల విషయంలో జెరోమ్ పావెల్ నిర్ణయాలతో డొనాల్డ్ ట్రంప్ సంతోషంగా లేరని, దాంతో ఆయనను తొలగించాలని భావిస్తున్నారు. అయితే, ఫెడ్ ఛైర్మన్‌ను నేరుగా తొలగించే హక్కు అధ్యక్షుడికి లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

# సంక్షిప్తంగా..

## గువాహతిలో ఐఐటి విద్యార్థుల ఆందోళన

**గువాహతి, జూలై 23:** అస్సాంలో ఉన్న గౌహతి ఐఐటిలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఐఐటీ గౌహతి క్యాంపస్‌లో వందల సంఖ్యలో రీసర్చ్ స్కాలర్లు, ఎంటెక్ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. అత్యధిక స్థాయిలో ఫీజుల్ని పెంచినట్లు ఆరోపించారు. పీహెచ్‌డీ విద్యార్థులకు ఈ ఏడాదినుంచి ఫీజుపెంచేశారు. దీంతో పాటు బిటెక్, ఎంటెక్ కోర్సులు చదువు తున్న విద్యార్థులకుకూడా ఫీజుపెంచినట్లు తెలుస్తోంది. జూలై 17న విద్యార్థులు, మేనే జ్మెంట్ మధ్య చర్చలుజరిగాయి. ఆ చర్చల్లో ఫీజు పెంచడం లేదని అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈనెల 22వ తేదీన జూలై నవంబర్‌కు చెందిన సెమిస్టర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. అయితే ఫీజు చెల్లించకుండా సెమిస్టర్ రిజిస్ట్రేషన్ జరగదు. కానీ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఐఐటి స్పష్టమైన ప్రకటన చేయలేదు. సంబంధిత శాఖలకు వెళ్లిన రీసర్చ్ స్కాలర్ విద్యార్థులకు చేదు అనుభవం ఎదురైంది.

## ఆస్ట్రేలియాలో భారతీయుడిపై వర్ణ వివక్ష దాడి

**అడిలైడ్,జూలై 23:** ఆస్ట్రేలియాలో భారతీయుడిపై అటాక్ జరిగింది. 23 ఏళ్ల విద్యార్థి చరణ్‌ప్రీత్ సింగ్‌ను కొట్టారు. సెంట్రల్ అడిలైడ్‌లో ఆదాడి ఘటన చోటుచేసుకున్నది. వర్ణవివక్ష పేరుతో అటాక్ జరిగినట్లు తెలుస్తోంది.సిటీ లైట్ డిస్‌ప్లేను చూసేందుకు భార్యతో కలిసి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. జూలై 19వ తేదీన ఈ అటాక్ జరిగినట్లు తెలుస్తోంది. ప్రత్యక్ష సాక్షుల వీడియోప్రకారం అయిదుగురు వ్యక్తులు పదునైన ఆయుధాలతోవచ్చి దాడిచేశారు. ఎటువంటి వార్నింగ్ ఇవ్వకుండానే పంచ్‌లు విసిరారు. అటాక్ చేసి దుర్భాషలాడారు. రోడ్డుపై సింగ్ అపస్మారకస్థితిలో పడిపోయాడు. తీవ్ర గాయాలయ్యాయి. ఇండియన్ అని తిడుతూ.. వాళ్ల పంచ్‌లు విసిరినట్లు సింగ్ తెలిపాడు. దాడి చేస్తున్న దృశ్యాలను సింగ్ భార్య షూట్ చేసింది. కారు రిజిస్ట్రేషన్ నెంబర్‌ను వీడియో తీసింది. ఈ కేసును పోలీసులు విచారిస్తున్నారు.

## సాధారణ పౌరుడిలా పబ్లిక్‌ట్రామ్‌లో సౌదీ యువరాజు

**దుబాయి,జూలై 23:** కట్టుదిట్టమైన, శక్తివంతమైన భద్రతమధ్య ప్రయాణాలు సాగించే దుబాయి యువరాజు సాధారణ పౌరుడిలా పబ్లిక్‌ట్రామ్‌లోప్రయాణించారు. సహజంగా పాలకులు ఏదైనా ప్రాంత సందర్శనకు వెళ్లాలన్నా అధికారులు పది రోజులు ముందుగానే ఏర్పాట్లు చేస్తుంటారు. ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేస్తుంటారు. అయితే, దుబాయ్ పాలకుడు అందుకు విరుద్ధంగా పబ్లిక్ ట్రామ్‌లో ప్రయాణించిన స్థానికులను ఆశ్చర్యానికి గురిచేశారు. దుబాయ్ పాలకుడు షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తమ్ తాజాగా పబ్లిక్ ట్రామ్‌లో ప్రయాణించారు. ట్రామ్ స్టేషన్ సందర్శనకు వచ్చిన ఆయన అధికారులతో మాట్లాడారు. అనంతరం రద్దీగా ఉన్న ట్రామ్‌లో సామాన్యుడిగా ప్రయాణించారు. అందులో ఉన్న ప్రయాణికులు పాలకుడిని చూసి ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు.

## మినీ బస్సు, రవాణా ట్రక్కు ఢీ, 17 మంది మృతి

**హరారే,జూలై 23:** మినీ బస్సు, రవాణా ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో 17 మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. సమచారం అందుకున్న అధికారులు, వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. జింబాబ్వేలోని జోహన్నెస్‌బర్గ్ ఈ ఘోరప్రమాదం జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈశాన్య జింబాబ్వేలోని రాజధాని హారారేకు ఆగ్నేయంగా 25 కి.మీ దూరంలో చితుంగ్విజా సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రక్కు డ్రైవర్ నియంత్రణ కోల్పోయిన తర్వాత ట్రక్కు ఎదురుగా ఉన్న లేన్‌లోకి దూసుకెళ్లి ఢీకొట్టాడు. ఆ తర్వాత రోడ్డుపై నడుస్తున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొన్నట్లు పోలీస్ ప్రతినిధి పాల్ న్యాతి తెలిపారు. దీంతో కొంతమంది పాదచారులతో సహా 17 మంది బాధితులు ఘటనాస్థలిలోనే మరణించారని చెప్పారు. మినీబస్సులోని 17మంది ప్రయాణికుల్లో పదిహేనుమంది మరణించారని పేర్కొన్నారు.

## వైద్యుడి కోసం వచ్చి రిసెప్షనిస్టుపై దాడి

**ముంబయి,జూలై 23:** మహారాష్ట్రలోని ఆసుపత్రిలో ఒక వ్యక్తి వైద్యుడి కోసం వచ్చిన వ్యక్తి రిసెప్షనిస్టుపై దాడిచేసారు. అక్కడున్న రిసెప్షనిస్ట్ డాక్టర్ మీటింగ్‌లో ఉన్నారు కాసేపు వెయిట్ చేయండి అని అతనితో చెప్పింది. దీంతో ఆగ్రహించిన సదరు వ్యక్తి ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఆమె జుట్టు పట్టుకొని లాగి దుర్భాషలాడాడు. హాస్పిటల్ సిబ్బందితో సమాచారం అదుకున్న పోలీసులు ఈ కేసుపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా, భారత న్యాయ సంహితాలోని పలు సెక్షన్ల ప్రకారం మహిళలపై దాడి, అసభ్యకరమైన పదజాలం, మహిళ వినయాన్ని అవమానించడం వంటి అభియోగాలతో నిందితుడిపై కేసు నమోదు చేశామని ఒక పోలీసు అధికారి తెలిపారు.

# ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా ఐటి, డాటా సెంటర్లు, జిసిసిలపై దృష్టి: మంత్రి లోకేష్

**విశాఖపట్నం ప్రతినిధి, జూలై 23, ప్రభాత వార్త:** రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో విశాఖ మహానగర రూపురేఖలు మారబోతున్నాయి. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన 9వ ఎస్ఐపిబి (స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు) సమావేశంలో ఐటి రంగంలో 20,216కోట్ల పెట్టుబడులు, 50,600 ఉద్యోగాలు కల్పించే నాలుగు భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. గత ఏడాది కాలంలో మంత్రి లోకేష్ చేస్తున్న కృషితో విశాఖ ఐటి హబ్ గా రూపుదిద్దుకోనుంది. ఇటీవల మంత్రి లోకేష్ బెంగుళూరు పర్యటన సందర్భంగా 35వేల ఉద్యోగాలు కల్పించే రెండు ప్రముఖ సంస్థలతో ఒకేరోజు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆ రెండు సంస్థలకు తాజాగా జరిగిన ఎస్ఐపిబి సమావేశంలో పచ్చజెండా ఊపారు. ఆరోజున ఎంఓయులు కుదుర్చుకున్న సత్వ డెవలపర్స్ సంస్థ విశాఖ మధురవాడలో రూ.1500 కోట్ల పెట్టుబడులు, 25వేల ఉద్యోగాలు, ఎఎన్ఎస్ఆర్ సంస్థ రూ.1000కోట్ల గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జిసిసి)ని ఏర్పాటుచేయడం ద్వారా 10వేలమందికి ఉద్యోగావకాశాలు కల్పించ నుంది. అదేవిధంగా ఎస్ఐపిబి ఆమోదించిన మరో ప్రముఖ సంస్థ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్ విశాఖపట్నంలో డాటా సెంటర్ పై మొదటిదశలో రూ.1,466 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. దీనిద్వారా 200 మందికి ఉపాధి లభించనుంది. రెండవదశలో రూ.15,000 కోట్లు పెట్టుబడులు... 400 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఇదిలావుండగా విశాఖ ఎండాడలో బివిఎం ఎనర్జీ అండ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1250కోట్లతో వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఏర్పాటు చేయబోతోంది. తాజా ఎస్ఐపిబి సమావేశంలో ఆమోదం పొందిన ఈ సంస్థ ద్వారా 15వేలమందికి ఉద్యోగావకాశాలు లభించ నున్నాయి. ప్రఖ్యాత ఐటి సంస్థలైన టిసిఎస్ (12వేల ఉద్యోగాలు), కాగ్నిజెంట్ (రూ.1583కోట్ల పెట్టుబడి, 8వేల ఉద్యోగాలు) త్వరలో విశాఖ కేంద్రంగా తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. గత ఏడాది కాలంగా మంత్రి లోకేష్ అవిశ్రాంత కృషితో రాష్ట్రంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జిసిసి), డాటాసెంటర్ల పై లక్షలాది కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు, 95 ప్రముఖ సంస్థలు ముందుకు వచ్చాయి. గత ఏడాది నవంబర్ లో లోకేష్ చేసిన పెట్టుబడుల యాత్ర, జనవరిలో దావోస్ వేదికగా వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో యువనేత జరిపిన చర్చలు ఫలవంతమై రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. అయిదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని సాకారం చేసేందుకు... పెట్టుబడులు, ఉపాధి కల్పన సబ్ కమిటీ చైర్మన్ గా మంత్రి లోకేష్ చేస్తున్న ప్రయత్నాలు సాకారమవుతున్నాయి.



గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్లు క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి

# స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి వార్షిక రుణ ప్రణాళిక

## - మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయవాడ,జూలై 23,ప్రభాత వార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 7.69 లక్షల స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధి కోసం రూ.30,635 కోట్ల వార్షిక రుణ ప్రణాళికతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ముందుకు సాగుతుందని, రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాలు శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. దేశంలోనే ప్రతిష్టాత్మకంగా స్వయం సహాయక సంఘాలను అభివృద్ధి కోసం వెలుగు 2.0 ద్వారా ముందుకు సాగుతున్నామని . రాష్ట్రంలోని అన్ని జిల్లాల గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్లు క్షేత్రస్థాయి సిబ్బందితో రెండు రోజుల సమీక్ష. ప్రణాళిక ముగింపు సమావేశంలో మంత్రి పాల్గొని రానున్న ఏడాదిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి అవసరమైన ఆర్థిక సహాయం అందించేందుకు జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ప్రత్యేకంగా మహిళ ఆధ్వర్యంలో సంస్థల ఏర్పాటు కోసం దృష్టి పెట్టిందని, 2025- 26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 2.5 లక్షల మంది మహిళలకు ప్రత్యేకంగా వ్యక్తిగత స్థాయి నుండి వ్యక్తిగత రుణసౌకర్యాలు కల్పించి వస్తు తయారీ, సేవా రంగాలలో వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఆయన చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు వెలుగు 2.0 ద్వారా సమర్థవంతంగా ముందుకు సాగేందుకు సరైన ఆలోచనతో ముందుకు వచ్చేలా ప్రోత్సాహించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పీడీలు, డిపిఎంలు మరియు ఏపిఎంలు పనిచేసే జిల్లాలో వ్యవసాయ కార్యకలాపాలు విశ్లేషించి రైతులకు అధిక ఆదాయం ఇవ్వగల ప్రణాళికలను రూపకల్పన చేయాలని ఆయన సూచించారు. ఈ ఏడాదిలో 350 రైతు ఉత్పత్తి గ్రూపులకు రూ++ 98.1 కోట్ల మంజూరుచేయ్యాయని అని, ఆ నిధులను పారదర్శకంగా సమర్థవంతంగా వినియోగించి స్పష్టమైన ఫలితాలు సాధించాలని సూచించారు.

# అంతర్జాతీయ స్థాయికి ఆంధ్ర పర్యాటకం

## పక్కా ప్రణాళికతో టూరిజం టెండర్లు

**రాజంపేట, జూలై 22 ప్రభాతవార్త** ఆంధ్రలోని పర్యాటక అందాలను ప్రపంచానికి చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది .ఏపీ టూరిజం ఈ మేరకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. జాతీయ ,అంతర్జాతీయ స్థాయికి పర్యాటక ప్రాంతాలను తీసుకుపోయి పర్యాటక రంగాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. అందులో భాగంగానే జాతీయ స్థాయిలోను, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్ర అందాలను తెలిసేలా పెవిలియన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు టెండర్లను కూడా ఏపీ టూరిజం బుధవారం అథారిటీ పిలిచింది. ప్రస్తుతం ప్రపంచంలోనే టాప్ గా ఉన్న బ్యాంకాక్ లోనే ఆంధ్ర పర్యాటక పెవిలియన్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. బ్యాంకాక్ లో పర్యాటకులందరికీ పరిచయమైన క్యూఎస్ఎన్ సి సి కన్వెన్షన్ సెంటర్లో ఆగస్టు 26, 27 ,28 తేదీలలో ఖీ ఏపీ పెవిలియన్ ఖీ ఏర్పాటు చేయనుంది. బ్యాంకాక్ లో ఆంధ్ర అందాలను ప్రపంచానికి చాటేందుకు ఆగస్టు 11 టెండర్లకు చివరి గడువుగా నిర్ణయించారు. అలాగే జాతీయ అంతర్జాతీయ స్థాయి పర్యాటకులు వచ్చే దేశ రాజధాని ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్ లో కూడా ఖీ ఫెయిత్ కాన్క్లేవ్ ఖీ ను ఆగస్టు 12 13 తేదీల్లో ఏర్పాటు చేయనుంది.

# యోగాతో అద్భుత ఫలితాలు

## యోగాధ్యయన పరిషత్ పునరుద్ధరణ: సిఎం చంద్రబాబు

**విజయవాడ జూలై 23,ప్రభాతవార్తప్రతినిధి:** మెరుగైన వైద్య సేవలందించడమే కాదు... ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా ప్రణాళికాబద్దంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఈ మేరకు ప్రజల ఆహారపు అలవాట్లు మొదలుకుని... ఆర్గానిక్ ఉత్పత్తులు వినియోగించడం వరకు కార్యాచరణ అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. బుధవారం సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ పనితీరు.. టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ సేవలు, మెడికల్ కాలేజీల నిర్మాణం వంటి అంశాలపై సమీక్షలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... భవిష్యత్తులో వైద్య ఖర్చులనేవి ప్రజలకు భరించలేని ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉందని... ఈ భారం తగ్గేలా చేయాలంటే ఆరోగ్యం మీద ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు.. ఆహారపు అలవాట్లల్లో తీసుకురావాల్సిన మార్పుల పైనా ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న ఆహారపు అలవాట్లను కొనసాగిస్తే.. క్యాన్సర్ వంటి ప్రాణాంతక జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. పురుగు మందులు వినియోగించని ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలి. ఈ దిశగా రైతులు, ప్రజలను చైతన్యం చేయాలి. ఈ మేరకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేయాల్సి అని అన్నారు. అప్రమత్తత, ముందు జాగ్రత్త చర్యలతో అందరికీ ఆరోగ్యం అని సిఎం చంద్రబాబు అన్నారు. తగు జాగ్రత్తలతో వ్యాధుల నియంత్రణ చేపట్టాలని అన్నారు. ప్రజలపై వైద్య ఖర్చుల భారం తగ్గాలంటే ఆరోగ్య పరిరక్షణ అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని సిఎం అన్నారు. టాటా ట్రస్ట్ గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో చేపడుతున్న డిజిటల్ నెర్వ్ సెంటర్లు ప్రజారోగ్యంపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తాయి. ఇప్పటికే కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా టాటా డిజిటల్ నెర్వ్ సెంటరును ప్రారంభించాం. వచ్చే ఏడాది జనవరిలో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్లను ప్రారంభించబోతున్నాం.. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే ఏడాది చివరికి ప్రారంభించబోతున్నాం. దీని కోసం జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేసుకోవాలి. ఈ సెంటర్లను సమర్థవంతంగా నడపగలిగితే.. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చు. తక్కువ ఖర్చులో ఎక్కువ వైద్య సేవలు అందించే ఉద్దేశం తో డిజిటల్ నెర్వ్ సెంటర్లు పని చేస్తున్నాయి.

# రాష్ట్రాభివృద్ధికి కలసికట్టుగా ముందుకు సాగాలి

## - తిరుమలలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**తిరుమల,జూలై 23ప్రభాత వార్తప్రతి నిధి:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి కూటమిలోని అన్ని పార్టీలు కలసికట్టుగా ముందుకుసాగాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. రాష్ట్రవిభజన అనంతరం నష్ట పోయిన రాష్ట్రం ఇప్పుడిప్పుడే అభివృద్ధివైపు అడుగులేస్తోందని అన్నారు. రాష్ట్రాన్ని,రాష్ట్రప్రజలను ఆశీర్వదించి ,రాష్ట్రాన్ని అభివృద్ధి వైపునడిపే శక్తిని సిఎం చంద్రబాబునాయుడుకు ఇవ్వాలని శ్రీవారిని వేడుకున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ళలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని, అభివృద్ధిలో వెనుకబడిందని స్పీకర్ విమర్శించారు. రాష్ట్రంలోని 14వేల పంచాయతీల్లో అక్టోబర్ 2నాటికి సంపూర్ణ అభివృద్ధి జరగాలని ఆయన ఆకాంక్షించారు. అసెంబ్లీ స్పీకర్ హోదాలో అయ్యన్నపాత్రుడు బుధవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనసమయంలో కుటుంబసభ్యులతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ,అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం చేయించి రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్పీకర్‌కు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేషవస్త్రం బహుకరించారు.

# పంట వేయకపోయినా బీమాకు అవకాశం

**విజయవాడ,జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** పంట వేయకపోయినా బీమా చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని కూటమి ప్రభుత్వం రైతులకు కల్పించింది. బీమా చేశాక పంట సాగు చేసి ఆ వివరాలను ఈపంటలో తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఇంతవరకు పంట వేసిన తర్వాత బీమా చేయించుకునే వారు. వర్షాల్లేక చాలా మంది కర్షకులు నాట్లు వేయలేకపోతున్నారు. వీరంతా బీమాకు దూరమవుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం కర్షకులకు ప్రయోజనం చేకూరేలా పంట వేయకపోయినా ముందు బీమా చేయించుకుని ఆ తర్వాత పంట వేసుకునే వెసులుబాటు కల్పించింది. తద్వారా ఎక్కువ మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది. తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం పొందేలా ఫసల్ బీమా యోజన పథకాన్ని రూపొందించారు. ఈ పథకం కింద ఒక్కో జిల్లాలో ఒక్కో పంటకు బీమా చేసే అవకాశముంది.



# దుర్గమ్మకు నేడు ఆలయంలో ఆషాఢం సారె

ఇంద్రకీలాద్రి, జూలై 23, ప్రభాతవార్త దుర్గమ్మవారికి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఇఒ వికె శీనా నాయక్ నేతృత్వంలో గురువారం ఆషాడ మాసం సారె నందించనున్నారు. ఆషాడమాసం చివరిరోజు అమావాస్య నాడు ఈ సారెను సమర్పిస్తామని వైదిక పండితులు తెలిపారు. గురువారం నుండి చండీహోమం, విఘ్నేశ్వర, సరస్వతి, తదితర హోమాది క్రతువులు దేవస్థానంలో శ్రీకృష్ణ, రాద ల మూర్తులు వేంచేసియున్న ప్రాంతంలో నూతనంగా నిర్మాణమైన యాగశాలలో నిర్వహిస్తామని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. జగన్మాత దుర్గమ్మ వారికి బుధవారం భక్తబృందాలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆషాడం సారెను సమరి ్పంచారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ పలు ప్రాంతాలకు చెందిన బృందాలు తమ ఇంటి ఆడపడుచుగా భావించి దుర్గమ్మవారికి సారె సమర్పించారు. ఆషాడం సారె సమర్పించిన భక్తుల బృందాలకు దుర్గమ్మవారి దర్శనంఏర్పాటు చేసిన అధికారులు అన్నప్రసాదాలు అందించారు.

# విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులను కేంద్ర నిధులతో చేపట్టండి

## - అమరావతి పనుల పూర్తికి సహకరించాలి - కేంద్రమంత్రికి టిడిపి ఎంపీల వినతి

**విజయవాడ,జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు పట్టణ ప్రాజెక్టులపై తెలుగుదేశం పార్లమెంటు సభ్యులు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిశారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, టిడిపి పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత ్వంలో ఎంపీలంతా కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పట్టణ పేదల ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయడంలో ఉన్న సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని, అమరావతిలో వివిధ ప్రాజెక్టుల పూర్తికి సహకరించాలని, విజయవాడ, విశాఖపట్నాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులను కేంద్ర నిధులతనే చేపట్టాలని కోరారు. 'విజయవాడ, విశాఖపట్నం మెట్రోరైలు ప్రాజెక్టుకులకు కలిపి రూ.39,362 కోట్లు ఖర్చవుతుందని అంచనా. 2017 మెట్రో రైలు విధానం కింద దీనికి కేంద్రం 100% ఆర్థిక సాయం చేయాలి. జాతీయ రహదారి 16లో విశాఖపట్నంలో 20 కిలోమీటర్లు, విజయవాడలో 4.7 కి.మీ.మేర ఇంటిగ్రేటెడ్ డబుల్ డెకర్ ఫ్లై ఓవర్, మెట్రో కారిడార్ల నిర్మాణానికి అనుమతివ్వాలి. ఈ ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ, దానికయ్యే ఖర్చును ఎన్‌హెచ్‌ఏఐతో కలిసి పంచుకోవడంపై పట్టణాభివృద్ధిశాఖ నిర్ణయించాలి' అని కేంద్రమంత్రిని ఎంపీలు కోరారు. ఢిల్లీలో తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని మంత్రిని కోరారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద సీఆర్డీయే సమర్పించిన ప్రతిపాదనలకు త్వరగా ఆమోదం తెలిపాలని కేంద్రమంత్రిని ఎంపీలు కోరారు. హరిత రవాణా, పునరుత్పాదక ఇంధనం తదితర ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం లక్ష్యసాధనకు అనుగుణంగా ఉన్నందున కేంద్రం 25% ఆర్థిక సాయం చేయాలని కోరారు.

# అన్ని హంగులతో కూడినపార్కు షటిల్ కోర్టును ప్రారంభించిన మంత్రి నారాయణ




**నెల్లూరు, జులై 23, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు సిటీ నియోజకవర్గంలో పార్కుల పండుగ కొనసాగుతుంది. నగరంలోని తొమ్మిదో డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీలో 60 లక్షల రూపాయలతో ఆధునీకరించిన పార్కు, అదే విధంగా 13 డివిజన్లో 15 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి ప్రారంభించారు. ముందుగా డివిజన్‌కు విచ్చేసినటువంటి మంత్రి నారాయణకు స్థానిక మహిళలు మంగళహారతులతో పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అభివృద్ధి ప్రదాతకు జై అంటూ నినాదాలు చేపట్టారు. అన్ని హంగులతో పార్కులో ఆహ్లాదభరిత వాతావరణం కల్పించిన మంత్రికి స్థానిక చిన్నారులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి పిల్లలతో ఆటలాడించి షటిల్ సరదాగా ఆడి ఉత్సాహాన్ని నింపి చాక్లెట్లను పంచిపెట్టారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ షటిల్ కోర్టును, పార్కును ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. సిటీలో 56 స్థలాలను గుర్తించి పార్కులుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారని, పిల్లల కోలాహాలం చూస్తే ఆనందంగా ఉందన్నారు. పని చేసే ప్రభుత్వం ఎలా ఉంటుందో చూస్తున్నారని, విజయదశమి నుంచి సిటీలో రోడ్లను స్వీపింగ్ మిషన్‌లతో శుభ్రం చేస్తారని, రాష్ట్రంలో ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. ఆరు జిల్లాల్లో సాలిడ్ వెస్ట్ మెనేజ్‌మెంట్ ప్లాంట్‌లు ఏర్పాటు చేశామని, ఏపీని చెత్త రహిత రాష్ట్రంగా మారుస్తామన్నారు. డ్రైన్ల పనులు కూడా పూర్తి చేస్తామని, నెల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.165 కోట్లు మంజూరు చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. సాగునీటి కాలువల పనులు కూడా ప్రారంభిస్తామని దోమల రహితంగా నెల్లూరు నగరాన్ని తీర్చిదిద్దుతామన్నారు. మాది మాటల ప్రభుత్వం కాదని, ఇచ్చిన ప్రతి హామీని ఖచ్చితంగా నెరవేరుస్తామన్నారు.

# అత్తను చంపిన అల్లుడు

**నాయుడుపేట జూలై 23 ప్రభాతవార్త:** పథకం ప్రకారమే బోడెద్దుల వెంకయ్య అత్తను సగుటూరు చెంగమ్మను(45) హత్యచేసి ఆపై స్వర్ణముఖినదిలో పూడ్చిపెట్టిన సంఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం పండ్లూరు గ్రామానికి చెందిన బోడెద్దుల వెంకయ్య అయ్యప్పరెడ్డిపాళెం గ్రామానికి చెందిన సగుటూరు చెంగమ్మ కుమార్తెను వివాహం చేసుకొన్నాడు. అప్పటి నుండి గతకొంతకాలం వరకు సజావుగా సాగినవారి కాపురం మధ్యలో వెంకయ్య మద్యానికి బానిస కావడంతో భార్యభర్తల మధ్య తరచూ ఘర్షణ పడుతుండేవారు. విషయం తెలుసుకొన్న అత్త సగుటూరు చెంగమ్మ కుమార్తెను పుట్టింటికి అయ్యప్పరెడ్డిపాళెం తీసుకువెళ్ళింది. దీంతో అత్తమీద ద్వేషం పెంచుకొన్న వెంకయ్య మంగళవారం రాత్రి నాయుడుపేట నుండి ఇంటికి వెళుతున్న చెంగమ్మను మోటార్‌సైకిల్‌పై వెక్కించుకొని ఇంటికి తీసుకువెళ్తానని చెప్పి మార్గమధ్యలో తుమ్మూరు సమీపంలోని స్వర్ణముఖినది వద్దకు తీసుకువెళ్ళి అక్కడ సగుటూరు చెంగమ్మను బలవంతంగా హత్యచేసి స్వర్ణముఖినది పూడ్చిపెట్టి అక్కడ నుండి పరారయ్యాడు.

# పుంగనూరులో రూ.1.36 కోట్ల గోల్ మాల్ నిజమే :డిప్యూటీ సిఇఒ వెంకటనారాయణ

**పుంగనూరు, జులై 23, ప్రభాతవార్త** చిత్తూరు జిల్లా పుంగనూరు మండల పరిషత్ కార్యాలయంలో రెండేళ్ల క్రితం కోటి 36 లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేసిన మాట ముమ్మాటికీ వాస్తవమేనని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో వెంకటనారాయణ అన్నారు. జడ్పీ సీఈవో ఆదేశాల మేరకు ఆయన బుధవారం ఈ సంఘటనపై నిజనిర్ధారణ చేపట్టారు. సందర్భంగా ఆయన అప్పుడు ఇంచార్జ్ ఎంపీడీవోగా పనిచేసిన రాజేశ్వరి, రాజశేఖర్ రెడ్డిలను విచారించారు. అప్పట్లో తాత్కాలిక విధానంపై కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసిన సునీల్ కుమార్ ఈ నిధులు దుర్వినియోగదానికి పాల్పడ్డారని ఇందులో తమ ప్రమేయం లేదని వారు ఆయనకు వివరించినట్లు తెలిసింది. అయితే బాధ్యత రహితంగా కంప్యూటర్ ఆపరేటర్‌కు లాగిన్లు ఇచ్చి నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్రమైన తప్పిదంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. నిధులను దుర్వినియోగం చేసిన సునీల్‌పైన చర్యలు తీసుకునేందుకు ఇప్పటికే నివేదిక సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో మరోసారి ఈ సంఘటనపై నిజనిర్ధారణ రూఢీ చేసిన తర్వాత త్వరలోనే ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి తగిన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కథ ఈ కేసుకు సంబంధించి కోటి 36 లక్షల రూపాయలు చప్పట్లు కంప్యూటర్ ఆపరేటర్ సునీల్ కుమార్ సొంతానికి వాడుకున్నారని ఇష్ట ప్రకారంగా ఖర్చు చేశారని తెలుస్తోంది. అయితే మరో ఇద్దరు అధికారులు విచారణలో హాజరు కావాల్సిందిగా వారు అందుబాటులో లేకపోవడంతో వారిని కూడా మరోసారి విచారిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. క్రిమినల్ పోలీస్ కేసు నమోదు అయిన పక్షంలో నిందితులకు పెద్ద ఎత్తున జరిమానా లేదా శిక్షలు పడే అవకాశం ఉంది.

# అంగన్వాడీ కేంద్రాల్లో నవ చేతన, ఆధార్ శిల పుస్తకాలు

**విజయవాడ,జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వ సరికొత్త ఆలోచనతో నవ చేతన, ఆధార్ శిల పుస్తకాలు అంగన్వాడీ కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకొచ్చింది. పిల్లలను విజ్ఞాన వంతులను చేయడంలో తల్లి పాత్ర ముఖ్యమైంది. బిడ్డ గర్భంలో ఉన్నప్పటి నుంచే అమ్మ బిడ్డతో ఎన్నో అంశాలను పంచుకోవాలి. పసికందులుగా ఉన్నప్పుడే కబుర్లు చెప్పాలి. వారి సృజన వెలుగులోకి తీసుకుని రావాలి. ఈ విషయాలను వివరించే నవ చేతన, ఆధార్ శిలపుస్తకాల సహకారంతో గర్భిణీలు, బాలింతలు, ఐదేళ్ల వయస్సు పిల్లలకి ఉపయోగపడే అనేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఇవి చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదలకు, ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని స్త్రీశిశు సంక్షేమశాఖ వెల్లడించింది. అంగన్వాడీ కార్యకర్తలతో పాటు తల్లులు పిల్లలకు ఏయే విషయాలపై అవగాహన కల్పించాలి. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఈ పుస్తకాల్లో పొందిపరిచారు. బాల్యంలో పెంపొందించే అంశాలు మనిషికి చిరకాలం ఉంటాయని అనేక అధ్యయనాలు తేటతెల్లం చేశాయి. సమాజంలో బాధ్యత కలిగిన పౌరుడిగా ఒక వ్యక్తిని తీర్చిదిద్దేందుకు చిన్న వయస్సులో చెప్పిన విషయాలు ఎంతో దోహదం చేస్తాయి. చిన్నప్పటి నుంచి పిల్లలకు అనేక విషయాలు తెలియజేసేందుకు అంగన్వాడీలు చాలా ఉపయోగపడుతున్నాయి. అలాంటి అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లి గర్భంలో పిండంగా ఉండే బిడ్డల నుంచి 5 ఏళ్ల వయస్సు పూర్తయ్యే పిల్లల వరకు ఎంతో విజ్ఞానాన్ని పెంపొందిస్తారు.

# పోలీసులే గంజాయి అమ్మకందారులకు అండగా ఉంటున్నారు

## - ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

**విజయవాడ,జూలై 23,ప్రభాత వార్త ప్రతినిధి:** తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ ఒక బ్యాచ్‌నీ పెట్టుకొని గంజాయి అమ్మే, కొనే వారి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని అధికార పార్టీకి చెందిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆరోపణలు చేశారు. తిరువూరు స్టేషన్‌లో ఎస్ఐ ప్రైవేట్ పంచాయతీలు చేస్తూ అక్రమ వసూళ్లకి పాల్పడుతున్నాడని పూర్తి ఆధారాలు తాను చూపిస్తానని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. ఎస్ఐ సత్యనారాయణ ఒక వ్యక్తినీ గంజాయి అమ్ముతున్నాడని స్టేషన్‌కి పిలిపించారని.. మరో వ్యక్తి ద్వారా డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారు. ఎస్ఐకి బాధిత వ్యక్తి కుటుంబ సభ్యులు బంగారం తాకట్టు పెట్టి లక్షన్నర డబ్బులు ఎస్ఐ సత్యనారాయణకి ఇచ్చారని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు. తెలిపారు ఇద్దరు టీడీపీ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. అయితే ఈ గొడవలో చిల్లపల్లి రామకృష్ణ అనే టీడీపీ కార్యకర్తపై దాడికి అదే పార్టీకి చెందిన కందిమల్ల సాయి సుమిత్ , పానుగంటి వెంకట్, మరో నలుగురు వ్యక్తులు దాడికి యత్నించారు. తనపై దాడి నుంచి తప్పించుకునే యత్నంలో సాయి సుమిత్‌పై సీసాతో టీడీపీ కార్యకర్త చల్లపల్లి రామకృష్ణ గాయపరిచాడు.

# సెంట్రల్ జైల్‌లో ఉన్న ఎంపి మిథున్ రెడ్డిని పరామర్శించిన పుంగనూరు ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జూలై 23,ప్రభాతవార్త** ఏడాది కాలంలోనే చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద లిక్కర్ స్కాంకు తెరతీసిందని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న ఎంపీ మిథున్ రెడ్డిని కలిసి బుధవారం పరామర్శించారు. అనంతరం జైలు బయట మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చి, నిత్యం అవినీతి సొమ్ముతో జేబులు నింపుకోవడంలోనే చంద్రబాబు నిమగ్నమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైయస్ఆర్‌సీపీ శ్రేణులపై తప్పుడు కేసులతో జైళ్ళకు పంపాలనే లక్ష ్యంతోనే పనిచేస్తున్నాడని ధ్వజమెత్తారు. నేడు కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు చేస్తున్నది దేశంలోనే అతిపెద్ద లిక్కర్ స్కాం. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం అక్కడ ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలను తీసేసి, ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చారు. ఏపీలో వైయస్ఆర్‌సీపీ హయంలో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న మద్యం దుకాణాలను తీసేసి, ప్రభుత్వమే వాటిని నిర్వహించింది. వైయస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు సీఎం వైయస్ జగన్ ఏ డిస్టిలరీలకు తన పాలనలో కొత్తగా అనుమతులు ఇవ్వలేదు.

# విపిఆర్ కృషితో సాకారం కానున్న కార్మికుల కల: ఎంపి వేమిరెడ్డి

**నెల్లూరు, జూలై 23, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా పరిధిలో కార్మికుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా వారికి భరోసానిచ్చేలా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. నెల్లూరు జిల్లా కేంద్రంగా ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని గత ఏడాది కాలంగా కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయని, ఈఎస్ఐసి డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ సింగ్‌ను పలు దఫాలుగా ఎంపీ వేమిరెడ్డి కలిసారు. బుధవారం కేంద్రమంత్రిని మరోసారి కలిశారు. హాస్పిటల్, క్వార్టర్స్ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆరోగ్య బీమా.. కార్మికుల జీవితాలకు మరింత ధీమా

## - ఇఎస్ఐసి ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామారావు

**విజయవాడ.జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:** కార్మికుల సామాజిక ఆరోగ్య భద్రత లక్ష్యంగా నూతన స్ప్రీ ఆరోగ్య బీమా పథకంతో కార్మికుల జీవితాలకు ధీమా కల్పిస్తున్నామని ఈఎస్ఐసీ ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామారావు కోరారు. ఈ పథకాన్ని కర్మాగారాలు, సంస్థల యాజమాన్యాలు, ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛందంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం విజయవాడ, గుణదలలోని సంస్థ కార్యాలయంలో యజమానులు, ఉద్యోగుల రిజిస్ట్రేషన్ ప్రమోషన్ పథకం (ఎస్పీఆర్ఈఈ 2025) ప్రచార పోత్తాన్ని ఈఎస్ఐసీ ప్రాంతీయ డైరెక్టర్ ఎం.రామారావు.. అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక రాజ్య బీమా సంస్థ 196వ సమావేశంలో స్ప్రీ పథకానికి ఆమోదం లభించిందని, ఈ పథకాన్ని ఉపయోగించుకుంటూ కర్మాగారాలు, సంస్థలు స్వచ్ఛందంగా నమోదుకు ముందుకురావాలని సూచించారు. ఈ పథకం ద్వారా యజమాని ప్రకటించిన తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చెల్లుబాటయ్యేదిగా పరిగణించడం జరుగుతుందని, రిజిస్ట్రేషన్ ముందుకాలానికి ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేదా ప్రయోజనం వర్తించదన్నారు. రిజిస్ట్రేషన్ ముందు కాలానికి ఎలాంటి తనిఖీ లేదా గత రికార్డుల కోసం డిమాండ్ చేయడం జరగదన్నారు. జరిమానాల భయాన్ని తొలగించడంతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళీకృతం చేసినట్లు వివరించారు. ఈ పథకం రాకముందు నిర్దిష్ట సమయంలోపు నమోదు చేసుకోకపోతే చట్టపరమైన చర్యలు, పాత బకాయిల డిమాండ్ తలెత్తే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఈ స్ప్రీ పథకంతో ఆ అడ్డంకులు తొలగాయని, ఇప్పటివరకు నమోదుకాని కర్మాగారాలు, సంస్థలు తమ కార్మికులను ఈఎస్ఐ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ఈ పథకం వీలుకల్పిస్తోందని, త్వరితగతిన నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 69,632 కర్మాగారాలు, సంస్థలు నమోదయ్యాయని, దాదాపు 14 లక్షల మంది ఉద్యోగులు ఈ పథకం కింద ఉన్నారని ఎం.రామారావు వివరించారు. కార్యక్రమంలో ఐఎంఎస్ డైరెక్టర్ వి.ఆంజనేయులు, స్టేట్ మెడికల్ ఆఫీసర్ డా. ఆర్.ప్రదీప్ కుమార్, కర్మాగారాల డైరెక్టర్ డి.చంద్రశేఖరవర్మ, బాయిలర్స్ డైరెక్టర్ బి.ఉమామహేశ్వరరావు, ఈఎస్ఐసీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ నవనీత్ పాల్గొన్నారు.

# రేవంత్ పబ్లిక్ మోడ్ సిఎం

## కెసిఆర్ ఫ్లైట్ మోడ్ ప్రతిపక్షనేత: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



**హైదరాబాద్, జూలై23,ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్ల చట్టబద్ధం చేయడానికి ఢిల్లీకి వెళుతున్న ముఖ్య మంత్రిని ఎమ్మెల్సీ కవిత ఢిల్లీకి 49వ సారీ, 50వ సారీ అంటూ లెక్కలేస్తూ ఫ్లయిట్ మోడ్ సిఎం అని సంభోదించడం తగదని నిజానికి రేవంత్‌రెడ్డి పబ్లిక్ మోడ్ సిఎం అని, మీ తండ్రి మాత్రమే నాడు అధికారంలో ఉండి నేడు ప్రతి పక్షంలో ఉండి కూడా ఫ్లైట్‌మోడ్‌లో ఉంటూ ప్రజలకు దూరంగా ఉంటారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించారు. గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రిజర్వేషన్ ఆర్డినెన్స్ కేబినెట్ ఆమోదించి గవర్నర్‌కు పంపించి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న వేళ బిసిలకు సంబంధించిన42శాతం రిజర్వేషన్ 9వ షెడ్యూల్ లో పెట్టించేందుకు జాతీయస్థాయిలో మద్దతు కూడా గట్టి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్తుంటే 49వసారి, 50వ సారి ఢిల్లీ వెళుతున్నారని కవిత కామెంట్ చేయడం అణగారిన వర్గాలను అవమానం చేయడమే అని ఆయన అన్నారు. కల్వకుంట్ల కవిత కన్ఫ్యూజన్ లో ఉన్నారని సానుభూతి తెలిపారు. ఫ్లైట్ మోడ్ వ్యాఖ్యలు ప్రతిపక్షనేత మీద చేయబోయి పొరపాటున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీద చేసినట్టు ఉందని ఆమె కల్వకుంట్ల కవిత కాదు కన్ఫ్యూజన్ కవిత అని అన్నారు.

# సామాజిక న్యాయం కోసం భాగీదారీ సమ్మేళనం

**హైదరాబాద్,జూలై 23,ప్రభాతవార్త:** భాగీదారీ న్యాయ సమ్మేళనం విజయవంతం కోసం తెలంగాణ కాంగ్రెస్ నేతలు న్యూఢిల్లీలో చమటోడ్చుతున్నారు. టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ జిల్లా,రాష్ట్రస్థాయి ప్రతినిధులుగా నమోదు చేయించుకొని అత్యధిక సంఖ్యలో రాష్ట్రం నుంచి హాజరుకావడానికి వీలుగా అవకాశాలు కల్పించారు. శుక్రవారం ఉదయం పదిగంటలకు న్యూఢిల్లీ టాల్కటోరా ఇండోర్ స్టేడియంలో జరగబోయే సమ్మేళనానికి డెలిగేట్స్‌కు మాత్రమే ప్రవేశం ఉంటుంది. భారతదేశంలోని సుప్రీంకోర్టు న్యాయవస్థ,సివిల్‌సర్వీస్ మీడియా సంస్థలు కార్పొరేట్ రంగంలో ఒబిసి ప్రాతినిధ్యం కోసం బాగీదారీ న్యాయ సమ్మేళనం కాంగ్రెస్ అగ్రనేత సామాజిక న్యాయం కోసం పోరాటం చేసే యోధుడు రాహుల్‌గాంధీ సదస్సును నిర్వహిస్తున్నారు. మహాత్మాగాంధీ, జ్యోతి భాపూలే, నేతాజి బాబాసాహెబ్ అంబెద్కర్ కలలను సాకారం చేసేందుకు ఒబిసిలకు న్యాయమైన అవకాశాల కల్పనకు ఈ సదస్సు నిర్వహిస్తుండటంతో అనేక మంది వెను కబడిన తరగతుల నేతలు డెలిగేట్స్ తెలంగాణనుంచి నమోదు చేసుకొని వెళ్ళారు. చారిత్రాత్మక ఘట్టంకు ఒక కొత్త అధ్యయనం నాంది పలికే ఈ సమ్మేళనంకు ఆహ్వాన పత్రాలను ప్రముఖులకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు అందిస్తున్నారు. బుధవారం న్యూఢిల్లీలోని టాల్కటోరా ఇండోర్ స్టేడియం ఈనెల 25న కాంగ్రెస్ ఒబిసి విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న భగీదారి న్యాయ్ సమ్మేళన్ పాల్గొనాలని ఒబిసి సెల్ ఛైర్మన్ డాక్టర్ అనిల్ జైహింద్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్‌నేత, ఒబిసి ఎంపీలఫోరం మాజీ కన్వీనర్ వి.హనుమంతరావు ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్‌ను కలసి ఆహ్వానించినారు.



సెమినార్‌లో అభివాదం చేస్తున్న ఎంపిలు ఆర్.కృష్ణయ్య, బీదమస్తాన్‌రావు, మల్లు రవి, పాకాల సత్యనారాయణ, విహెచ్ తదితరులు

# జనాభా దామాషా ప్రకారం బిసి రిజర్వేషన్లు కల్పించాలి

## జాతీయ ఒబిసి సెమినార్‌లో అఖిలపక్ష ఎంపిల డిమాండ్

**హైదరాబాద్,జూలై 23,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా జనాభా దామాషా ప్రకారం బిసి రిజర్వేషన్లు పెంచడంతో పాటు, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని పలువురు అఖిలపక్ష ఎంపిలు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్లో ఆంధ్రప్రదేశ్ జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోను దుర్గా నరేష్ యాదవ్ అధ్యక్షతన, జాతీయ బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణల ఆధ్వర్యంలో జాతీయ సెమినార్ నిర్వహించడం జరిగింది. దీనికి ఐదుగురు ఎంపీలు ఆర్.కృష్ణయ్య కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి, బీదమస్తాన్ రావు తెలుగుదేశం రాజ్యసభ సభ్యులు, బిజెపిఎంపీ పాకాల సత్యనారాయణ,మాజీ ఎంపీ వి హనుమంతరావు బిపి మండల్ మనవడు సూరజ్ మండల్,విసి కరుణానిధి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఈసెమినార్‌కు దేశవ్యాప్తంగాఉన్న 36 బీసీ సంఘాలు, 28 బిసి కుల సంఘాలు 32 ఉద్యోగ సంఘాలతోపాటు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక తమిళనాడు, యూపీ ఢిల్లీ నుండి పలువురు ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు.

ఈసమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణు మాధవ్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నందగోపాల్, బోస్ శారద ,జగదీశ్వరరావు, మురళి,కృష్ణమాచారి, శ్రీనివాస్, వెంకటరమణ, రేణు, శరత్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్రకులాల పార్టీల ఆధిపత్యాన్ని ఎదిరించండి

## బిసి వ్యతిరేక పార్టీల నుంచి బయటకు రండి: టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్,జూలై 23,ప్రభాతవార్త:** అగ్ర కులాల పార్టీల ఆధిపత్యాన్ని ఎదిరించండి, కాంగ్రెస్ పార్టీతో జతకట్టండి అంటూ టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకనటలో పిలుపునిచ్చారు. బిసి వ్యతిరేక పార్టీలు అయిన బిఆర్ఎస్, బిజెపిల నుంచి రాజీనామాలు చేసి బయటకు రండి అంటూ ఆయన కోరారు. బిసిలకు వ్యతిరేక పార్టీలు బిజెపి బిఆర్ఎస్ లు అని ఆయన తెలిపారు.ఆర్డినెన్స్ కు రాష్ట్రంలో బిఆర్ఎస్ మోకాలడ్డు పెడుతోంది. బిల్లుకు కేంద్రంలో బిజెపి నసేమిరా అంటోందని అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లంటే బిజెపి రుచించడం లేదా అని ప్రశ్నించారు. రాజ్యంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చడం ఎలా అసాధ్యమవుతోందని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రతిపక్షపార్టీల ఎమ్మెల్యేలు ఎందుకు ఒప్పుకున్నారని నిలదీశారు. బిల్లు ఢిల్లీకి రాగానే ఎందుకు మాట మార్చుతున్నరని అనుమానం వ్యక్తంచేశారు. .కేంద్ర బిజెపి మాటలను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి నోటితో పలికస్తూ పలాయనం అయిందని ఎద్దేవా చేశారు.బిసిబిల్లు కోసం పార్లమెంట్ స్తంబింప చేస్తామని, ఒబిసి సదస్సుల్లో రాహూల్ బిసి గొంతుకై నిలువబోతున్నడని తెలిపారు.ఉన్న రిజర్వేషన్లను తగ్గించి, అసెంబ్లీలో వాకౌట్లు చేసిన చరిత్ర బిఆర్ఎస్‌దని ఆయన అన్నారు.

# బిసి హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

## బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్

### బిసి కమిషన్ ఛైర్మన్‌ను కలిసి వినతి పత్రం అందించిన బిజెపి నేతలు

**హైదరాబాద్, జూలై 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బిసి గురుకులాలో పరిస్థితలు దారుణంగా ఉన్నాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ అన్నారు. బుధవారం బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని గురుకులాలలో ఫుడ్ పాయిజన్ ఘటనలు, పాములు, తేళ్ల వంటి విషపు పురుగుల వల్ల మరణించిన ఘటనలతో పాటు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మరికొన్ని చోట్ల విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ విషయాలపై గతంలో కూడా మేము అనేకసార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించాం. కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని ఒత్తిడి చేశామన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు.ఈ సంవత్సరం ప్రారంభంలోనే మేము అధికారులను కలిసి మరోసారి విజ్ఞప్తి చేశాం. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే పరిస్థితి మళ్లీ ఏర్పడకూడదని చెప్పాం. కానీ ఈ 10 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ బిసి గురుకులాలలో దాదాపు 10మంది విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వారిలో ఏడుగురు ఇప్పటికే మృతి చెందగా, ఇద్దరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఒక విద్యార్థికి రెండు కాళ్లు, నడుము విరిగిపోయిన పరిస్థితి విషమంగా ఉంది. రాష్ట్రంలోని దాదాపు 70 బిసి గురుకులాలలో తగిన నీటి సౌకర్యం లేదని, వేలాది మంది విద్యార్థులు ఉన్న చోట్ల కనీస వసతులు లేవు అన్నారు. ఈ పరిస్థితులను బిసి కమిషన్ గమనించి, ప్రత్యక్షంగా పరిశీలించి, వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని మేము విజ్ఞప్తి చేశాం. ఈ విద్యార్థుల జీవితాలను కాపాడేందుకు బిసి కమిషన్ ముందుండి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తగిన చర్యలు తీసుకునేలా చూడాలని కోరామన్నారు. దీనికి బిసి కమిషన్ చైర్మన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# ఐదు గ్రామాలకు త్వరలో నక్షా మ్యాప్‌లు

## ఆ గ్రామాల్లో సర్వేమ్యాప్, భూధార్ అమలుకు యోచన: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బుధవారం సచివాలయంలో అధికారులతో కలిసి సమీక్షి నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,జులై 23,ప్రభాతవార్త:** దశాబ్దాలుగా రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలకు గాను ఐదు గ్రామాలలో ప్రయోగాత్మకంగా చేపట్టిన రీసర్వేను విజయవంతంగా పూర్తిచేశామని వీలైనంత త్వరితగతిన 5 గ్రామాల్లో సర్వే బౌండరీస్ యాక్ట్ ప్రకారం నక్షా మ్యాప్‌నకు తుదిరూపునిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో రీసర్వేపై సిఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి వి.లోకేష్ కుమార్, సర్వే ల్యాండ్‌సెటిల్‌మెంట్ కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిజాం కాలం నుంచి 413 గ్రామాలకు నక్షాలు లేవని గత ప్రభుత్వం పది సంవత్సరాలలో ఈ గ్రామాలను గాలికి వదిలేసిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్నలక్ష్యంతో ప్రయోగాత్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి ( కొత్తది) ,ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాల్లో డ్రోన్, ఏరియల్ మరియు ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ రోవర్ పద్ధతుల్లో సర్వే నిర్వహించామని తెలిపారు. నిబంధనల ప్రకారం భూ యజమానులకు నోటీసుల జారీ చేయడం, గ్రామ సభలు నిర్వహించి యజమానుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని ప్రతి ఒక్కరి భూములకు సర్వే హద్దులను ఖరారు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ 5 గ్రామాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వే నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజల మనోభావాలు, ఆలోచనలకు అనుగుణంగా వారు సంతృప్తి చెందే విధంగా నక్షామ్యాప్ ఉండాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వం ఏం చేసినా అంతిమంగా సామాన్య ప్రజలు, రైతుల సంతోషమే ప్రధానమన్నారు.భూములు అమ్మకం, కొనుగోలు సందర్భంలో హద్దులతో కూడిన సర్వే మ్యాప్ ను ఖచ్చితంగా జత పరచాలని అలాగే దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ నెంబర్ ఎలా ఉంటుందో భూములకు కూడా భూదార్ నెంబర్ కేటాయించాలని భూభారతి చట్టంలో స్పష్టం చేయడం జరిగిందని ఈ ఐదు గ్రామాలలో ఈ రెండు అంశాలను అమలు చేయాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ ఐదు గ్రామాలలో ఐదు గుంటలకు పైగా ఉన్నభూములకు కొత్తగా సర్వేనెంబర్లు ఇవ్వాలని, అలాగే రెవెన్యూ, ఫారెస్ట్, దేవాదాయ, వక్ఫ్ భూములు ఉంటే వాటి వివరాలను కూడా రికార్డులలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మీ,5 గ్రామాలకు చెందిన ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్లు, సర్వే నిర్వహించిన ఏజన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

### బిజెపిలో చేరిన మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ శాసనసభ నియోజవర్గం నాయకులు



**హైదరాబాద్, జూలై 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాబోయే రోజుల్లో నాయకలు, కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ శాసనసభ నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తుందని అన్నారు. యూపిఏ హయాంలో యూరియా కోసం రైతులు బారులు తీరిన క్యూలైన్లలో గొడవలు జరిగి, లాఠీచార్జీలు జరిగిన అనేక ఘటనలు చూశామని అన్నారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూరియా కొరత లేకుండా, ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. అయినా ఇటీవల బిజెపిని బద్నాం చేయడానికి కొన్ని శక్తులు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నాయని అన్నారు. రబీ సీజన్ కోసం తెలంగాణకు అవసరమైన యూరియా 9.5 లక్షల మెట్రిక్ టన్నులు అని, కేంద్రం సరఫరా చేసిన యూరియా 12.02 లక్షల మెట్రిక్ టన్నులు అన్నారు. ఇది అవసరానికి మించి 2.5 లక్షల టన్నుల అదనపు సరఫరా అన్నారు. అయినప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో కొన్ని ఫర్టిలైజర్ షాపుల ముందు రైతులు బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే అని అన్నారు. కేంద్రం పంపిన ఎరువులను రాష్ట్రంలోని కొంతమంది బ్లాక్ మార్కెట్‌కి మళ్లిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణం అన్నారు. కృత్రిమ కొరత, బ్లాక్ మార్కెట్, ఎరువుల డీలర్లపై సరైన మానిటరింగ్ లేకపోవడం, సరఫరా వ్యవస్థపై రాష్ట్ర వ్యవసాయ శాఖ నిరక్ష ్యం అని రాష్ట్ర ప్రభుత్వ పాలనాపరమైన వైఫల్యానికి నిదర్శనం అన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఎంత మేర అవసరమో అంత మేర యూరియా ఇవ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం అబద్ధాల ప్రచారంతో రైతుల్లో అపోహలు సృష్టిస్తుందన్నారు. మహబూబ్ నగర్ జిల్లాలోని మక్తల్ వంటి ప్రాంతం కాటన్ సీడ్ బౌల్‌గా పేరుగాంచిందని, అలాంటి ప్రాంతాల్లో కూడా కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఫర్టిలైజర్ షాపులతో కుమ్మక్కై బ్లాక్ మార్కెట్‌కు పాల్పడుతున్నారని అన్నారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో బిజెపి నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్ స్థాయి నుంచి జెడ్‌పిటిసి స్థాయివరకు సిద్ధంగా ఉండాలన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బిజెపి డిమాండ్ చేస్తుందన్నారు. అయినా దానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని బిజెపిపై కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. బిజెపిపై తప్పుడు ప్రచారం చేయడమే కాంగ్రెస్ నాయకుల ప్రధాన లక్ష ్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలో బిజెపికి మంచి వాతావరణం ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు మధ్య ఎలాంటి మనస్పర్థలు లేకుండా కలిసిమెలిసి పని చేసి బిజెపిని గెలిపించాలి. బిజెపి మనకు తల్లిలాంటి పార్టీ అన్నారు. అలాంటి పార్టీకి ఎవరూ కూడా ద్రోహం చేయరాదన్నారు. మహబూబ్ నగర్ ఎంపి స్థానంతో పాటు మున్సిపాలిటీలు, నారాయణపేట మున్సిపాలిటీ, మక్తల్ చైర్మన్ స్థాయిలలో బిజెపి విజయాలు సాధించిందన్నారు. రానున్న రోజుల్లో బిజెపి రాష్ట్రంలో మరింత బలమైన వాతావరణం ఉందని, అందుకే కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారంతో ప్రజలను మభ్యపెడుతుందన్నారు. గతంలో నేను ఎమ్మెల్సీగా రాష్ట్రవ్యాప్తంగా సేవలందించాను. ఆ సమయంలో మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజలు నాపై విశేష ఆదరణ చూపారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై కసరత్తు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రెండు రోజుల్లో ఐదు జిల్లాల్లో పర్యటనలు

**హైదరాబాద్, జూలై 23 ప్రభాతవార్త:** తెలంగాణ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా బిజెపి శ్రేణులను సమాయత్తం చేయడం లక్ష్యంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు జిల్లాల్లో పర్యటించనున్నారు. జూలై 26, 27 తేదీల్లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో విస్తృత పర్యటన నిర్వహించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటనలో రాష్ట్ర అధ్యక్షులు బిజెపి శ్రేణులతో కార్యకర్తల సమ్మేళనాలు నిర్వహించి, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు. ఈ పర్యటనలో మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణ, రాష్ట్ర నాయకులు, ఆయా జిల్లాల అధ్యక్షులు పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రజలతో ప్రత్యక్షంగా ముఖాముఖీ సమావేశాలు జరిపి, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, ఇబ్బందుల గురించి స్వయంగా అడిగి తెలుసుకోనున్నారు. పర్యటన షెడ్యూల్ జూలై 26వ తేదిన మహబూబ్ నగర్, నారాయణపేట జిల్లాలు, జూలై 27వ తేదిన గద్వాల, వనపర్తి, నాగరక ర్నూల్ జిల్లాల్లో పర్యటన కొనసాగనుందని బిజెపి తెలంగాణ రాష్ట్రప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య వారధిగా ఉంటా

## తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

**హైదరాబాద్ (నాంపల్లి), జూలై 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవిని స్వీకరించిన తర్వాత తొలి రాజకీయేతర సభలో పాల్గొన్న ఎన్.రామచందర్‌రావు బుధవారం సాయంత్రం ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఎఫ్‌టిసిసిఐ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ పరిశ్రమల సమస్యలను కేంద్రానికి చేరవేసే ఒక వారధిగా పనిచేస్తానని భరోసా నిచ్చారు. తెలంగాణలో సమగ్ర పారిశ్రామిక అభివృద్ధికి రోడ్‌మ్యాప్ అనే అంశంపై ఎంఎస్ఎంఈ రంగంపై దృష్టిపెడుతూ ఈ ఇంటరాక్టివ్ సమావేశం జరిగింది. బిజెపిని కార్పొరేట్‌లకు అనుకూల ప్రభుత్వమని అంటారు కానీ పరిశ్రమలు లేకుండా దేశాన్ని నడిపించగలమా అని ప్రశ్నించారు. చిన్నా పెద్దా పరిశ్రమలే ఉపాధి, ఆర్థికాభివృద్ధికి మూలస్తంభాలని, వీటివల్లే ఆదాయ వనరులు, ఉత్పత్తి, పన్నులు, సంపద పెరుగుతుందని పేర్కొన్నారు. విదేశాల్లో ఎన్ఆర్ఐలు ఎంతగొప్పగా ఎదుగుతున్నారో అదేస్థాయిలో భారతదేశంలో కూడా ఎదగాలంటే పాలసీలు మరింత అనుకూలంగా ఉండాల్సిన అవసరముందన్నారు. ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు ఆర్.రవికుమార్ పరిశ్రమలతో రాజకీయ పార్టీలకు నిరంతర సంభాషణ అవసరమన్నారు. ఎఫ్‌టిసిసిఐ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్ అభివృద్ధి హైదరాబాద్ చుట్టుపక్కల 5 జిల్లాలకే పరిమితమైందని, రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లా సంపన్న జిల్లాకాగా ఆదిలాబాద్ అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉన్న అసమానతలు ఉండకూడదన్నారు. స్థానికంగా ఉత్పత్తులను ప్రోత్సహించాలని, మహిళల ఉపాధి ఒక్కకెంకనుండి పెరగాలని, స్కిల్ డెవలప్‌మెంట్ పట్ల మళ్లీ పరిశీలన అవసరమని అభిప్రాయపడ్డారు. అనంతరం పరిశ్రమల ప్రతినిధులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.



# నిండుకుండలా శ్రీశైలం డ్యామ్

## రెండు గేట్ల ద్వారా సాగర్‌కు నీటి విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 23, ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాం జలకళను సంతరించుకున్నది. దీంతో రెండోసారి ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 39,746 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 36,975 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాంనుంచి 76,739క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. రెండు గేట్లు 10అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 883.70అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 208.2841 టీఎంసీలకు చేరింది. పవర్‌హౌజ్‌కు 66,827 క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

# ఎమ్మెల్యే పిఎ హరిబాబు అరెస్టు

## డబుల్ బెడ్ ఇళ్లు ఇప్పిస్తానని రూ.83 లక్షలు వసూలు



కుత్బుల్లాపూర్ ఎంఎల్ఎ పి.ఎ.బొమ్మిడిశెట్టి హరిబాబును అరెస్టు చేస్తున్న జీడిమెట్ల పోలీసులు

**కుత్బుల్లాపూర్, జూలై 23 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ వద్ద పి.ఎగా పనిచేసిన వ్యక్తి డబుల్‌బెడ్‌రూమ్‌లు మంజూరీ చేయిస్తామని చెబుతూ లంచావతారమెత్తి అడ్డంగా దొరికిపోయి కటకటాల పాలైన సంఘటన తీవ్ర వివాదాస్పదంగా మారింది. అయితే తమవద్ద పిఎగా పనిచేసి ఇలాంటి ఆరోపణలు వచ్చిన సంవత్సరం క్రితమే విధులనుండి తొలగించామంటూ ఏకంగా ఎంఎల్ఎ కె.పి.వివేకానంద్ మీడియాకు ప్రెస్‌నోట్ విడుదల చేయడం కొసమెరుపు. బాలానగర్ సహాయ పోలీసు కమిషనర్ నరేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కుత్బుల్లాపూర్ శాసన సభ్యులు కె.పి.వివేకానంద్ వద్ద పి.ఎ.గాపని చేస్తున్న బొమ్మిడిశెట్టి హారిబాబు కంప్యూటర్ ఆపరేటర్‌గానూ, పింఛన్లు, డబుల్‌బెడ్‌రూమ్‌ల దరఖాస్తులతోపాటు ఎంఎల్ఏకు వచ్చే వివిధ ఫిర్యాదులపై ఉన్నతాధికారులకు దరఖాస్తులను బట్వాడా చేస్తుంటాడు. అయితే గత సంవత్సరం తనవద్ద లక్ష రూపాయలు నగదు డబుల్‌బెడ్‌రూమ్‌లను మంజూరీ చేయిస్తానని గిరినగర్ సంక్షేమ సంఘానికి చెందిన తైలంరమేశ్ వద్ద వసూలు చేశాడు. డబుల్‌బెడ్‌రూమ్ తనకు ఎంతకూ మంజూరీ కాకపోవడంతో బాధితుడు పలుమార్లు వత్తిడితెచ్చినా ఫలితంలేకపోవడంతో జూలై 14న జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించాడు.

ఈమేరకు జీడిమెట్ల సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ గడ్డంమల్లేశ్ ఆధ్వర్యంలో కేసు నమోదుచేసుకుని విచారించగా సదరు ఫిర్యాదు దారుడినుండేకాక చాలమందివద్ద డబుల్‌బెడ్‌రూమ్‌లను ఇప్పిస్తామని చెప్పి వసూళ్లు చేశాడన్న ఆరోపణలు వచ్చాయి. దీనితో బాలానగర్ సమయ పోలీసు కమిషనర్ నరేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారణ జరపగా మొత్తం 84 మందివద్ద ఒక్కొక్కరివద్ద లక్ష రూపాలయ నుండి ఆపై మొత్తంలో వసూళ్లకు పాల్పడ్డట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. మొత్తం ఎనమిది మందివద్ద ఎంఎల్ఎ పి.ఎ. సుమారు లక్ష రూపాయల చొప్పున అందించినట్లు తెలిపారు. డబుల్‌బెడ్‌రూమ్‌ల పేరుతో వసూలు చేసిన రు.లు.84లక్షల వ్యయంతో కుత్బుల్లా పూర్ గ్రామ సమీపంలోని భూమ్‌రెడ్డినగర్‌లో ఇంటిని నిర్మిస్తున్నట్లు తమ విచారణలో తెలిసిందని బాలానగర్ ఎసిపి నరేశ్‌రెడ్డి వివరించారు.

# కొత్తగా నిజామాబాద్‌లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ

**హైదరాబాద్, జూలై 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించిన సర్కారు రాష్ట్రంలో మరో పామాయిల్ పరిశ్రమను ఏర్పాటు చేసేందకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే ఆరు ప్రాంతాల్లో ఈ పరిశ్రమల నిర్మాణాలు పురోగతిలో ఉండగా, కొత్తగా నిజామాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. చెరుకు సాగుకు చిరునామాగా ఉండే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు, మెదక్ జిల్లా రైతులను ఆయిల్ పామ్ సాగువైపు మళ్లించడమే లక్ష ్యంగా ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు ఇప్పటికే సిద్ధం చేసింది. దీన్ని తొలుత నిర్మల్ జిల్లాలో ఏర్పా టుచేయాలని ప్రతిపాదనలు రాగా, అక్కడ ఉద్యా నశాఖ అధికారులు సర్వే నిర్వహించారు.

# రాష్ట్రంలో మేలు రకాల చేపలపై పరిశోధనలు

**హైదరాబాద్, జూలై 23, ప్రభాతవార్త:** చేపల సాగులో పెట్టుబడులను తగ్గించి అధిక దిగుబడులను ఇచ్చే మేలురకం చేపల రకాలను అభివృద్ధి చేయడంపై శాస్త్రవేత్తలు దృష్టిసారించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని పాలేరు మత్స్య పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తక్కువ కాలంలో మేలైన దిగుబడి వచ్చే రకాలపై పరిశోధనలు చేస్తున్నారు. చెరువుల్లో పెంచుతున్న చేపలకు రోగాలు రావడం, వాటి ఎదుగుదలలో లోపం వంటి సమస్య లతో దిగుబడులు తగ్గి మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సమస్యను ఎదుర్కొనేం దుకు జన్యుపరంగా అభివృద్ధి చేసిన జీఐఐ కట్ల (బొచ్చు), జీఐఎఫ్‌టీ తిలాపియా, అమూర్ కామన్‌కార్ప్ (బంగారు తీగ), జయంతి రోహో (రవ్వ),జీఐఐ స్కాంపి ప్రత్యామ్నాయ జాతులైన రూప్‌చంద్, పెరల్ స్పాట్, మంచినీటి పండు గప్ప, రెట తిలాపియా రకాలపై పాలేరులో శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు జరుపుతున్నారు. ఈ చేపలు ఇక్కడి వాతావరణానికి తట్టుకుంటాయా లేదా వ్యాధి నిరోధకశక్తి, మేత విధానం, పోషకాలు, అధిక దిగుబడులు వంటి వివిధ రకాలపై పరిశోధనలు చేస్తున్నారు.

# టెస్టుల్లో సిక్సర్ల మోత

## భయపడుతున్న బౌలర్లు.. టాప్ 6లో రిషబ్ అగ్రస్థానం



**న్యూఢిల్లీ:** టెస్ట్ క్రికెట్ ను సైతం వన్డే, టీ20 క్రికెట్ లా ఆడేస్తూ సిక్సర్ల మోత మోగిస్తున్నారు. టెస్ట్ క్రికెట్ 2025 లో ఇప్పటివరకు పలువురు ప్లేయర్లు అద్భుతమైన ఆటతో సిక్సర్ల వర్షం కురిపిస్తున్నారు. టెస్టు క్రికెట్ ను టీ20ల ఆడుతూ బౌలర్లకు చెమటలు పట్టిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ ఏడాది టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన టాప్ 6 ఆటగాళ్ల జాబితాలో రిషబ్ పంత్ టాప్‌లో ఉన్నాడు. భారత వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ పంత్ ఈ సంవత్సరం టెస్ట్‌ల్లో ఇప్పటి వరకు 20 సిక్సర్లు బాదాడు. మరో రెండు సిక్సర్లు బాదితే అత్యధిక సిక్సర్లు బాదిన ప్లేయర్‌గా రికార్డు సృష్టించనున్నాడు. మంచి ఫామ్‌లోఉన్న అతడు ఇంగ్లాండ్‌తో మాంచెస్టర్‌లో జరిగే టెస్టులో ఈ రికార్డును బద్దలు కొట్టే ఛాన్స్ ఉంది. ఇంగ్లాండ్ ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ ఇప్పటి వరకు 12 సిక్సర్లు బాదాడు. ఇక ఇంగ్లాండ్ వికెట్ కీపర్‌బ్యాట్స్‌మన్ జేమీస్మిత్ అద్భుతంగా రాణిస్తున్నాడు. మంచి ఫామ్‌లో ఉన్న అతను టెస్ట్‌లో మెరుగైన ప్రదర్శనతో బౌండరీల మోత మోగిస్తున్నాడు. ఇప్పటి వరకు 11సిక్సర్లుబాది ఇంగ్లాండ్‌కు కీలక ఆటగాడిగా నిలిచాడు. భారత్ సిరీస్‌లో అతని కంటిన్యూ హిట్టింగ్ ఆ జట్టుకు బలంగా మారింది. వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్ షమర్ జోసెఫ్ ప్రధాన బౌలర్ అయినప్పటికీ బ్యాటింగ్‌చేసేఛాన్స్ వస్తే బౌండరీలతో అదరగొడతాడు. ఈ ఏడాది టెస్ట్‌లో 6 ఇన్నింగ్స్‌లలో 9 సిక్సర్లు బాదిన అతడు టెస్ట్ ఫార్మాట్‌లో రఫ్ హిట్టింగ్ సామర్థ్యాన్ని మరోసారి నిరూపించాడు. బౌలర్ అయివుండి బ్యాట్‌తోనూ రఫ్ఫాడిస్తున్నాడు. దక్షిణాఫ్రికా యువ క్రికెటర్ సంచలనం లువాన్ డ్రేప్రిటోరియస్ అద్భుతమైన ఆటను ప్రదర్శిస్తున్నాడు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు కేవలం మూడు టెస్ట్ ఇన్నింగ్స్‌ల్లోనే 7 సిక్సర్లు బాదాడు. జింబాబ్వేతో జరిగిన డెబ్యూట్ మ్యాచ్‌లోనే సెంచరీ కొట్టి సంచలనం రేపాడు. ఇంగ్లాండ్ బ్యాట్స్‌మన్ హ్యారీ బ్రూక్ ఈ ఏడాది టెస్ట్‌ల్లో ఇప్పటి వరకు 7 సిక్సర్లు బాదాడు. ఇండియాతో జరిగిన రెండోటెస్ట్‌లో సెంచరీకొట్టాడు. అతని బ్యాటింగ్ శైలి, పెద్ద షాట్లు ఆడుతూ తడబడకుండా పరుగులు రాబట్టడంతో గుర్తింపు పొందాడు.

# రెండో టి20లోనూ వెస్టిండీస్‌కు పరాభవం

## 8 వికెట్లు తేడాతో ఆస్ట్రేలియా జయభేరి



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో రెండో టీ20 మ్యాచ్‌లోనూ వెస్టిండీస్‌కు పరాభవమే ఎదురైంది. జమైకా వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టుపై ఆస్ట్రేలియా 8 వికెట్లు తేడాతో జయభేరి మోగించింది. నబీనా పార్కు మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిసిన ఆస్ట్రేలియా తొలుత వెస్టిండీస్‌ను బ్యాటింగ్‌కు అహ్వానించింది. ఓపెనర్లలో బ్రాండన్ కింగ్ హాఫ్ సెంచరీ (36 బంతుల్లో 51) రాణించగా, కెప్టెన్ షాయీ హోప్ (9)తో పాటు, వన్‌డౌన్ బ్యాటర్ షిమ్రన్ హెట్‌మెయిర్ (14) ఫెలయ్యాడు. రోస్టన్ ఛేజ్ (16), రోవ్‌మన్ పావెల్ (12), షెర్ఫానే రూథర్‌ఫర్డ్ (0) కూడా పూర్తిగా విఫమయ్యారు. ఈ పరిస్థితుల్లో విధ్వంసకర వీరుడు ఆండ్రీ రసెల్ సునామీ ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. కేవలం 15 బంతుల్లోనే 2 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 36 పరుగులు సాధించాడు. అలాగే గుడకేశ్ మోటీ 18 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. ఫలితంగా నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యే సరికి వెస్టిండీస్ 8 వికెట్లు నష్టానికి 172 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆడం జంపా 3 వికెట్లు, నాథన్ ఎల్లిస్, గ్లెన్ మాక్స్‌వెల్ 2 చొప్పున, డ్వార్షుయిస్ ఒక వికెట్లు పడగొట్టారు. ఇక లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియాకు ఆరంభంలోనే షాక్‌లు తగిలాయి. జేసన్ హోల్డర్ బౌలింగ్‌లో మాక్సీ (12), అల్జారీ జోసెఫ్ బౌలింగ్‌లో కెప్టెన్ మిచెల్ మార్ష్ (21) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు. ఓపెనర్ల వైఫల్యం నేపథ్యంలో ఇన్నింగ్స్ చక్కదిద్దే బాధ్యత తీసుకున్న వికెట్ కీపర్ బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 33 బంతుల్లో 7 ఫక్షర్లు, 5 సిక్సర్ల సాయంతో 78 పరుగులు చేశాడు. ఈ వన్‌డౌన్ బ్యాటర్‌కు తోడుగా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ కూడా 32 బంతుల్లో 56 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. వీరిద్దరి మెరుపు అజేయ అర్ధ శాతకాల కారణంగా ఆస్ట్రేలియా 15.2 ఓవర్లలోనే కేవలం 2 వికెట్లు కోల్పోయి 173 పరుగులు చేసింది. తద్వారా విండీస్‌ను 8 వికెట్లు తేడాతో చితుతన చేసి 2-0తో ఆధిక్యం పెంచుకుంది.



# చైనా ఓపెన్‌లో పివి సింధు గెలుపు

## డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ విజయం

**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్-2025 టోర్నమెంట్‌లో భారత్ ప్లేయర్ పివి సింధు ఆరోసీడ్ టొమోకా మియాజాకిని ఓడించింది. అలాగే మిక్సిడ్ ఈవెంట్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం విజయం సాధించింది. బుధవారం చైనాలోని చాంగ్‌జౌలో జరిగిన 2025 చైనా ఓపెన్ సూపర్ 1000 ఈవెంట్‌లో భారతదేశానికి చెందిన సింధు, పురుషుల డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి రెండో రౌండ్‌కు చేరుకున్నారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌చిరాగ్ జంట జపాన్‌కు చెందిన ఆరో సీడ్ యువ సంచలనం టోమోకా మియాజాకిని ఓడించగా, పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌చిరాగ్ జపాన్ జంట కెన్యా-ఒకాముద్వయాన్ని ఓడించింది. సింధు టాప్10 ర్యాంక్ ఉన్న క్రీడాకారిణిపై తన తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. 61 నిమిషాల్లో మియాజాకిని 21-15, 8-21, 21-17 తేడాతో ఓడించింది. ఆట మధ్యలో విరామం తర్వాత 8 పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించి, తొలి గేమ్‌ను సింధు తన ఆధిక్యంలో ఉంచుకుంది. అయితే, రెండవ గేమ్‌లో మియాజాకి అద్భుతమైన పునరాగమనం చేసింది. సింధును సింగిల్ డిజిట్‌కే పరిమితం చేసి ఆమె జోరుకు అడ్డుకట్ట వేసింది. నిర్ణయాత్మక గేమ్‌లో, సింధు తన ప్రతిభను ప్రదర్శించింది, చివరి ముగింపు మార్పులో 11-2 తేడాతో భారీ ఆధిక్యాన్ని సాధించింది. యువ క్రీడాకారిణి నుండి పాయింట్లు ఆలస్యంగా పెరిగినప్పటికీ మ్యాచ్‌ను ముగించడానికి ఆమెకు ఇది సరిపోయింది. మరోపక్క పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జపాన్ ద్వయం కెన్యా మిత్సుహాషి-హిరోకి ఒకామురాపై (21-13, 21-9) సులభంగా విజయం సాధించారు. ఈ మాజీ ప్రపంచ నంబర్ వన్ జోడీ ప్రారంభం నుండే ర్యాలీలను నియంత్రించింది. ప్రత్యర్థులను ఓడించి, రెండు ఆటలలో కేవలం 22 పాయింట్లు మాత్రమే ఇచ్చింది. ఇది వారి మధ్య జరిగిన మూడవ పోటీగా నిలిచింది. జపాన్ ద్వయం ఇప్పటికీ భారత జంటపై గెలవలేకపోయింది.



# మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో పైపైకి దీప్తి

## పడిపోయిన హర్మన్, స్మృతి అగ్రస్థానం పదిలం







**న్యూఢిల్లీ:** ఐసిసి మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఐదు స్థానాలు దిగజారగా, దీప్తి శర్మ 10 స్థానాలు ఎగబాకి 23వ స్థానానికి చేరుకుంది. ఈ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్, భారత్ మధ్య జరిగిన అత్యుత్తమ ప్రదర్శనల ప్రభావం చూపింది. తొలి వన్డేలో అజేయంగా 62 పరుగులు చేసిన దీప్తి బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అతిపెద్ద కదలికదారులలో ఒకరిగా నిలిచింది, హర్మన్‌ప్రీత్ మొదటి రెండు ఓడిఐలలో వరుసగా 17,7 పరుగులతో పేలవమైన ఫామ్ ఫలితంగా బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 21వ స్థానానికి పడిపోయింది. ఇక స్మృతి మంధాన మొదటి రెండు మ్యాచ్‌ల్లో వరుసగా 28, 42 స్కోర్లు నమోదు చేసి, 727 రేటింగ్‌ను కొనసాగించడంతో ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. ఇక తొలి వన్డేలో 83 పరుగులు చేసి ఇంగ్లాండ్‌ను బలమైన స్కోరుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించిన సోఫియా డంక్లీ 24 స్థానాలు ఎగబాకి 52వ స్థానానికి చేరుకుంది. 53 పరుగులతో ఘన విజయాన్ని సాధించిన ఆలిస్ డేవిడ్సన్ రిచర్డ్స్ 40 స్థానాలు ఎగబాకి 118వ స్థానానికి చేరుకుంది. కాగా బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో వరల్డ్ నంబర్ 1 సోఫీ ఎక్లెస్టోన్ ఈ సిరీస్‌లో ఇప్పటివరకు 4 వికెట్లతో అగ్రస్థానంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకుంది. ఆస్ట్రేలియన్ ద్వయం ఆష్లీ గార్డనర్ (724), మేగాన్ స్కట్ (696) కంటే ఆమె ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది, వారు మొదటి మూడు స్థానాల్లో ఉన్నారు. చార్లీ డీన్ (ఇంగ్లాండ్), స్నేహ్ రాణా (భారత్) చెరో 3 వికెట్లు పడగొట్టారు. దీంతో డీన్ 9వ స్థానానికి, రానా 12 స్థానాలు ఎగబాకి 21వ స్థానానికి చేరుకుంది. మహిళల ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లోనూ డీన్ పురోగతి సాధించి, ఎల్లీస్ పెర్రీ (ఆస్ట్రేలియా)తో కలిసి 14వ స్థానానికి చేరుకుంది.



# మహిళల ప్రపంచ కప్ సెమీస్‌కు దివ్య

## హారిక అనూహ్య ఓటమి

**న్యూఢిల్లీ:** ఫిడే మహిళల ప్రపంచ కప్ క్వార్టర్ ఫైనల్స్‌లో గ్రాండ్‌మాస్టర్ హరికా ద్రోణవల్లిపై ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. దివ్య రాపిడ్ టైబ్రేక్ (15+10 ఫార్మాట్)లోని రెండు గేమ్‌లను గెలిచి 2-0 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్స్‌లో తన స్థానాన్ని భద్రపరచుకుంది. ఈ విజయం ఆమెను ప్రతిష్టాత్మక ఈవెంట్‌లోని చివరి నాలుగు స్థానాల్లోకి తీసుకెళ్లింది, దివ్య మాజీ మహిళా ప్రపంచ ఛాంపియన్ టాన్ జోంగీతో తలపడనుండగా, కోనేరు చైనా ఫైనల్ ఫోర్‌లో లీతో తలపడనుంది. ఇక మ్యాచ్ విషయాని వస్తే మొదటి టైబ్రేక్ గేమ్‌లో దివ్య క్లాసికల్ ఇటాలియన్, గ్రెకో గాంబిట్‌ను ఉపయోగించింది. హారికకు బాగా తెలిసిన లైన్‌ను లక్ష్యంగా చేసుకుంది. హారిక సన్నద్ధతగా ఉన్నప్పటికీ తడబడింది. దివ్య ఛేదించడానికి మరియు కీలకమైన బంటును పొందడానికి వీలు కల్పించింది. వ్యూహాత్మక గందరగోళం తరువాత చివరికి హారిక రాజును బహిర్గతం చేసి రాజీనామాకు దారితీసింది. రెండవ గేమ్‌లో విజయం అవసరమైన హారిక, కింగ్స్ ఇండియన్ అటాక్ ద్వారా క్వీన్‌లెస్ మిడిల్ గేమ్‌ను ఎంచుకుంది. కానీ 22వ కదలికలో ఒక కీలకమైన అవకాశాన్ని కోల్పోయింది. హారిక సూక్ష్మమైన ఎండ్‌గేమ్ అవకాశాన్ని గోల్‌గా మార్చడంలో విఫలమైంది.

# వాణిజ్యం

# చందా కొచ్చర్‌పై ఆరోపణలు నిజమే



**ముంబై, జూలై 23:** వీడియోకాన్ గ్రూపునకు రూ.300 కోట్ల రుణాన్ని మంజూరు చేసినందుకు ఐసిఐసిఐ బ్యాంకు మాజీ సిఇఓ, ఎండి చందాకొచ్చర్ రూ.64 కోట్లు లంచం తీసుకున్నట్లు తేలింది. అప్పిలేట్ ట్రిబ్యునల్ జూలై 3న ఇచ్చిన ఉత్తర్వుల్లో ఈ మేరకు ఇటీవల తీర్పు వెలువరించింది. విడియోకాన్‌కు సంబంధించిన కంపెనీ ద్వారా చందాకొచ్చర్ భర్త దీపక్‌కొచ్చర్ నుంచి ఈ డబ్బును తరలించినట్లు ట్రిబ్యునల్ తెలిపింది. ఈ చెల్లింపు క్విడ్ ప్రోకో (పరస్పర ప్రయోజనాలు) కేసు అని ట్రిబ్యునల్ పేర్కొంది. దాంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసుకు బలం చేకూరింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) సెక్షన్ 50 కింద నమోదైన డాక్యుమెంటరీ సాక్ష్యాలు, వాంగ్మూలాలను ఇడి అందించిందని, వీటిని చట్టపరంగా ఆమోదించినట్లు అప్పిలేట్ తెలిపింది. రుణ ఆమోదం కోసం ఐసిఐసిఐ బ్యాంకు అంతర్గత నిబంధనలను ఉల్లంఘించారని ఇవి స్పష్టంగా చూపుతున్నట్లు పేర్కొంది. విడియోకాన్ గ్రూప్ కంపెనీ ఎస్ఇపిఎల్ నుంచి దీపక్ కొచ్చర్ నేతృత్వంలోని నూపవర్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.64 కోట్లు పంపినట్లు ట్రిబ్యునల్ వివరించింది. తర్వాత రోజే విడియోకాన్‌కు ఐసిఐసిఐ బ్యాంకు రూ.300 కోట్ల రుణాన్ని మంజూరు చేసినట్లు తేలింది. ఎన్ఆర్పిఎల్ యాజమాన్య బాధ్యతలు మొదట విడియోకాన్ చైర్మన్ వేణుగోపాల్ ధూత్ వద్ద ఉన్నట్లు చూపించినప్పటికీ, నిజమైన నియంత్రణ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన దీపక్ కొచ్చర్ వద్ద ఉందని ట్రిబ్యునల్ అభిప్రాయపడింది. రుణాన్ని ఆమోదించేటప్పుడు చందా కొచ్చర్ ఈ సంబంధాలను ప్రకటించనందుకు నేరానికి పాల్పడినట్లు స్పష్టమవుతుందని పేర్కొంది. చందాకొచ్చర్, ఆమె కుటుంబానికి చెందిన అటాచ్ చేసిన ఆస్తులను విడుదల చేయడానికి అనుమతిస్తూ 2020 నవంబర్‌లో అడ్జుడికేటింగ్ అథారిటీ ఇచ్చిన తీర్పును ట్రిబ్యునల్ తప్పు బట్టింది. ఆస్తులకు సం బంధించి తగిన ఆధారాలు లేవని అథారిటీగుర్తించింది. ట్రిబ్యునల్ దీన్ని తీవ్రంగా విభేదించింది. అప్పటి అథారిటీ కీలక విషయాలను విస్మరించిందని పేర్కొంది.

## పేపాల్ సహా విదేశాల్లోనూ భారత్ యుపిఐ సేవలు


**న్యూఢిల్లీ, జూలై 23:** యూపీఐ సేవలు మన నిత్య జీవితంలో భాగమయ్యాయి. ఈ డిజిటల్ చెల్లింపులు ఇప్పుడు దేశ సరిహద్దులు కూడా దాటాయి. ఇక మీదట విదేశాల్లో కూడా యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చు. అంతర్జాతీయ చెల్లింపులకు వీలు కల్పించేలా గ్లోబల్ పేమెంట్ కంపెనీ పేపాల్ కొత్త ఫీచర్‌ను తీసుకువచ్చింది. పేపాల్ వరల్డ్ అనే కొత్త ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించినట్లు పేపాల్ ప్రకటించింది. ప్రపంచంలోని అతిపెద్ద చెల్లింపు వ్యవస్థలు, డిజిటల్ వాలెట్లను అనుసంధానించే లక్ష్యంతో దీనిని తీసుకువచ్చినట్లు పేర్కొంది. ఈ ప్లాట్‌ఫామ్ పేపాల్, పేమెంట్ యాప్ వెన్మో మధ్య ఇంటర్ ఆపరేబిలిటీని అందిస్తుంది. ఇందులో యూపీఐని చేర్చారు. దీంతో భారతీయ కస్టమర్లు అంతర్జాతీయంగా షాపింగ్ చేయవచ్చు. యూపీఐ ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. ఉదాహరణకు.. భారత్‌లోని ఓ కస్టమర్ ఆమెరికాలోని ఏదైనా ఆన్‌లైన్ స్టోర్‌లో వస్తువును కొనాలనుకుంటున్నాడని అనుకుందాం. వస్తువును ఎంపిక చేసుకున్న తర్వాత చెక్‌అవుట్‌లో అతడు పేపాల్ ఆప్షన్‌ను వినియోగిస్తే యూపీఐ బటన్ కనిపిస్తుంది.



యూపీఐ అకౌంట్‌తో చెల్లింపులు చేసేయవచ్చు. ఇక్కడ యూపీఐ ఎలా పనిచేస్తుందో.. అలానే ఉపయోగించి అంతర్జాతీయ లావాదేవీలను పూర్తి చేయవచ్చు. ఎన్‌పీసీఐ ఇంటర్నెషనల్ పేమెంట్స్ లిమిటెడ్ సీఈవో రితేశ్ శుక్లా ఈ పరిణామాన్ని స్వాగతించారు. యూపీఐ సేవలను అంతర్జాతీయంగా విస్తరించడంలో పేపాల్ వరల్డ్ ప్లాట్‌ఫామ్, యూపీఐల అనుసంధానం ఒక కీలక ముందడుగని ఆయన పేర్కొన్నారు.

## టిసిఎస్‌పై కేంద్ర మంత్రికి ఫిర్యాదు

**ముంబై, జూలై 23:** వివిధ కంపెనీల్లో రెండేళ్ల నుంచి ఎనిమిదేళ్ల మధ్య ఉన్న ఉద్యోగులకు టీసీఎస్ కొలువులు ఆఫర్ చేసి.. ఆపై జాయినింగ్ డేట్లు ఇవ్వడం లేదని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మండవీయాకు బాధితులు ఫిర్యాదు చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. నాస్‌సెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనెట్ ఈమేరకు కేంద్రానికి లేఖ రాసింది. దాదాపు 600 మంది అనుభవం ఉన్న వ్యక్తులకు ఆఫర్ లెటర్లు ఇచ్చి జాయినింగ్‌లో మాత్రం ఎడతెగని జాప్యం చేస్తోందని పేర్కొంది. సదరు ఉద్యోగులు ఆర్థిక, మానసిక, వృత్తిపరంగా దెబ్బతింటున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఎన్ఐటిఇఎస్ కేంద్ర మంత్రి మాండవీయకు రాసిన లేఖలో కీలక విషయాలను ప్రస్తావించింది. పలువురు వ్యక్తులకు టీసీఎస్ నుంచి అధికారికంగా జాబ్ ఆఫర్ అందిన తర్వాత.. జాయినింగ్ డేట్‌ను మాత్రం వాయిదా వేస్తూ వస్తోన్నట్లు తెలిసింది. ఈ అభ్యర్థులంతా బెంగళూరు, హైదరాబాద్, పుణె, కోల్‌కతా, ముంబయి, ఢిల్లీ ప్రాంతాలకు చెందినవారు. వీరికి 28ఏళ్ల మధ్య అనుభవం ఉంది. సదరు అభ్యర్థులు తమ పాత ఉద్యోగాలకు రాజీనామా లేఖలను సమర్పించారు. వాస్తవానికి వారు తొలుత జాయినింగ్ కోసం టీసీఎస్‌కు వెళ్లగా.. దానిని వాయిదా వేసి.. ఆ తర్వాత ఎటువంటి అప్‌డేట్లు పంపలేదు. ఫలితంగా ఈ నిపుణులు ఆర్థికంగా, మానసికంగా, వృత్తిపరంగా కుంగిపోతున్నారని ఆ లేఖలో పేర్కొంది. దీనిపై ఎన్ఐటిఇఎస్ అధ్యక్షుడు, ముంబయి హైకోర్టు న్యాయవాది హర్‌ప్రీత్ సింగ్ సలుజా మాట్లాడుతూ అభ్యర్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు ఈ అంశంపై టెక్ దిగ్గజం టీసీఎస్ స్పందించింది. తాము ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నట్లు చెప్పిందని కొన్ని రిపోర్ట్‌లు పేర్కొన్నాయి. ఎప్పటిలానే మేము ఆ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాం. మేము ఇచ్చిన అన్ని ఆఫర్లను పూర్తి చేస్తాము. అది ఫ్రెషర్స్ అయినా.. అనుభవజ్ఞులైనా టీసీఎస్ నుంచి ఆఫర్ లెటర్ అందుకొన్న ప్రతిఒక్కరూ కంపెనీలో ఉంటారు. మావ్యాపారం డిమాండ్ ఆధారంగా జాయినింగ్ డేట్లు ఆధారపడి ఉంటాయి. మరికొన్ని కేసుల్లో అవి వ్యాపార అవసరాలకు తగినట్లు మారుతుంటాయి. ఈ కేసుకు సంబంధించి అభ్యర్థులందరితో మేము టచ్‌లో ఉన్నాము. వారు మా కంపెనీలో చేరేందుకు ఎదురుచూస్తున్నాం అని పేర్కొంది. టీసీఎస్ అభ్యర్థుల జాయినింగ్ డేట్లకుసంబంధించి కచ్చితంగా టైమ్‌లైన్ ప్రకటించేలా జోక్యం చేసుకోవాలని ఎన్ఐటిఇఎస్ కార్మిక శాఖను కోరింది. జాప్యానికి తగిన ఆర్థికపరిహారం కూడా ఇప్పించాలని, టీసీఎస్ ఎంప్లాయిస్ అసిస్టెంట్ ప్రోగ్రాం ద్వారా అభ్యర్థులు కోలుకొనేటట్లు సాయం చేయాలంది.



## ఆర్‌బిఐ రేట్ల కోత మ్యాజిక్ బుల్లెట్ కాదు: రఘురామ్ రాజన్




**న్యూఢిల్లీ, జూలై 23:** ఆర్‌బిఐ వడ్డీ రేట్ల తగ్గింపు పెట్టుబడులను ఇతోధికం చేసే మ్యాజిక్ బుల్లెట్ కాబోదని మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. ఆర్థిక వృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడంతో ఇతర అంశాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ప్రస్తుత తరుణంలో వడ్డీరేట్లు అధికంగా లేవన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆర్‌బిఐ రేట్ల కోత ఫలితమిచ్చేందుకు సమయం పడుతుందన్నారు. ఆర్‌బిఐ ఈ యేడాది ఇప్పటి వరకు ఒక శాతం మేర రెపో రేటును తగ్గించడం తెలిసిందే. కేవలం వడ్డీ రేట్లతోనే ఇది సాధ్యపడుతుందని నేను అనుకోవడం లేదు. ఒకటికి మించిన అంశాలు ఇందులో పనిచేస్తాయి. మరిన్ని రంగాల్లో పోటీని పెంచాలి. తమ సానుకూలతలను కాపాడుకునేందుకు వీలుగా పెట్టుబడులపై మరింతగా దృష్టిపెట్టే విధంగా పరిశ్రమలను ప్రోత్సహించాలి. మరిన్ని కార్పొరేట్ పెట్టుబడులు వస్తాయని నేను విశ్వసిస్తున్నాను అని రాజన్ పేర్కొన్నారు. ప్రైవేట్ పెట్టుబడులు 11 యేళ్ల కనిష్టానికి పడిపోయినట్లు కేంద్రప్రభుత్వ గణాంకాల ఆధారంగా తెలుస్తోంది.

## మింత్రాపై ఇడి కేసు

**ముంబై, జూలై 23:** ఫ్లిప్‌కార్ట్ యాజమాన్యంలోని ఫ్యాషన్ ఇ-టైలర్ మింత్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్, 1999 కింద ఫిర్యాదు దాఖలు చేసింది. మింత్రా, దాని సంబంధిత సంస్థలు విదేశీ పెట్టుబడి నిబంధనలను ఉల్లంఘించి, రూ.1,654.35 కోట్ల మేరకు నిబంధనలను అతిక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మింత్రా హోల్‌సేల్ 'క్యాష్ అండ్ క్యారీ' మార్గాన్ని దుర్వినియోగం చేసి, ఎఫ్‌డిఐ విధానంలో నిషేదించబడిన మల్టీ-బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్ నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మింత్రా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని హోల్‌సేల్ ట్రేడింగ్ కోసం పొందినట్లు పేర్కొన్నప్పటికీ, ఎక్కువ భాగం విక్రయాలను సంబంధిత సంస్థ అయిన వెక్టర్ ఇ-కామర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నేరుగా వినియోగదారులకు అమ్మినట్లు ఇడి గుర్తించింది. ఈ నిర్మాణం బి2బి, బి2సి కార్యకలాపాలను విభవించడం ద్వారా నిబంధనలను ఉల్లంఘించేలా రిటైల్ ట్రేడ్‌లో నిమగ్నమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏప్రిల్ 1, 2010, అక్టోబరు 1, 2010 నాటి ఎఫ్‌డిఐ విధాన సవరణల ప్రకారం, హోల్‌సేల్ విక్రయాలలో కేవలం 25శాతం మాత్రమే గ్రూప్ కంపెనీలకు వెళ్లాలనే నిబంధనను మింత్రా ఉల్లంఘించినట్లు ఇడి తేల్చింది. మింత్రా, ఇతరులు ఫెమా సెక్షన్ 6(3)(ఇ)తో పాటు ఏకీకృత ఎఫ్‌డిఐ విధానాలను అతిక్రమించినట్లు ఇడి నిర్ధారించింది. దీని ఫలితంగా మొత్తం రూ.1,654.35 కోట్ల ఉల్లంఘన జరిగినట్లు తేలింది. నిజానికి హోల్‌సేల్ వ్యాపారం చేసే సంస్థలు నేరుగా కస్టమర్లకు ఉత్పత్తులను అందించకూడదు. రిటైలర్లకు లేదా ఇతర వ్యాపార సంస్థలకు హోల్‌సేల్‌గా అమ్మాలి. అయితే మింత్రా మాత్రం తన అనుబంధ సంస్థ ద్వారా నేరుగా కస్టమర్లకు ఉత్పత్తులను అమ్మింది. ఇది ఫెమా ఉల్లంఘనల కిందకు వస్తుందని.. అందుకే కేసు నమోదు చేసినట్లు ఈడీ తెలిపింది. ఈ కేసుపై మాత్రం మింత్రా ఇంకా స్పందించలేదు.

## స్టాక్ సూచీలకు బ్యాంకు, ఆటో షేర్ల మద్దతు

**ముంబై, జూలై 23:** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన సూచీలు లాభాల్లో ముగిశాయి. యూఎస్ జపాన్ మధ్య ట్రేడ్ డీల్ కుదిరిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో ఆసియా సహా, మన మార్కెట్లూ రాణించాయి. ఆగస్టు 1 డెడ్‌లైన్‌కు ముందే మరిన్ని ట్రేడ్ డీల్స్ కుదరొచ్చన్న సంకేతాలిచ్చింది. ముఖ్యంగా ఆటో, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25,200 ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 82,451.87 పాయింట్ల లాభంతో (క్రితం ముగింపు 82,186.81) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,786.43 పాయింట్ల వద్ద గరిష్మాన్ని తాకిన సూచీ.. 539.83 పాయింట్ల లాభంతో 82,726.64 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 159 పాయింట్ల లాభంతో 25,219.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.43గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హిందుస్థాన్ యూనిలీవర్, బీఈఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐటీసీ, టైటాన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 68.10 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3,437.60 డాలర్లు ట్రేడయింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14